


తెలుగు జాతీయ దినపత్రిక

# అక్షర విజేత

నిజం నిర్భయం నిష్పక్షం

తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, కర్ణాటక





హైదరాబాద్ సంపుటి:05 సంచిక :299 ఎడిటర్ : బి. అనిల్ కుమార్ పేజిలు : 12, వెల. 6రూ/ మంగళవారం- 12 - మే - 2026


## ఐపీఎల్ లో నేడు ఢిల్లీతో పంజాబ్ ఢీ...



పంజాబ్‌తో మ్యాచ్‌లో టాస్ గెలిచిన ఢిల్లీ క్యాపిటల్స్

మొదట బౌలింగ్ చేయాలని నిర్ణయించిన కెప్టెన్ అక్షర్ పటేల్

ఢిల్లీ జట్టులో ఐదు కీలక మార్పులు

పంజాబ్ తరపున ఐపీఎల్‌లోకి అరంగేట్రం చేయనున్న బెన్ డ్వార్షియస్

ఢిల్లీ : ఐపీఎల్ లో నేడు పంజాబ్ కింగ్స్‌తో మ్యాచ్‌లో ఢిల్లీ క్యాపిటల్స్ టాస్ గెలిచింది. ధర్మశాలలోని హిమాచల్ ప్రదేశ్ క్రికెట్ అసోసియేషన్ స్టేడియం వేదికగా జరుగుతున్న ఈ కీలక పోరులో ఢిల్లీ కెప్టెన్ అక్షర్ పటేల్ ఫీల్డింగ్ ఎంచుకున్నాడు. దీంతో శ్రేయస్ అయ్యర్ నేతృత్వంలోని పంజాబ్ కింగ్స్ జట్టు మొదట బ్యాటింగ్ చేయనుంది. టాస్ గెలిచిన అనంతరం అక్షర్ పటేల్ మాట్లాడుతూ.. ఈ సీజన్‌లో తమకు టాస్ గెలవడం మాత్రమే కలిసొస్తోందని సరదాగా వ్యాఖ్యానించాడు. మిగతా..2లో

## తెలంగాణ మహిళా కమిషన్ ఛైర్‌పర్సన్‌గా గద్వాల విజయలక్ష్మి నియామకం



ఆరుగురు సభ్యులను కూడా నియమించిన ప్రభుత్వం

సభ్యుల్లో కాసోజు శంకరమ్మ, చిట్యాల శ్వేత తదితరులు

ఉత్తర్వులు జారీ చేసిన తెలంగాణ ప్రభుత్వం

హైదరాబాద్: తెలంగాణ రాష్ట్ర మహిళా కమిషన్ ఛైర్‌పర్సన్‌గా గద్వాల విజయలక్ష్మి నియమితులయ్యారు. మహిళా కమిషన్ ఛైర్‌పర్సన్, ఆరుగులు సభ్యులను నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఈరోజు ఉత్తర్వులు జారీ చేసింది. సభ్యులుగా కాసోజు శంకరమ్మ, చిట్యాల శ్వేత, శశికళ యాదవ రెడ్డి, సదాలక్ష్మి, రాధాబాయి, ఉజ్మా షకీరాలను నియమించారు. వీరి పదవీకాలం ఐదేళ్ల పాటు ఉంటుందని ప్రభుత్వం ఉత్తర్వుల్లో పేర్కొంది. తెలంగాణ రాష్ట్ర మహిళా కమిషన్ రాష్ట్రంలోని మహిళల హక్కులను పరిరక్షించడానికి, వారిపై జరుగుతున్న మిగతా..2లో

తమతో కలిసి రావాలన్న మోదీ వ్యాఖ్యలపై

## రేవంత్ రెడ్డి స్పందన



2

- ★ తమతో కలిసి రావాలని రేవంత్ కు చెప్పిన మోదీ
- ★ కేంద్రంతో కలిసి పనిచేసేందుకు సిద్ధమన్న రేవంత్ రెడ్డి
- ★ ప్రజల సంక్షేమం కోసం ఇచ్చిపుచ్చుకునే ధోరణి అవసరమని వ్యాఖ్య

హైదరాబాద్: రాష్ట్ర అభివృద్ధి కోసం రాజకీయాలను పక్కన పెట్టి కేంద్రంతో కలిసి పనిచేసేందుకు తాము సిద్ధమని తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. 'గుజరాత్ కు ఇచ్చినంత తెలంగాణకు కూడా ఇస్తాం. మాతో కలిసిరండి' అని ప్రధాని మోదీ ఇచ్చిన పిలుపును స్వాగతిస్తూ, పార్టీల ఐడియాలజీలు వేరైనా ప్రజల సంక్షేమం కోసం 'గివ్ అండ్ టేక్' (ఇచ్చిపుచ్చుకునే)

వారికి ప్రభుత్వం గుడ్‌న్యూస్..

## భారీగా నియామకాలు

- ▶▶ తెలంగాణ ప్రభుత్వం ఇంటర్నేషనల్ నర్సెస్ డే సందర్భంగా భారీ స్థాయిలో నర్సింగ్ నియామకాలు చేపట్టింది.
- ▶▶ రాష్ట్ర ఆరోగ్యశాఖలో ఎంపికైన 1919 మంది నర్సింగ్ ఆఫీసర్లకు మంగళవారం తెలంగాణ ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ నియామక పత్రాలను అందజేయనున్నారు.

హైదరాబాద్, మే11 : తెలంగాణ ప్రభుత్వం ఇంటర్నేషనల్ నర్సెస్ డే సందర్భంగా భారీ స్థాయిలో నర్సింగ్ నియామకాలు చేపట్టింది. రాష్ట్ర ఆరోగ్యశాఖలో ఎంపికైన 1919 మంది నర్సింగ్ ఆఫీసర్లకు రేపు (మంగళవారం) తెలంగాణ ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ నియామక పత్రాలను అందజేయనున్నారు.

### ఉస్మానియా మెడికల్ కాలేజీ గ్రౌండ్స్‌లో భారీ కార్యక్రమం

ఈ నియామక పత్రాల పంపిణీ కార్యక్రమం ఉస్మానియా మెడికల్ కాలేజీ గ్రౌండ్స్‌లో రేపు సాయంత్రం 4 గంటలకు నిర్వహించనున్నారు. భారీసంఖ్యలో అభ్యర్థులు హాజరుకానుండటంతో అధికారులు ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు. నర్సులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా తాగునీరు, కూర్చునే సదుపాయం, ట్రాఫిక్ నియంత్రణ, పార్కింగ్ వంటి అంశాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని మంత్రి దామోదర్ రాజనర్సింహ అధికారులకు ఆదేశాలు జారీ చేశారు.

### ఆరోగ్యశాఖలో 1919 పోస్టుల భర్తీ..



రాష్ట్ర ఆరోగ్యశాఖలో ఖాళీగా ఉన్న 1919 నర్సింగ్ ఆఫీసర్ పోస్టులను ప్రభుత్వం భర్తీ చేస్తోంది. వీరితో పాటు లేబర్ డిపార్ట్‌మెంట్‌లో మరో 257 నర్సింగ్ ఆఫీసర్ పోస్టులను కూడా భర్తీ చేయనున్నారు. ఈ నియామక ప్రక్రియను మెడికల్ అండ్ హెల్త్ సర్వీసెస్ రిక్రూట్‌మెంట్ మిగతా..2లో

ఏపీకి అడిగినన్ని నిధులు ఇస్తున్నారు..

## తెలంగాణకు ఏం ఇచ్చారు?



2లో

- ● జనగణన ఫారమ్‌లలో లోపాలు ఉన్నాయన్న పొన్నం
- ● బీసీలను విస్మరించారని విమర్శ
- ● గత 12 ఏళ్లలో తెలంగాణకు కేంద్రం ఇచ్చిన నిధులపై చర్చకు సిద్ధమని సవాల్

హైదరాబాద్: కేంద్ర ప్రభుత్వం చేపట్టిన జనగణన, హౌస్ హోల్డ్ సర్వే ఫారమ్‌లలో తీవ్రమైన లోపాలు ఉన్నాయని తెలంగాణ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. సర్వే ఫారమ్‌లో కేవలం ఎస్సీ, ఎస్టీ అనే ఆప్షన్లు మాత్రమే ఉన్నాయని, మెజారిటీ జనాభా కలిగిన బీసీల ప్రస్తావనే లేకపోవడం వారిని విస్మరించడమేనని మండిపడ్డారు.

ఎవరి ఒత్తిళ్లు, ఆంక్షలకు భారత్ తలొగ్గదని


## నిరూపించాం

- ★ చంద్రయాన్ ప్రాజెక్టులో రోవర్ దిగేచోటును శివశక్తి పాయింట్ అని పేరు పెట్టాం
- ★ సోమ్ నాథ్ మహాదేవ్ ఆలయ పునర్నిర్మాణం జరిగి 75 ఏళ్లు పూర్తవుతున్న సందర్భంగా నిర్వహిస్తున్న వేడుకల్లో మోదీ- స్మారక నాణెం విడుదల



ఢిల్లి : ప్రపంచంలోని ఎవరి ఒత్తిళ్లు, ఆంక్షలకు భారత్ తలొగ్గదని నిరూపించామని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అన్నారు. అటల్ నేతృత్వంలో భారత్ సత్తా అంటే ప్రపంచానికి ఏమిటో చూపించామని గుర్తు చేశారు. గుజరాత్ లోని పవిత్ర పుణ్యక్షేత్రమైన సోమ్ నాథ్ మహాదేవ్ ఆలయ పునర్నిర్మాణం జరిగి 75 ఏళ్లు పూర్తవుతున్న సందర్భంగా నిర్వహిస్తున్న వేడుకల్లో ప్రధాని మోదీ పాల్గొన్నారు. వేదికపై నుంచి 75 ఏళ్ల పునర్నిర్మాణానికి గుర్తుగా ప్రత్యేక పోస్టల్ స్టాంపుతో పాటు 75 రూపాయల స్మారక నాణేన్ని ప్రధాని విడుదల చేశారు. ఆధ్యాత్మిక కార్యక్రమాల అనంతరం ప్రధాని సద్భావన మైదానంలో మిగతా..2లో

## బంగాల్ ఓట్ల తొలగింపు అంశంపై మమతా బెనర్జీకి సుప్రీంకోర్టు వెసులుబాటు



2

- ● బంగాల్ లో గెలుపొందిన వారికి వచ్చిన మెజారిటీ కంటే తొలగించిన ఓట్లే ఎక్కువ
- ● 31 స్థానాల్లో ఇలానే జరిగిందని మమతా బెనర్జీ ఆరోపణ
- ● కొత్త పిటిషన్లు వేసుకోవడానికి అనుమతించిన సుప్రీంకోర్టు

ఎంకే స్టాలిన్ తో

## తమిళనాడు సీఎం విజయ్ భేటీ

- ❖ వైకో, అన్బుమణి, సీమన్ లను మర్యాదపూర్వకంగా కలిసిన విజయ్
- ❖ మంగళవారం వీసీకే నేత తరుమావళవన్ ను కూడా కలవనున్నట్లు సమాచారం!



ఢిల్లి : తమిళనాడు ముఖ్యమంత్రి విజయ్ , డీఎంకే అధినేత ఎంకే స్టాలిన్ ను ఆయన నివాసంలో సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఆ తర్వాత ఆయన వివిధ పార్టీల నేతలతోనూ మర్యాదపూర్వంగా కలిసి, వారితో మాట్లాడారు. తమిళనాడు 17వ అసెంబ్లీ తొలి సమావేశాలు ఈ రోజు అంటే మే 11న ప్రారంభమయ్యాయి. నూతనంగా ఎన్నికైన శాసనసభ్యులు ఈ రోజు ప్రమాణ స్వీకారం చేశారు. అసెంబ్లీ మొదటి రోజు సమావేశాలు ముగిసిన తర్వాత, సీఎం విజయ్ , మాజీ ముఖ్యమంత్రి, డీఎంకే అధ్యక్షుడు ఎంకే స్టాలిన్ ఇంటికి వెళ్లారు. ఆయనకు డీఎంకే శాసనసభ కమిటీ అధ్యక్షుడు ఉదయని ధి స్టాలిన్ స్వాగతం పలికారు. స్టాలిన్ పుష్పగుచ్ఛం ఇచ్చి సాదరంగా ఆహ్వానించారు. అనంతరం విజయ్ , స్టాలిన్ కు శాలువా కప్పి సత్కరించారు. వారితో కొద్దిసేపు మాట్లాడిన తర్వాత సీఎం విజయ్ అక్కడి నుంచి వెళ్లిపోయారు. ఈ భేటీపై స్టాలిన్ సోషల్ మీడియా వేదికగా స్పందించారు. "తమిళనాడు ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన గౌరవనీయులు విజయ్ , మిగతా..2లో

అనంతపురం జిల్లాకు

## వెళ్లనున్న జగన్



2

- ★ పామిడిలో ఒక వివాహ రిసెప్షన్ వేడుకకు హాజరుకానున్న జగన్
- ★ అనంతరం తాడేపల్లికి బయల్దేరనున్న వైసీపీ అధినేత
- ★ జగన్ రాక సందర్భంగా భారీ ఏర్పాట్లు చేస్తున్న వైసీపీ శ్రేణులు

2027 గోదావరి పుష్కరాలలోపు

## పోలవరం పూర్తికి సహకరించాలి

- ● ఢిల్లీలో సీఎం చంద్రబాబు పర్యటన
- ● పోలవరం ప్రాజెక్టు తదుపరి పనులకు నిధులు మంజూరు చేయాలని పాటిల్‌కు వినతి
- ● కేంద్ర హోంమంత్రి అమిత్ షాతోనూ భేటీ




అమరావతి : 2027 గోదావరి పుష్కరాలలోపు ఈ ప్రతిష్ఠాత్మక ప్రాజెక్టును పూర్తి చేసేందుకు సహకారం అందించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు విజ్ఞప్తి చేశారు. ఢిల్లీలో పర్యటిస్తున్న చంద్రబాబు రాష్ట్ర ప్రయోజనాలే లక్ష్యంగా పలువురు కేంద్ర మంత్రులు, ఉన్నతాధికారులతో వరుస భేటీలు అయ్యారు. తొలుత పార్టీ ఎంపీలతో సమావేశమై, ఢిల్లీలో వివిధ శాఖల వారీగా జరుగుతున్న పనుల పురోగతిని ముఖ్యమంత్రి సమీక్షించారు. పోలవరం ప్రాజెక్టు పూర్తికి సహకారం అందించాలి: తొలి దశలో 41.15 మీటర్ల మేర నీటిని నిల్వ చేసేందుకు అవసరమైన నిర్మాణాలను పూర్తి చేయాలని కేంద్ర జలశక్తి శాఖ మంత్రి సీఆర్ పాటిల్‌ను చంద్రబాబు కోరారు. ఇప్పటికే తాను స్వయంగా 5 సార్లు ప్రాజెక్టును సందర్శించి పనుల పురోగతిని సమీక్షించినట్టు వివరించారు. మిగతా..2లో

ఏపీని కరవు రహితంగా మార్చడంలో

## పోలవరం కీలకం




2లో

- ➤ పీపీఏ, సీడబ్ల్యూసీ నిర్దేశించిన గడువు ప్రకారం 2027 నాటికి ప్రాజెక్టును పూర్తి చేస్తామని కేంద్ర మంత్రి సీఆర్ పాటిల్ స్పష్టం చేసినట్లు ఏపీ మంత్రి నిమ్మల రామానాయుడు చెప్పారు.
- ➤ ఏపీని కరవు రహిత రాష్ట్రంగా మార్చడంలో పోలవరం కీలకమని తెలిపారు.

న్యూఢిల్లీ, మే 11: పోలవరం ప్రాజెక్ట్ 2027 జూన్ నాటికి పూర్తవుతుందని ఏపీ నీటిపారుదల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు తెలిపారు.

అక్షర విజేత



మొదటి పేజి తరువాయి

# అనంతపురం జిల్లాకు వెళ్లనున్న జగన్

అమరావతి : వైసీపీ అధినేత జగన్ రేపు అనంతపురం జిల్లాలో పర్యటించనున్నారు. యూరప్ పర్యటన ముగించుకుని స్వదేశానికి వచ్చిన తర్వాత ఆయన చేపడుతున్న మొదటి జిల్లా పర్యటన ఇదే కావడంతో పార్టీ శ్రేణుల్లో ఉత్సాహం నెలకొంది. రేపు మధ్యాహ్నం ఆయన అనంతపురం జిల్లాలోని పామిడికి చేరుకుంటారు. ఎమ్మెల్సీ మధుసూదన్ కుమారుడు చైతన్య మిత్ర, వైసీపీ నేత పామిడి వీరా కుమార్తె, ఏడీసీసీ బ్యాంకు మాజీ ఛైర్‌పర్సన్ లిఖితల వివాహ రిసెప్షన్ వేడుకకు ఆయన హాజరుకానున్నారు. గుంతకల్లు నియోజకవర్గం పరిధిలోని పామిడిలో నిర్వహించనున్న ఈ వేడుకలో పాల్గొని, నూతన వధూవరులను జగన్ ఆశీర్వదించనున్నారు. జగన్ రాకను పురస్కరించుకుని పామిడిలో పార్టీ నాయకులు, కార్యకర్తలు భారీ ఏర్పాట్లు చేస్తున్నారు. ఉమ్మడి అనంతపురం జిల్లాలోని పార్టీ కీలక నేతలందరూ ఈ వేడుకకు తరలివచ్చే అవకాశం ఉంది. భద్రతా పరమైన ఇబ్బందులు తలెత్తకుండా అధికారులు ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు. ఈ కార్యక్రమం ముగిసిన అనంతరం ఆయన తాడేపల్లికి బయల్దేరుతారు.

# ఎంకే స్టాలిన్ తో తమిళనాడు సీఎం విజయ్ భేటీ

నన్ను కలిసి, నాకు గ్రీట్ చేశారు. నేను కూడా వారికి నా హృదయపూర్వక అభినందనలు తెలియజేశాను. సలహాలు ఇచ్చాను" అని పేర్కొన్నారు.

## అన్ని పార్టీల నేతలను కలుస్తున్న విజయ్!

ఆ తర్వాత విజయ్ , ఎండీఎంకే ప్రధాన కార్యదర్శి వైకోను కలిశారు. ప్రభుత్వ ఏర్పాటులో తనకు మద్దతు తెలిపినందుకు ధన్యవాదాలు తెలియజేశారు. తర్వాత చెన్నైలో నీలన్ కరైలో ఉన్న నామ్ తమిళర్ కచ్చి (ఎన్‌టీపీ) ప్రధాన సమన్వయకర్త సీమన్ నివాసానికి విజయ్ వెళ్లారు. ఆయనను సాదరంగా ఆహ్వానించిన సీమన్ శాలువ కప్పి సత్కరించి, శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం పీఎంకే నేత అన్బుమణి రామదాస్ ఇంటికి విజయ్ స్వయంగా వెళ్లి కలిశారు. అన్బుమణి భార్య, వారి కుటుంబ సభ్యులతో మాట్లాడి, ఫొటో దిగారు. ఇక మంగళవారం ఆయన వీసీకే నేత తరుమావళవన్ ను కూడా కలవనున్నట్లు తెలుస్తోంది.

## చరిత్ర సృష్టించిన విజయ్

మే 4న విడుదలైన తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల్లో టీవీకే పార్టీ 108 స్థానాలు గెలుచుకొని అతిపెద్ద పార్టీగా అవతరించింది. కాంగ్రెస్, కమ్యూనిస్టు పార్టీలు, వీసీకే, ఇండియన్ యూనియన్ ముస్లిం లీగ్ వంటి పలు పార్టీల శాసన సభ్యుల మద్దతు ఇవ్వడంతో ఆయనను ప్రభుత్వం ఏర్పాటు చేసేందుకు గవర్నర్ ఆర్లేకర్ ఆహ్వానించారు. దీనితో టీవీకే నేత విజయ్ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేశారు. ఆదివారం చెన్నైలోని నెహ్రూ ఇండిరో స్టేడియంలో ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేశారు. ఆయనతోపాటు 9 మంది మంత్రులు కూడా ప్రమాణస్వీకారం చేసినవారిలో ఉన్నారు. కాగా, 17వ శాసనసభ తొలి సమావేశాలు ఈ రోజు ఉదయం 9.30 గంటలకు ప్రారంభమయ్యాయి. నూతనంగా ఎన్నికైన ఎమ్మెల్యేలు ప్రమాణ స్వీకారం చేశారు. కాగా, మంగళవారం (మే 12) స్పీకర్, డిప్యూటీ స్పీకర్ ఎన్నిక జరుగుతుంది. మే 13న ముఖ్యమంత్రి విజయ్ శాసన సభలో తన ప్రభుత్వ మెజారిటీని నిరూపించుకోవాల్సి ఉంటుంది.

# ఏపీకి అడిగినన్ని నిధులు ఇస్తున్నారు.. తెలంగాణకు ఏం ఇచ్చారు?

బీసీల అభివృద్ధికి కులగణన అత్యవసరమని, కేంద్రం ఈ విషయంలో వివక్ష చూపుతోందని ఆయన విమర్శించారు. తెలంగాణపై కేంద్రం చూపుతున్న వివక్షపై స్పందించాలని రాష్ట్ర బీజేపీ నేతలకు మంత్రి సవాల్ విసిరారు. గత 12 ఏళ్లలో కేంద్రం నుంచి తెలంగాణకు వచ్చిన నిధులపై సికింద్రాబాద్ క్లాక్ టవర్ వద్ద లేదా మరెక్కడైనా సరే బహిరంగ చర్చకు తాను సిద్ధమని ప్రకటించారు. ఏపీకి అడిగినన్ని నిధులు ఇస్తున్న కేంద్రం, తెలంగాణకు ఎన్ని నిధులు తెచ్చారో బీజేపీ నేతలు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ప్రధాని మోదీ తెలంగాణ పర్యటనపై స్పందిస్తూ, "రాష్ట్రానికి ఏం ప్రాజెక్టులు ఇస్తారో చెప్పకుండా, బంగారం కొనొద్దు అని సలహాలు ఇవ్వడానికే మోదీ వచ్చారా?" అని ఎద్దేవా చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రులు అనేకసార్లు కేంద్ర మంత్రులను కలిసి విన్నవించినా నిధుల విడుదలపై స్పందన లేదని ఆవేదన వ్యక్తం చేశారు. రాముడిని తాము కూడా పూజిస్తామని, అయితే బీజేపీలాగా ఓట్ల కోసం దేవుడిని వాడుకోమని స్పష్టం చేశారు.

# తమతో కలిసి రావాలన్న మోదీ వ్యాఖ్యలపై రేవంత్ రెడ్డి స్పందన

ధోరణి అవసరమని ఆయన అభిప్రాయపడ్డారు. ముఖ్యంగా విజన్ 2047, 3 ట్రిలియన్ డాలర్ల ఎకానమీ లక్ష్యాలను చేరుకోవడానికి కేంద్రంతో కలిసి నడుస్తామని రేవంత్ చెప్పారు. ఎన్నోసార్లు కలిసినా కేంద్ర నుంచి ఆశించిన మద్దతు రాలేదని రేవంత్ అన్నారు. ప్రధాని 2 గంటల పాటు సమయం ఇస్తే తమ ప్రణాళికలను వివరిస్తామని చెప్పారు.

# ఐపీఎల్ లో నేడు ఢిల్లీతో పంజాబ్ ఢీ...

ధర్మశాలలో పిచ్ ఫ్రెష్‌గా ఉందని, ఫాస్ట్ బౌలర్లకు స్వింగ్ లభించే అవకాశం ఉన్నందున ఛేజింగ్‌కు మొగ్గు చూపుతున్నట్లు తెలిపాడు. ఈ మ్యాచ్ కోసం జట్టులో ఏకంగా ఐదు మార్పులు చేసినట్లు వెల్లడించాడు. ఈ సీజన్ లో ఇప్పటివరకు 11 మ్యాచ్ లు ఆడిన ఢిల్లీ జట్టు 7 మ్యాచ్ లలో ఓటమిపాలైంది. మరోవైపు, పంజాబ్ కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ మాట్లాడుతూ.. పిచ్ గురించి ఇప్పుడే అంచనా వేయలేమని, తమ ఆటగాళ్లు ఒత్తిడిని అధిగమించి సహజమైన ఆటతీరును ప్రదర్శించాలని సూచించాడు. స్వల్ప గాయంతో లాకీ ఫెర్గూసన్ దూరం కావడంతో, అతని స్థానంలో బెన్ ద్వార్షియస్ ఈ మ్యాచ్‌తో ఐపీఎల్‌లోకి అరంగేట్రం చేస్తున్నాడని ప్రకటించాడు.

# తెలంగాణ మహిళా కమిషన్ ఛైర్‌పర్సన్‌గా గద్వాల విజయలక్ష్మి నియామకం

అన్యాయాలు, వేధింపులను అరికట్టడానికి ఏర్పాటు చేయబడిన చట్టబద్ధమైన సంస్థ. ఇది మహిళలకు న్యాయం చేకూర్చడం, సంక్షేమం మరియు సాధికారత కోసం పనిచేస్తుంది.

# ఇక వారానికి 48 గంటలే పని- ఓవర్‌టైమ్ పనికి అదనపు చెల్లింపు- కొత్త లేబర్ కోడ్ లపై కేంద్రం గెజిట్ నోటిఫికేషన్

కొత్త లేబర్ కోడ్‌లపై తుది నిబంధనలతో 30 గెజిట్లు- మే 8, 9 తేదీల్లో ప్రచురించిన కేంద్రం- కనీస వేతనం లెక్కింపు సూత్రం తొలగింపు- ఫ్లోర్ వేజ్‌ను ఇంకా ఖరారు చేయని కేంద్రం

కార్మిక, ఉద్యోగ వర్గాలకు శుభవార్త. వారానికి 48 గంటల పని పరిమితి, తప్పనిసరిగా వారానికొక విశ్రాంతి దినం, ఓవర్‌టైమ్ పనికి అదనపు చెల్లింపుపై కేంద్ర ప్రభుత్వం గెజిట్ నోటిఫికేషన్లను జారీచేసింది. దీంతో గతంలో నాలుగు కార్మిక కోడ్‌లలో చేసిన ఈ ప్రతిపాదనలు అధికారిక హోదాను పొందాయి. దేశవ్యాప్తంగా కంపెనీలు వీటిని ఇక కచ్చితంగా పాటించాల్సిందే. వాస్తవానికి నాలుగు కార్మిక కోడ్‌లు 2025 నవంబరు 21 నుంచే అమల్లోకి వచ్చాయి. అయితే మే 8, 9 తేదీల్లో వాటికి సంబంధించిన తుది నిబంధనలు, నియమాలతో కేంద్ర ప్రభుత్వం దాదాపు 30 అధికారిక గెజిట్‌లను ప్రచురించింది. దీంతో ఈ కార్మిక సంస్కరణల ప్రక్రియ పూర్తయింది.

కనీస వేతనం లెక్కింపు సూత్రం తొలగింపు

కేంద్ర సర్కారు తాజాగా ప్రచురించిన గెజిట్ నోటిఫికేషన్లలోని అత్యంత కీలకమైన అంశం కార్మికుల కనీస వేతనం. కేంద్రం తొలుత విడుదల చేసిన నాలుగు కార్మిక కోడ్‌ల ముసాయిదాలో కనీస వేతనాన్ని ఎలా లెక్కించాలి అనే దానిపై స్పష్టమైన ఫార్ములాను, ప్రమాణాలను పేర్కొంది. కానీ, తాజాగా విడుదల చేసిన గెజిట్ నోటిఫికేషన్లలోని తుది నిబంధనలలో ఆ లెక్కింపు సూత్రాన్ని ప్రభుత్వం తొలగించింది. దీనికి బదులుగా, కనీస వేతన ప్రమాణాలను భవిష్యత్తులో కేంద్ర ప్రభుత్వం ఒక ప్రత్యేక లేదా సాధారణ ఉత్తర్వు ద్వారా విడిగా ప్రకటిస్తుందని స్పష్టంచేసింది. కనీస జీవన ప్రమాణం, దుస్తులు, గృహవసతి వంటి వాటితో పాటు సముచితంగా భావించే ఇతర అంశాలను పరిగణనలోకి తీసుకొని ఎప్పటికప్పుడు కనీస వేతనాన్ని నిర్ణయిస్తామని కేంద్ర ప్రభుత్వం కొత్త వేతన నిబంధనలు చెబుతున్నాయి.

ఫ్లోర్ వేజ్‌ను ఇంకా ఖరారు చేయని కేంద్రం

కేంద్ర ప్రభుత్వం 29 పాత కార్మిక చట్టాలను రద్దు చేసి, తీసుకొచ్చిన నాలుగు కొత్త కార్మిక కోడ్‌లలో 'వేతనాల కోడ్ 2019' అనేది అత్యంత ముఖ్యమైన మొదటి కోడ్. ఈ వేతనాల కోడ్‌లోని సెక్షన్ 9 అనేది కేంద్ర ప్రభుత్వానికి జాతీయ స్థాయిలో 'ఫ్లోర్ వేజ్' (కనీస ప్రాథమిక వేతనం)ను నిర్ణయించే చట్టపరమైన అధికారాన్ని ఇస్తుంది. దీని ప్రకారం, దేశంలోని వివిధ భౌగోళిక ప్రాంతాలకు వేర్వేరు కనీస వేతనాలను కేంద్ర సర్కారు నిర్ణయించొచ్చు. కనీస ప్రాథమిక వేతనం (ఫ్లోర్ వేజ్) నిర్దిష్ట తుది మొత్తాన్ని కేంద్ర ప్రభుత్వం ఇంకా ఖరారు చేయలేదు. ఒక సెంట్రల్ అడ్వైజరీ బోర్డు, అన్ని రాష్ట్ర ప్రభుత్వాలతో సంప్రదింపులు జరిపిన తర్వాతే దీనిపై తుది నిర్ణయాన్ని ప్రకటిస్తారని తెలుస్తోంది. కేంద్రం ఒకసారి ఫ్లోర్ వేజ్‌ను ప్రకటిస్తే, దేశంలోని ఏ రాష్ట్ర ప్రభుత్వం కూడా తమ రాష్ట్ర కార్మికులకు అంతకంటే తక్కువ కనీస వేతనాన్ని నిర్ణయించడానికి వీలు ఉండదు. రాష్ట్రాలు తమ పరిధిలో కనీస వేతన చట్టాలను చేసేటప్పుడు కేంద్ర ఫ్లోర్ వేజ్‌ను ఒక ప్రాథమిక బెంచ్‌మార్క్‌గా కచ్చితంగా పాటించాల్సి ఉంటుంది.

కార్మిక సంఘాల వాదన ఇదీ

2700 క్యాలరీల ఆహారం, దుస్తులు, ఇల్లు, పిల్లల చదువుల ప్రాతిపదికన కార్మికుల కనీస వేతనాన్ని నిర్ణయిస్తామని నాలుగు కార్మిక కోడ్‌ల ముసాయిదాలో ప్రతిపాదించారు. అయితే ఈ లెక్కింపు సూత్రాన్ని, గెజిట్ నోటిఫికేషన్లలోని తుది నియమాల నుంచి తొలగించడాన్ని కార్మిక సంఘాలు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నాయి. కనీస వేతనానికి కచ్చితమైన ఫార్ములా అనేది లేకపోతే భవిష్యత్తులో ప్రభుత్వాలు కార్మికుల వాస్తవ ఖర్చులను పట్టించుకోకుండా, ఏకపక్షంగా తక్కువ వేతనాన్ని నిర్ణయించే ముప్పు ఉంటుందని ఆందోళన వ్యక్తం

# 2027 గోదావరి పుష్కరాలలోపు పోలవరం పూర్తికి సహకరించాలి

మొదటి పేజి తరువాయి

2026 ఏప్రిల్ 2 నాటికి కొత్త డయాఫ్రం వాల్ నిర్మాణం పూర్తి అయ్యిందని చెప్పారు. గ్యాప్ 1, గ్యాప్ 2లో కీలకమైన ఎర్త్ కమ్ రాక్ ఫిల్ డ్యామ్ పనులు కూడా వేగంగా జరుగుతున్నాయని తెలిపారు. ఒడిశా, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల్లో ప్రజాభిప్రాయ సేకరణ పెండింగ్‌లో ఉండటంతో 2011లో ఇచ్చిన స్టాప్ వర్క్ ఆర్డర్ ఉత్తర్వులను శాశ్వతంగా ఉపసంహరించుకోవాలని కేంద్రమంత్రిని చంద్రబాబు కోరారు. దీనివల్ల పోలవరం ప్రాజెక్టు పనులు ఎలాంటి ఆటంకాలు లేకుండా వేగంగా చేపట్టేందుకు వీలవుతుందని స్పష్టం చేశారు. సాగునీటి అవసరాల దృష్ట్యా మొదట నిర్ణయించిన దానికంటే కుడి, ఎడమ కాల్వల సామర్థ్యం 17,500 క్యూసెక్కులకు పెంచామన్నారు. కాల్వల సామర్థ్యం పెంచిన మేరకు నిధులను రీఎంబర్సు చేయాలని అన్నారు. ప్రాజెక్టు తదుపరి పనులకు నిధులు మంజూరు చేయాలన్నారు. రాష్ట్రంలోని వివిధ పథకాల పునరుద్ధరణకు నిధుల మంజూరు కోరుతూ లేఖ రాశారు. ఆనకట్ట ఎత్తు పెంచితే విఘాతం: రాష్ట్రవ్యాప్తంగా 297 నీటి వనరుల పునరుద్ధరణకు రూ.285 కోట్ల నిధుల విడుదలకు చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు కోరారు. సుప్రీం తీర్పు వచ్చేవరకూ ఆలమట్టి ఎత్తుపై గెజిట్ విడుదల చేయవద్దని కేంద్రమంత్రికి విజ్ఞప్తి చేశారు. ఆనకట్ట ఎత్తును 524.25




మీటర్లకు పెంచితే ఏపీ ప్రయోజనాలకు విఘాతం కలుగుతుందని తెలిపారు. కేంద్ర జలశక్తి శాఖకు సీఎం చంద్రబాబు లేఖ: పోలవరం బనకచర్ల లింక్ ప్రాజెక్టుకు అనుమతుల మంజూరుకు సీఎం చేయాలని కేంద్రమంత్రిని కోరారు. వృథాగా పోయే 200 టీఎంసీల వరద జలాలను మళ్లించేలా ప్రాజెక్టు చేపడుతున్నట్టు వెల్లడించారు. వంశధారపై నేరడి బ్యారేజ్ నిర్మాణానికి గెజిట్ ప్రకారం ముందుకెళ్తామన్నారు. 8 వేల క్యూసెక్కుల సామర్థ్యంతో కుడివైపున హెడ్ స్లూయిస్ నిర్మాణం చేపడతామని అన్నారు. అవసరమైన భూసేకరణకు ఒడిశాను ఆదేశించాల్సిందిగా పాటిల్‌కు సీఎం చంద్రబాబు లేఖ ఇచ్చారు. ప్రధాని చేతుల మీదుగా జాతికి అంకితం చేస్తాం: సాగునీటి రంగానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నట్లు జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు తెలిపారు. కేంద్రమంత్రి పాటిల్ తో భేటీ అనంతరం ఆయన విలేకర్లతో మాట్లాడారు. కరవు రహితంగా మార్చే ప్రాజెక్టు పోలవరమని అన్నారు. కేంద్రం అందిస్తున్న సహకారానికి మంత్రి నిమ్మల ధన్యవాదాలు తెలియజేశారు. 2027 జూన్ నాటికి పోలవరం పూర్తి కానుందని పేర్కొన్నారు. ప్రధాని చేతుల మీదుగా పోలవరం ప్రాజెక్టును జాతికి అంకితం చేస్తామన్నారు. వైఎస్సార్సీపీ పట్టించుకోని తుంగభద్రకు మొత్తం గేట్లను కొత్తవి నిర్మిస్తున్నామని అన్నారు. గోదావరి-కావేరి నదుల అనుసంధానం యాక్షన్ ప్లాన్ తయారీపై కేంద్రమంత్రి పాటిల్ తో చర్చించామని నిమ్మల వెల్లడించారు. ఢిల్లీ పర్యటనలో భాగంగా అంతకుముందు కేంద్ర హోంమంత్రి అమిత్ షాతో ఆయన నివాసంలో ముఖ్యమంత్రి చంద్రబాబు సమావేశమయ్యారు. విభజన చట్టంలోని పెండింగ్ హామీల్లో పెండింగ్ అంశాలపై ఇరువురి మధ్య చర్చ జరిగినట్లు సమాచారం. అమరావతిలో మరిన్ని కేంద్ర ప్రభుత్వ సంస్థల ఏర్పాటుపై పలు ప్రతిపాదనలు అందించినట్లు తెలిసింది. ముఖ్యంగా గత ఐదేళ్లలో రాష్ట్రానికి రావలసిన బకాయిలను తక్షణమే విడుదల చేయాలని, కోఆపరేటివ్ శాఖ నుంచి రాష్ట్రానికి మరింత సహకారంతో పాటు పోలవరం ప్రాజెక్టు నిధుల విడుదలలో జాప్యం లేకుండా చూడాలని కోరారు. అమరావతి పనుల పురోగతిని వివరించి నిధుల సహకారం పెంచాలని విజ్ఞప్తి చేశారు.

# ఏపీని కరవు రహితంగా మార్చడంలో పోలవరం కీలకం

మొదటి పేజి తరువాయి

ప్రధాని నరేంద్ర మోదీ, ముఖ్యమంత్రి చంద్రబాబు, కేంద్ర జలశక్తి మంత్రి సీఆర్ పాటిల్ ఈ ప్రాజెక్టను జాతికి అంకితం చేయనున్నారని వెల్లడించారు. సోమవారం కేంద్ర జల శక్తి మంత్రి సీఆర్ పాటిల్‌తో ముఖ్యమంత్రి చంద్రబాబు భేటీ అయ్యారు. గంటపాటు సాగిన సమావేశంలో పోలవరం ప్రాజెక్ట్ సహా రాష్ట్రంలోని వివిధ నీటిపారుదల ప్రాజెక్టులపై సుదీర్ఘంగా చర్చించారు. ఈ సమావేశంపై మంత్రి నిమ్మల మీడియాతో మాట్లాడుతూ.. పీపీఏ, సీడబ్ల్యూసీ నిర్దేశించిన గడువు ప్రకారం 2027 నాటికి ప్రాజెక్టను పూర్తి చేస్తామని కేంద్ర మంత్రి స్పష్టం చేసినట్లు చెప్పారు. ఏపీని కరవు రహిత రాష్ట్రంగా మార్చడంలో పోలవరం కీలకమని మంత్రి తెలిపారు. వైసీపీ పాలనలో పోలవరం ప్రాజెక్టను ప్రశ్నార్థకం చేశారని విమర్శించారు. పోలవరం సివిల్ వర్క్స్, ఆర్ అండ్ ఆర్ అంశాలను కేంద్ర మంత్రికి వివరించామన్నారు. తొలి దశలో 41.15 మీటర్ల ఎత్తుకు నీటిని నిల్వ చేసేందుకు అవసరమైన నిర్మాణాలు పూర్తి చేయడంలో కేంద్రం సహకరించాలని ముఖ్యమంత్రి కోరారన్నారు. గత ఏప్రిల్ నాటికి కొత్త డయాఫ్రమ్ వాల్ నిర్మాణం పూర్తయిందని తెలిపారు. తుంగభద్ర ప్రాజెక్టు గేట్లు ప్రమాదకర స్థితిలో ఉన్నాయని, వైసీపీ పాలనలో వాటిని పట్టించుకోలేదని మంత్రి ఆరోపించారు. గత ఏడాది 1 9వ గేటు కొట్టుకుపోయిందని.. కొత్త గేట్ల ప్రారంభోత్సవంపై కేంద్ర మంత్రితో చర్చించామని వెల్లడించారు. గోదావరి కావేరి అనుసంధానం చేసుకుంటే అన్ని సమస్యలకు పరిష్కారం దొరుకుతుందని మంత్రి తెలిపారు. గోదావరి కావేరి ఏ విధంగా ఇంటర్ లింకింగ్ చేయాలన్న దానిపైన యాక్షన్ ప్లాన్ సిద్ధం చేస్తున్నామని చెప్పారు. గోదావరిలో ప్రతి సంవత్సరం సుమారు 3000 టీఎంసీల వరద నీరు వృథాగా సముద్రంలో కలుస్తోందన్నారు. ఈ మిగులు జలాలను సమర్థవంతంగా వినియోగించుకోవడం ద్వారా తెలుగు రాష్ట్రాలకు లాభం చేకూరుతుందని ముఖ్యమంత్రి చంద్రబాబు మొదటి నుంచి చెబుతున్నారని తెలిపారు. భూగర్భ జలాలను పెంపొందించేందుకు కార్యాచరణ చేపట్టామని రామానాయుడు తెలిపారు. ఇప్పటికే ముఖ్యమంత్రి కలెక్టర్లతో గ్రౌండ్ వాటర్ సమస్యలపై సమీక్ష




నిర్వహించారన్నారు. దేశంలో ప్రయోగాత్మకంగా ఎంసీఏడీ మోడల్ సిస్టమ్‌ను విజయనగరంలో ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించారు. ఆల్మట్టి ఎత్తు పెంపు నిర్మాణంపై సుప్రీం కోర్టులో స్టే ఆర్డర్ ఉన్న విషయాన్ని కేంద్ర మంత్రి దృష్టికి తీసుకెళ్లి అభ్యంతరాలపై చర్చించామని మంత్రి నిమ్మల రామానాయుడు వెల్లడించారు.

# ఎవరి ఒత్తిళ్లు, ఆంక్షలకు భారత్ తలొగ్గదని నిరూపించాం

మొదటి పేజి తరువాయి

ఏర్పాటు చేసిన భారీ బహిరంగ సభలో ప్రసంగించారు. "సోమనాథ్ దేవాలయ అభివృద్ధిలో శివుడి ఆశీస్సులు ఉన్నాయి. సోమనాథ్ దేవాలయ రూపురేఖలు పూర్తిగా మారుస్తున్నాం. 1951లో సోమనాథ్ దేవాలయ పునర్నిర్మాణం చేపట్టాం. భారత్ తన ప్రాచీన సంస్కృతిని, వారసత్వాన్ని కూడా పరిరక్షించుకుంటుంది. సోమనాథ్ పునర్నిర్మాణ పనుల ద్వారా దీన్ని ప్రపంచానికి చాటాం. భారత్ అంటే వేల ఏళ్ల ఆధ్యాత్మిక చైతన్యం కలిగిన దేశం. అసత్యంపై ఎప్పటికైనా సత్యమే గెలుస్తుందని మన పూర్వీకులు నిరూపించారు. 1998 మే 11న ఇదేరోజు పోఖ్రాన్‌లో అణు పరీక్షలు చేపట్టాం. 1998లో అణు పరీక్షల ద్వారా భారత్ సత్తా చాటాం. అప్పటి అణుపరీక్షలు చూసి ప్రపంచ దేశాలు ఆశ్చర్యపోయాయి. అణు పరీక్షల తర్వాత అనేక ఆంక్షలు విధించారు ఇబ్బంది పెట్టారు. మనం ఎవరి ఆంక్షలకు తలొగ్గలేదు ధైర్యంగా నిలబడ్డాం. 1998 మే 13న మరో రెండు అణు పరీక్షలు నిర్వహించాం. అటల్ నేతృత్వంలో భారత్ సత్తా అంటే ప్రపంచానికి ఏమిటో చూపించాం. భారత్ ఎవరి ఒత్తిళ్లు, ఆంక్షలకు తలొగ్గదని నిరూపించాం. చంద్రయాన్ ప్రాజెక్టులో రోవర్ దిగేచోటును శివశక్తి పాయింట్ అని పేరు పెట్టాం. శివుడికి, చంద్రుడికి అవినాభావ సంబంధం ఉంది. సోమనాథ్ దేవాలయ సంపదను గజనీ, ఖిల్జీ



అనేకసార్లు దోచుకున్నారు. ఎన్ని సార్లు దాడులు చేసినా సోమనాథ్ దేవాలయం సగర్వంగా నిలబడింది. భారత్ ఆధ్యాత్మిక శక్తి గురించి విధ్వంసకారులకు తెలియదు.

**నరేంద్ర మోదీ, ప్రధానమంత్రి**

సోమ్‌నాథ్ ఆలయంలో నిర్వహిస్తున్న 'అమృత్ మహోత్సవం'లో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పాల్గొన్నారు. సోమ్‌నాథ్ ఆలయంలో ప్రధాని ప్రత్యేక పూజలు నిర్వహించారు. 'అభిషేకం', 'ధ్వజ పూజ'తో పాటు 'మహా పూజ'లో ఆయన పాల్గొన్నారు. ఈ వేడుకల్లో భాగంగా భారత వాయుసేనకు చెందిన 'సూర్యకిరణ్' టీమ్ నిర్వహించిన సాహసోపేతమైన విన్యాసాలు అబ్బురపరిచాయి. అనంతరం సోమ్‌నాథ్ ఆలయ పునర్నిర్మాణానికి నాంది పలికిన సర్దార్ వల్లభాయ్ పటేల్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. తర్వాత ఆలయ ప్రాంగణంలో జరిగే కుంభాభిషేక క్రతువులో ప్రధాని పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో గుజరాత్ ముఖ్యమంత్రి భూపేంద్ర పటేల్, ఉప ముఖ్యమంత్రి హర్ష్ సంఘ్వీ కూడా పాల్గొన్నారు. అంతకుముందు ప్రధాని నరేంద్ర మోదీ నిర్వహించిన భారీ రోడ్‌షోకు ప్రజలు బ్రహ్మరథం పట్టారు. సోమనాథ్ వీధులు మోదీ నామస్మరణతో మారుమోగాయి. హెలిప్యాడ్ నుంచి వీర్ హమీర్జీ సర్కిల్ వరకు సుమారు ఒకటిన్నర కిలోమీటర్ల మేర సాగిన ప్రధాని రోడ్‌షోకు జనం భారీగా తరలివచ్చారు. దారిపొడవునా జాతీయ జెండాలు ఊపుతూ, నినాదాలు చేస్తూ ప్రధానికి ఘనస్వాగతం పలికారు. ఈ రోడ్‌షోలో భారతీయ సంస్కృతి ప్రతిబింబించేలా దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన కళాకారులు ప్రదర్శనలు ఇచ్చారు. బంగాల్‌కు చెందిన జానపద కళాకారులు తమ సంప్రదాయ నృత్యాలతో రోడ్‌షోలో ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. 1951లో భారత తొలి రాష్ట్రపతి డాక్టర్ రాజేంద్ర ప్రసాద్ ఈ పునర్నిర్మిత ఆలయాన్ని ప్రారంభించారు. ఆ చారిత్రక ఘట్టానికి 75 ఏళ్లు పూర్తయిన సందర్భంగా ఈ అమృత్ మహోత్సవాన్ని నిర్వహిస్తున్నారు.

# బంగాల్ ఓట్ల తొలగింపు అంశంపై మమతా బెనర్జీకి సుప్రీంకోర్టు వెసులుబాటు

మొదటి పేజి తరువాయి



ఢిల్లీ: బంగాల్ లో ఎస్‌ఐఆర్ ద్వారా ఓట్ల తొలగించిన అంశంపై కొత్తగా పిటిషన్ దాఖలు చేసుకోవచ్చని తృణమూల్ కాంగ్రెస్ పార్టీకి సుప్రీంకోర్టు సూచించింది. ఓట్ల తొలగింపు వల్ల బంగాల్ ఎన్నికల ఫలితాలు ప్రభావితమయ్యాయని భావిస్తున్న వారు, సంబంధిత విభాగాల్లో మళ్లీ పిటిషన్ దాఖలు చేసుకోవచ్చని పేర్కొంది. బంగాల్ లోని వివిధ అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఎస్ ఐఆర్ ద్వారా తొలగించిన ఓట్ల సంఖ్య కంటే, అభ్యర్థుల గెలుపు మెజారిటీ తక్కువగా ఉందని మాజీ సీఎం మమతా బెనర్జీ సహా పలువురు ఆరోపించారు. దీనిపై సోమవారం విచారణ జరిపిన సీజేఐ సూర్యకాంత్ , జస్టిస్ జోయ్ మాల్య బాగ్చీల ధర్మాసనం, ఓట్ల తొలగింపు అంశంపై కొత్త పిటిషన్లు దాఖలు చేయవచ్చని పేర్కొంది. అంతకు ముందు, ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ ఐఆర్ ) ప్రభావం, బంగాల్ అసెంబ్లీ ఎన్నికల ఫలితాలపై పడిందని టీఎంసీ సుప్రీంకోర్టుకు తెలిపింది. ఎస్ ఐఆర్ వల్ల కనీసం 31 స్థానాల్లో ఫలితాలు ప్రభావితమయ్యాయని పేర్కొంది. తృణమూల్ తరపు న్యాయవాదులు కల్యాణ్ బెనర్జీ, మేనక గురుస్వామి తమ వాదనలు వినిపిస్తూ, ఎస్ ఐఆర్ ప్రక్రియ చేపట్టి, బంగాల్ లో ఏకంగా 91 లక్షల మంది పేర్లను ఓటర్ల జాబితా నుంచి తొలగించారని, దీని వల్ల ఎన్నికల ఫలితాలు తారుమారు అయ్యాయని పేర్కొన్నారు. కనీసం 31 అసెంబ్లీ నియోజక వర్గాల్లో బీజేపీ, తృణమూల్ అభ్యర్థుల మధ్య ఉన్న ఓట్ల తేడా కంటే, ఎస్ ఐఆర్ ద్వారా తొలగించిన ఓట్ల సంఖ్య చాలా ఎక్కువగా ఉందని వారు కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. ఉదాహరణకు, ఒక నియోజక వర్గంలో టీఎంసీ అభ్యర్థి కేవలం 862 ఓట్ల తేడాతో ఓడిపోగా, అదే కేంద్రంలో ఎస్ ఐఆర్ ద్వారా 5000 కంటే ఎక్కువ మంది పేర్లను ఓటర్ల జాబితా నుంచి తొలగించారని వారు సర్వోన్నత న్యాయస్థానాకి తెలిపారు. అంతేకాదు బంగాల్ అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ, తృణమూల్ కాంగ్రెస్ మధ్య ఓట్ల తేడా కేవలం 32 లక్షలు మాత్రమేనని కల్యాణ్ బెనర్జీ పేర్కొన్నారు. మరోవైపు ఎస్ ఐఆర్ ట్రిబ్యునల్ పనిచేస్తున్న వేగాన్ని బట్టి చూస్తే, ఇప్పటి వరకు పెండింగ్ లో ఉన్న 34 లక్షల తొలగించబడిన ఓటర్ల సమస్యను పరిష్కరించడానికి మరో నాలుగు ఏళ్లు పట్టే అవకాశం ఉందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. అయితే ఎన్నికల కమిషన్ ఈ వాదనలను తీవ్రంగా ఖండించింది. ఈ విషయంలో 'ఎలక్షన్ పిటిషన్' దాఖలు చేయడమే సరైన మార్గమని పేర్కొంది. ఎస్ ఐఆర్ ప్రక్రియ, ఓటర్ల చేర్పులు, తొలగింపులపై వచ్చే అప్పీళ్ల విషయంలో పోల్ ప్యానెల్ జవాబుదారీగా ఉంటుందని స్పష్టం చేసింది. ఎన్ ఐఏ దర్యాప్తు మరోవైపు బంగాల్ , మాల్దాలోని మోతాబరిలో న్యాయమూర్తులను ముట్టడించిన అంశంపై సుప్రీంలో విచారణ జరిగింది. అయితే ఈ కేసుపై ఎన్ ఐఏ దర్యాప్తు నివేదికను సమర్పించడానికి అదనపు సొలిసిటర్ జనరల్ ఎస్ వీ రాజు మరింత సమయం కోరారు. దీనితో చీఫ్ జస్టిస్ సూర్యాకాంత్ నేతృత్వంలోని ధర్మాసనం వచ్చే రెండు నెలల్లోగా దర్యాప్తును పూర్తి చేసేందుకు ప్రయత్నించాలని ఆదేశించింది. అంతేకాదు, నిందితులపై అని చట్టపరమైన చర్యలు తీసుకోవాలని నిర్దేశించింది. ఇటీవల ముగిసిన బంగాల్ అసెంబ్లీ ఎన్నికల్లో, మొత్తం 294 సీట్లకుగాను బీజేపీ 207 సీట్లు కైవసం చేసుకుంది. తృణమూల్ కాంగ్రెస్ (టీఎంసీ) 80 సీట్లకే పరిమితమై ఓటమి పాలైంది. దీనితో బంగాల్ లో తొలిసారి బీజేపీ సర్కార్ కొలువుదీరింది. కాగా, ఈసారి జరిగిన బంగాల్ ఎన్నికల్లో 90 శాతానికి పైగా ఓటింగ్ నమోదు అయ్యింది. స్వాతంత్ర్యం వచ్చిన తరువాత ఎంత భారీ ఎత్తున ఓటింగ్ నమోదు కావడం ఇదే మొదటిసారి కావడం గమనార్హం.

# వారికి ప్రభుత్వం గుడ్‌న్యూస్.. భారీగా నియామకాలు

మొదటి పేజి తరువాయి

బోర్డు ద్వారా నిర్వహించారు. ఎంపికైన అభ్యర్థులకు పారదర్శకంగా నియామక పత్రాలు అందజేస్తున్నట్లు అధికారులు తెలిపారు.

## నర్సింగ్ రంగంలో భారీ ఉద్యోగావకాశాలు..

తెలంగాణలో నర్సింగ్ రంగంలో భారీ స్థాయిలో ఉద్యోగావకాశాలు కల్పించడం ద్వారా యువతకు ఉపాధి అవకాశాలు పెరుగుతున్నాయని ప్రభుత్వం పేర్కొంది. ముఖ్యంగా ప్రభుత్వ ఆస్పత్రుల్లో సిబ్బంది కొరతను తగ్గించేందుకు ఈ నియామకాలు కీలకంగా మారనున్నాయి. కొత్తగా నియమితులయ్యే నర్సింగ్ ఆఫీసర్లు రాష్ట్రవ్యాప్తంగా వివిధ ప్రభుత్వ ఆస్పత్రులు, వైద్య కళాశాలలు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో సేవలు అందించనున్నారు.

## ప్రభుత్వ ఆస్పత్రుల్లో సేవలు మరింత బలోపేతం..

ఈ నియామకాలతో ప్రభుత్వ వైద్యసేవలు మరింత బలోపేతం అవుతాయని ఆరోగ్యశాఖ అధికారులు భావిస్తున్నారు. రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు నర్సింగ్ సిబ్బంది కీలక పాత్ర పోషిస్తారని అధికారులు చెబుతున్నారు. ప్రత్యేకంగా గ్రామీణ ప్రాంతాల్లో



వైద్యసేవలను విస్తరించేందుకు కొత్తగా నియమితులయ్యే నర్సింగ్ ఆఫీసర్లు ఉపయోగపడనున్నారని పేర్కొన్నారు.

## నర్సుల సేవలకు గుర్తింపుగా కార్యక్రమం..

ఇంటర్నేషనల్ నర్సెస్ డే సందర్భంగా ఈ నియామక పత్రాల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించడం విశేషంగా మారింది. కరోనా కాలంలో నర్సులు అందించిన సేవలను ప్రభుత్వం గుర్తు చేసుకుంటూ, ఆరోగ్యరంగంలో వారి పాత్ర ఎంతో గొప్పదని పేర్కొంది. ప్రజారోగ్య పరిరక్షణలో నర్సులు ముందుండి సేవలందిస్తున్నారని, వారి సేవలను గౌరవించే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని మంత్రి దామోదర్ రాజనర్సింహ తెలిపారు.

## యువతలో ఆనందం..

భారీ స్థాయిలో నర్సింగ్ పోస్టుల భర్తీతో ఎంపికైన అభ్యర్థుల్లో ఆనందం వ్యక్తమవుతోంది. చాలాకాలంగా ఉద్యోగాల కోసం ఎదురుచూస్తున్న తమకు ఇది పెద్ద ఊరటనిచ్చిందని పలువురి నుంచి అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ప్రభుత్వం ఆరోగ్యరంగాన్ని బలోపేతం చేయడంపై దృష్టి పెట్టడం వల్ల భవిష్యత్తులో మరిన్ని ఉద్యోగ అవకాశాలు వచ్చే అవకాశం ఉందని చెబుతున్నారు.

## గోదాములను పరిశీలించిన ఏఎంసీ వైస్ చైర్మన్ ఎలగందుల ప్రసాద్



**విజేత ఇల్లంతకుంట :** మండలంలోని చింతలకుంటపల్లె రైస్ మిల్లు, రహీంఖాన్‌పేటలోని ప్రభుత్వ గోదాములను ఏఎంసీ వైస్ చైర్మన్ ఎలగందుల ప్రసాద్, ఏపీఎం కుమారస్వామి సోమవారం పరిశీలించారు,ధాన్యం అన్‌లోడింగ్ ప్రక్రియను పరిశీలించి అక్కడి పరిస్థితులపై ఆరా తీశారు.రైతులు తీసుకొచ్చిన ధాన్యాన్ని వేగంగా అన్‌లోడ్ చేసి గోదాములకు తరలించేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. ధాన్యం కొనుగోలు ప్రక్రియలో ఎలాంటి జాప్యం లేకుండా చూడాలని, రైతులకు ఇబ్బందులు కలగకుండా సమన్వయంతో పని చేయాలని తెలిపారు.ఈ సందర్భంగా లారీ కాంట్రాక్టర్ గంప రామకృష్ణతో మాట్లాడి కొనుగోలు కేంద్రాల వద్ద లారీల కొరత లేకుండా చూడాలని సూచించారు. ధాన్యం రవాణాలో ఆలస్యం జరగకుండా అవసరమైన వాహనాలను అందుబాటులో ఉంచాలని తెలిపారు.గోదాముల్లో నిల్వల నిర్వహణ, తేమ శాతం, నాణ్యత ప్రమాణాలపై కూడా పరిశీలన చేశారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ డైరెక్టర్లు ఐరెడ్డి సురేందర్ రెడ్డి, సుధగోని తిరుపతి, ఏఎంసీ సెక్రటరీ హరినాథ్, సంబంధిత అధికారులు, మిల్లర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

## ఇండ్ల గణన ప్రక్రియను నిర్ణిత గడువులోగా పూర్తి చేయాలి

జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా.



**విజేత మామడ:**జనగణన ప్రక్రియలో భాగమైన హౌస్ లిస్టింగ్ ప్రక్రియను పకడ్బందీగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా అధికారులను ఆదేశించారు.సోమవారం ఉదయం, నిర్మల్ గ్రామీణ మండలం తల్వేద గ్రామంలో జనగణనకు సంబంధించి చేపట్టిన హౌస్ లిస్టింగ్ ప్రక్రియ తీరును కలెక్టర్ పరిశీలించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, హౌస్ లిస్టింగ్ ప్రక్రియకు సంబంధించి వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. జనగణన ప్రక్రియలో ఇండ్ల గణన అనేది అత్యంత కీలకమని అన్నారు. నిర్ణీత గడువులోగా హౌస్ లిస్టింగ్ ప్రక్రియను ఎటువంటి పొరపాట్లు లేకుండా పూర్తి చేయాలని వివరించారు. నిబంధనల ప్రకారం జనగణనకు సంబంధించి ఇంటి నంబర్లను కేటాయించాలని చెప్పారు. స్థానిక పంచాయతీ కార్యదర్శి, జిపిఓ లు జనగణన అధికారుల వెంబడి ఉండాలని పేర్కొన్నారు. జనగణన అధికారులకు అందించిన ఎన్యుమరేషన్ కిట్ లను పరిశీలించారు. జనగణ అధికారులు తప్పనిసరిగా తమ వెంట ఓఆర్ఎస్ పొట్లాలు ఉంచుకోవాలని సూచించారు. ఎండలు అధికంగా ఉన్నాయని, అధికారులు తగిన జాగ్రత్తలు తీసుకుంటూ హౌస్ లిస్టింగ్ ప్రక్రియను చేపట్టాలన్నారు.స్థానికులతో మాట్లాడుతూ, జనగణన ప్రక్రియలో ప్రజలందరూ భాగస్వామ్యం కావాలన్నారు. అధికారులు అడిగే ప్రశ్నలకు సమాధానాలు చెప్పి వారికి సహకరించాలని కోరారు.ఈ కార్యక్రమంలో సిపిఓ జీవరత్నం, తహసిల్దార్ ప్రభాకర్, ఎంపిఓ శ్రీనివాస్ గౌడ్, సర్పంచ్ లక్ష్మి, జనగణన అధికారులు, ఇతర అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## ఇందిరమ్మ రాజ్యంలో నెరవేరిన పేదోడి సొంత ఇంటి కల

గంగారంలో ఇందిరమ్మ ఇల్లు గృహప్రవేశం

ముఖ్య అతిథిగా గ్రామ సర్పంచ్ దేవేందర్ నాయక్



**విజేత మహేశ్వరం :** మహేశ్వరం మండలం గంగారం గ్రామపంచాయతీలో నిరుపేద కుటుంబాలకు ఇందిరమ్మ ఇళ్ల మంజూరులో ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారిస్తోందని గ్రామ సర్పంచ్ దేవేందర్ నాయక్, తెలిపారు. గ్రామానికి చెందిన పాల్యా జ్యోతి జయరాం, కుటుంబానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ ఇంఛార్జ్ కేఎల్ఆర్, సహకారంతో పాటు గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో ఇందిరమ్మ ఇల్లు మంజూరు కావడంతో, ఇటీవల నిర్మాణం పూర్తిచేసుకున్న ఇంటి గృహప్రవేశ కార్యక్రమం సోమవారం ఉదయం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సర్పంచ్ దేవేందర్ నాయక్, ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గంగారం గ్రామంలో ఇప్పటివరకు 60 ఇందిరమ్మ ఇళ్లు మంజూరు కాగా, వాటిలో 45 ఇళ్ల నిర్మాణం పూర్తయ్యిందన్నారు. ఇంకా అర్హులైన పేద కుటుంబాలు ఉంటే గుర్తించి, కాంగ్రెస్ పార్టీ ఇంఛార్జ్ కేఎల్ఆర్, సహకారంతో మరిన్ని ఇళ్లు మంజూరు, చేయించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. గ్రామంలో పెండింగ్‌లో ఉన్న రెండు సీసీ రోడ్ల పనులు కూడా పూర్తి చేశామని తెలిపారు. గంగారం గ్రామపంచాయతీని ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ మహేందర్, వార్డు సభ్యులు ఎం.మోహన్, ఎం.రవి, ఎం.ధర్మ, ఎం.పద్మదేవ,శ్రీనివాస్, జయరాం, మాజీ ఎంపీటీసీ పాండు నాయక్. గ్రామ పెద్దలు, తదిరులు పాల్గొన్నారు.

## పదో తరగతి పాపన్నపేట మండల టాపర్ హర్షవర్ధన్ రెడ్డికి రవీంద్ర భారతీలో ఘన సన్మానం






**విజేత,పాపన్నపేట :** పదవతరగతిలో పాపన్నపేట మండల టాపర్ హర్షవర్ధన్ రెడ్డిని హైదరాబాదులో నిర్వహించిన మహాత్మ జ్యోతిరావు పూలే ప్రతిభా పురస్కారాన్ని అందుకున్నారు. పాపన్నపేట మండలం చీకోడ్ – లింగాయపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థి హర్షవర్ధన్ రెడ్డి ఎంపికైనట్లు ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు విజయలక్ష్మి వెల్లడించారు. ఇందులో భాగంగా సోమవారం హైదరాబాద్ రవీంద్రభారతిలో నిర్వహించిన సన్మాన కార్యక్రమంలో విద్యార్థి హర్షవర్ధన్ రెడ్డిని ప్రముఖులు సన్మానించారు. ఇటీవల వెలువడిన పదవ తరగతి పరీక్షల్లో హర్షవర్ధన్ రెడ్డి పాపన్నపేట మండల్ టాపర్ గా నిలిచాడు. రాష్ట్రవ్యాప్తంగా పదో తరగతి ఫలితాల్లో మండల టాపర్ గా ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులకు సోమవారం రవీంద్రభారతిలో సన్మానం నిర్వహించినట్లు పాఠశాల గజిటెడ్ హెడ్మాస్టర్ విజయలక్ష్మి తెలిపారు. మండల టాపర్ హర్షవర్ధన్ రెడ్డిని ఉన్నతాధికారులు, పలువురు అభినందించారు.

# మైనర్ బాలికపై లైంగిక దాడికి పాల్పడిన బండి సంజయ్ కుమారుడిపై చట్టరీత్య చర్యలు ఏవి..?

బీఆర్ఎస్వీ ఇబ్రహీంపట్నం నియోజకవర్గం అధ్యక్షులు నిట్టు జగదీశ్వర్.



**విజేత, ఇబ్రహీంపట్నం :-** మైనర్ బాలికపై అత్యాచారం చేసి పోక్సో (పోక్సో) కేసులో నిందితుడైన కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమారుడు బండి భగీరథపై చర్యలు తీసుకోవడంలో రేవంత్ రెడ్డి ప్రభుత్వం అవలంబిస్తున్న తీరును నిరసిస్తూ ఇబ్రహీంపట్నం నియోజకవర్గం బీఆర్ఎస్వీ ఆధ్వర్యంలో అంబేద్కర్ విగ్రహం ముందు నల్ల బ్యాడ్జ్ కళ్ళకు కట్టుకుని విద్యార్థి నాయకులు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్వీ ఇబ్రహీంపట్నం నియోజకవర్గం అధ్యక్షులు నిట్టు జగదీశ్వర్, మున్సిపాలిటీ అధ్యక్షులు మడుపు శివ సాయి మాట్లాడుతూ... మైనర్ బాలికను లోబరుచుకొని, లైంగిక దాడికి పాల్పడిన కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమారుడు బండి భగీరథపై చట్టపరమైన చర్యలు తీసుకోకుండా, ఉల్టా మైనర్ బాలిక కుటుంబ సభ్యులను వేధించిన పోలీసు అధికారులపై, కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి పదవి నుండి బండి సంజయ్ ను తక్షణమే బర్తరఫ్ చేయాలి. మైనర్ బాలికపై అత్యాచారం చేసిన బండి సంజయ్ కొడుకును కాపాడే ప్రయత్నం చేస్తున్న రేవంత్ రెడ్డికి కొంచెమైనా సిగ్గుండాలి అని బండి సంజయ్ కొడుకుకు ఒక న్యాయం.. సామాన్యులకు ఒక న్యాయమా...? అని ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వంని నిలదీశారు. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే బండి భగీరథను అరెస్ట్ చేసి, బాధిత మైనర్ బాలికకు న్యాయం చేయకపోతే బీఆర్ఎస్వీ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున పోరాటం చేస్తామని ఈ సందర్భంగా ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్వి అధికార ప్రతినిధి అచ్చన శ్రీకాంత్, కమ్మటి అంజి బాబు, అమంచ రంజిత్, రంగోలి అరుణ్ గౌడ్, (బన్నీ), మహమ్మద్ ఏమైర్, చందు, రమేష్,రాజేష్, సాయి, పవన్ తదితరులు పాల్గొన్నారు.

# పంట అవశేషాలను కాల్చవద్దు







పర్యావరణ పరిరక్షణతో పాటు భూసారాన్ని కాపాడాలి

రైతులకు వ్యవసాయ అధికారి శ్రీనివాస్ రాజ్ విజ్ఞప్తి

**విజేత,పాపన్నపేట :** పంట అవశేషాలను కాల్చవద్దు అని పాపన్నపేట మండల వ్యవసాయ అధికారి పి శ్రీనివాస్ రాజ్ రైతులకు సూచించారు. పాపన్న పేట మండలంలో వరి పంట కోత అనంతరం పంట అవశేషాలను విస్తృతంగా కాల్చుతున్న ఘటనలు జరుగుతున్నాయి. పంట అవశేషాలను కాల్చడం వల్ల మంటలు అదుపు తప్పి పక్కనున్న పంటలు, ఆస్తులు, విద్యుత్ లైన్లు దెబ్బతినే ప్రమాదం ఉంటుందన్నారు. మనుషులు – పశువులకు కూడా ఆరోగ్య సమస్యలు తలెత్తే అవకాశం ఉందన్నారు. పంట అవశేషాలను కాల్చడం వల్ల పర్యావరణానికి, భూసారానికి, రైతుల ఆర్థిక పరిస్థితికి తీవ్ర నష్టం కలుగుతుందన్నారు. పంట అవశేషాలను కాల్చినపుడు కార్బన్ మోనాక్సైడ్, కార్బన్ డయాక్సైడ్, నైట్రోజన్ డయాక్సైడ్, సల్ఫర్ డయాక్సైడ్ వంటి హానికర వాయువులు విడుదలై గాలిలో కాలుష్యం పెరుగుతుందని, దీని వల్ల ప్రజల్లో శ్వాసకోశ సమస్యలు పెరిగే ప్రమాదం ఉందన్నారు. పంట అవశేషాల దహనం వల్ల భూమిలో ప్రకృతి సహజంగా ఉన్న వానపాములు, పంటల ఎదుగుదలకు ఉపయోగకరం ఐన అనేక రకముల సూక్ష్మజీవులు మరణించుటతో పాటు నేలలోని సేంద్రియ కర్బనం, నత్రజని, ఫాస్పరస్, పొటాష్ వంటి కీలక పోషకాలు నశించి భూసారం తగ్గిపోతుందని, దీని ఫలితంగా రైతులు అధికంగా రసాయన ఎరువులపై ఆధారపడాల్సి రావడంతో ఖర్చులు పెరిగి, దిగుబడులు తగ్గుతున్నాయన్నారు. రైతులు పర్యావరణాన్ని కాపాడే విధంగా వ్యవహరించి, పంట అవశేషాలను కాల్చకుండా రోటవేటర్ ద్వారా నేలలో కలియదున్నడం, కంపోస్ట్ లేదా వర్మీ కంపోస్ట్ తయారు చేయడం, పశుగ్రాసంగా వినియోగించడం, మల్చింగ్ పద్ధతులు అనుసరించడం వంటి ప్రత్యామ్నాయాలను అవలంబించాలని రైతులకు మండల వ్యవసాయ అధికారి శ్రీనివాస్ రాజ్ విజ్ఞప్తి చేశారు.

# పొద్దు తిరుగుడు పంట కొనుగోలు చేయాలని రైతుల రాస్తారోకో



**విజేత ఇల్లంతకుంట :** మండల కేంద్రంలో పొద్దు తిరుగుడు పంట కొనుగోలు చేయాలని మండల కేంద్రంలోని వివేకానంద చౌరస్తా వద్ద పెద్ద ఎత్తున రైతులు రాస్తారోకో చేపట్టారు. రైతులు రోడ్డుపైకి వచ్చి పంట కొనుగోలు చేయాలంటూ నిరసన వ్యక్తం చేశారు. మండలంలోని తాళ్లపల్లి, పత్తికుంటపల్లి,ముస్కాన్ పేట గాలి పెల్లి, కేశనపల్లి, జవారిపేట ,గ్రామాలకు చెందిన రైతులు పెద్ద ఎత్తున రోడ్డుపై బైఠాయించి వారి యొక్క నిరసనను వ్యక్తపరిచారు. ఈ విషయం తెలుసుకున్న స్థానిక ఎస్సై అశోక్ కుమార్ రైతుల వద్దకు చేరుకొని నచ్చజెప్పే ప్రయత్నం చేశారు. కలెక్టర్, ఆర్డీఓ, తహాసీల్దార్ రావాలంటూ పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ నెల రోజులుగా కొనుగోలు కేంద్రాల్లో పొద్దుతిరుగుడు పంటను కొనుగోలు చేస్తలేరని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎన్నిసార్లు మార్కెట్ అధికారులను అడిగిన, ప్రజా ప్రతినిధులను కలిసి మొరపెట్టుకున్నా కూడా పట్టించుకోవడంలేదని వారు వాపయ్యారు. మండలంలోని మొత్తం పంటను ప్రభుత్వం కొనుగోలు చేయాలని వారు డిమాండ్ చేశారు .దీంతో రైతుల వద్దకు స్థానిక తహాసీల్దార్ రాజకట్ల సురేష్ కుమార్ రైతుల వద్దకు చేరుకొని మార్కెట్ ఎండితో, అదేవిధంగా ఉన్నత అధికారులతో ఫోన్లో మాట్లాడి రైతులకు నచ్చజెప్పారు. రైతుల పంటను త్వరలోనే కొంటామని హామీ ఇవ్వడంతో రైతులు ఆందోళన విరమింప చేశారు ,ఈ కార్యక్రమంలో రైతులు జుట్టు శేఖర్, సింగిరెడ్డి మనోహర్ రెడ్డి, బోడ రమణారెడ్డి, చింతలపల్లి శ్రీనివాస్ రెడ్డి, రవీందర్ రెడ్డి, నరసింహ రెడ్డి, కూనవేని బాలరాజు, జుట్టు మధుసూదన్, ఎగుర్ల మల్లయ్య, బోడ మల్లారెడ్డి, గుగ్రం నర్సింహారెడ్డి, వినోద్ రెడ్డి, మహేందర్, తిరుపతి రెడ్డి, బోడ తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

# రుద్రసముద్రం చెరువులో నల్లమట్టి తవ్వకాలు వెంటనే నిలిపివేయలి





**విజేత కృష్ణ :** వ్యవసాయ పంట పొలాలను నాశనం చేస్తున్న ఇటుక బట్టిలు అధికారుల నిర్లక్ష్యం వీడకపోతే ఉద్యమాలే శరణ్యం గౌరవ లోకాయుక్త ఆర్డర్ ను అమలు చేయకపోతే కోర్టు ధిక్కరణ క్రింద హైకోర్టును ఆశ్రయిస్తాం అని తహసిల్దార్, నీటిపారుదల శాఖ వారికి వినతి పత్రాలు ఇచ్చిన రైతులు, ప్రజాసంఘాల నాయకులు అక్రమ నల్ల మట్టి తవ్వకాలను వెంటనే నిలిపివేయాలని మరియు అక్రమంగా వెలిసిన ఇటుక బట్టీల చుట్టూ పంట పొలాలను నాశనం చేస్తున్నాం ఇటుక బట్టి యాజమాన్యాలపై చర్యలు తీసుకొని ఇటుక బట్టీలను ఎత్తివేయాలని డిమాండ్ చేస్తూ ఈరోజు తహసిల్దార్ కార్యాలయం ముందు నిరసన చేపట్టి అనంతరం తాసిల్దార్ గారికి, నీటిపారుదల శాఖ ఈఈ గార్లకు వినతిపత్రం సమర్పించడం జరిగింది అని ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి ప్రజాసంఘాల నాయకులు మాట్లాడుతూ యార్నాగన్ పల్లి, కాత్రేవుపల్లి, గొల్లపల్లి, రుద్ర సముద్రం,మక్తల్ గ్రామాలకు చెందిన రైతులము మరియు బాటసారులం. కాత్రేవు పల్లి కి వెళ్లే రహదారి ఇరువైపులా పదుల సంఖ్యలో ఇటుక బట్టీలు వెలిశాయి. ఈ ఇటుక బట్టీల ద్వారా వెలువడుతున్న మట్టి, దుమ్ము,ధూళి, బట్టీలను నుండి వెలువడుతున్న వేడి పంట పొలాలపై దాదాపు కిలోమీటర్ పరిధి వరకు వ్యాపిస్తున్నాయి. దీనివల్ల పంటలు సరిగ్గా పండగ పోవడం, సరైన దిగుబడి రాకపోవడం మాకు తీవ్ర ఆందోళన కలిగిస్తున్నది. దీంతో పాటు కాత్రేవు పల్లికి వెళ్లే రహదారి ఇరువైపులా దాదాపు నాలుగు గ్రామాల ప్రజల పంట పొలాలు ఉన్నాయి. మా పంట పొలాలకు వెళ్లేటప్పుడు ఇటుకబట్టి నుంచి వెలువడే దుమ్ము ధూళి వేడి కారణంగా కనీసం ముందు వచ్చే వాహనాలు కూడా కనపడకుండా దట్టమైన పొగ కమ్ముకుని అనేకసార్లు ప్రమాదాలు జరిగాయి. ఈ ప్రమాదంలో చాలామంది రైతులు కాళ్లు, చేతులు విరిగిపోయిన సందర్భాలు కూడా ఉన్నాయి. మరియు రుద్ర సముద్రం గ్రామ చెరువులో నల్ల మట్టి తవ్వకాలు జరుపుతూ టిప్పర్ల లోడ్ వేసుకొని వెళ్తున్నా వాహనాల నుండి ఆ మట్టి రోడ్డుపై పడడం వల్ల వర్షాకాలంలో రైతులు తమ పొలాలకు కూడా వెళ్లలేని విధంగా రోడ్డు గుంతల మాయమై రైతులు తీసుకువెళ్లే ద్విచక్ర వాహనాలు జారిపడి అంగుళం కూడా ముందుకు వెళ్లలేని దుర్భరమైన పరిస్థితినీ సంవత్సరాల తరబడి భరిస్తూ వస్తున్నాము. ఇప్పుడు ఇంటిగ్రేటెడ్ స్కూల్ ని కూడా ప్రభుత్వం ఇటుక బట్టీల పక్కనే ఉన్న స్థలాన్ని ఎంపిక చేసింది. రేపు భవిష్యత్తులో కూడా ఆ స్కూల్లో మన ప్రాంతానికి చెందిన పిల్లలు చదువుకోవడానికి సరైన వాతావరణం కూడా ఉండదు అని వారు తెలిపారు ఈ కార్యక్రమంలో పాల్గొన్నవారు మద్దిలేటి మానవ హక్కుల కార్యకర్త లింగన్న కె ఎన్ పి ఎస్ జిల్లా ఉపాధ్యక్షులు కే పృథ్వీరాజ్ అంబేద్కర్ యువజన సంఘం అధ్యక్షులు నర్సింగప్ప కొలిమి రాములు కే.విజయ్ కుమార్ కె ఎన్ పి ఎస్ జిల్లా నాయకులు జే.వెంకటపతి రాజు పుడమి ఫౌండేషన్ చైర్మన్. జీర్గల్ నాగేష్ మాదిగ దళిత నాయకులు కే.రవికుమార్,గొల్లపల్లి నాగేష్,కే.శ్రీనివాసులు, రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

# ధాన్యం తరలింపులో జాప్యం వద్దు రైతుల నుండి సేకరించిన ధాన్యాన్ని వెనువెంటనే మిల్లులకు తరలించాలి

జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా






**విజేత మామడ :** కొనుగోలు కేంద్రాల నుంచి వరి ధాన్యం తరలింపు ప్రక్రియలో ఎలాంటి ఆలస్యం జరగకూడదని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ధాన్యం సేకరణ, రవాణాపై సంబంధిత శాఖల అధికారులతో ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, రైతుల నుంచి సేకరించిన ధాన్యాన్ని ఎప్పటికప్పుడు మిల్లులకు తరలించాలని, కొనుగోలు కేంద్రాల్లో ఎక్కువకాలం నిల్వ ఉంచరాదని స్పష్టం చేశారు. రానున్న రోజుల్లో ధాన్యం రాక మరింత పెరిగే అవకాశం ఉన్నందున ముందస్తు ప్రణాళికతో అదనపు లారీలను సిద్ధం చేసుకోవాలని సూచించారు. అవసరానికి తగ్గట్టుగా రవాణా వాహనాలను అందుబాటులో ఉంచుకోవాలని, ధాన్యం లోడింగ్, అన్‌లోడింగ్ పనులకు సరిపడా హమాలీలను ఏర్పాటు చేయాలని అధికారులకు సూచించారు. ప్రతిరోజూ ఎంత ధాన్యం తరలించారనే వివరాలను ఎప్పటికప్పుడు నివేదించాలని ఆదేశించారు. ఇప్పటివరకు జరిగిన ధాన్యం తరలింపు ప్రక్రియ, కొనుగోలు కేంద్రాల్లో సిద్ధంగా ఉన్న నిల్వల వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) కిషోర్ కుమార్, పౌర సరఫరాల శాఖ అధికారులు రాజేందర్, సుధాకర్, డీఆర్డీఓ విజయలక్ష్మి, లారీ ట్రాన్స్‌పోర్ట్ ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

# సోదర భావంతో పండుగలు నిర్వహించుకోవాలి మక్తల్ సీఐ రామ్ లాల్

### జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్ ఐపీస్

**విజేత కృష్ణ :** బక్రీద్ పండుగను శాంతియుత వాతావరణంలో నిర్వహించుకోవాలని మక్తల్ సర్కిల్ ఇన్స్పెక్టర్ రామ్ లాల్ సూచించారు ఉట్కూరు పోలీస్ స్టేషన్‌లో హిందూ, ముస్లిం మత పెద్దలతో మక్తల్ సర్కిల్ ఇన్స్పెక్టర్ రామ్ లాల్, ఎస్సై రమేష్, వెటర్నరీ డాక్టర్లు మానస, సాయి వరుణ్ లు శాంతి.సమావేశం నిర్వహించారు ఈ సందర్భంగా సీఐ రామ్ లాల్ మాట్లాడుతూ గోవుల అక్రమ రవాణాపై పోలీసులు ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఎవరైనా గోవులను అక్రమంగా తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు అక్రమ రవాణా జరుగుతున్నట్లు సమాచారం తెలిసిన వెంటనే పోలీసులకు తెలియజేయాలని కోరారు. అలాగే, చట్టాన్ని ఎవరూ చేతిలోకి తీసుకోరాదని, అనుమానితులతో గొడవలకు దిగకుండా వెంటనే పోలీసులకు సమాచారం



అందించాలని సూచించారు. గోవుల అక్రమ రవాణాను అరికట్టేందుకు సమిస్తాపూర్ బోర్డర్ చెక్పోస్ట్ వద్ద నిరంతరం తనిఖీలు నిర్వహిస్తూ ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసినట్లు తెలిపారు. పశువుల రవాణా చేసే సమయంలో వాటికి సంబంధించిన పత్రాలు



కచ్చితంగా కలిగి ఉండాలని సూచించారు. బక్రీద్ పండుగ సందర్భంగా పరస్పర సహకారం, సోదరభావంతో వ్యవహరించి తమ పండగలను నిర్వహించుకోవాలని అలాగే శాంతి భద్రతల పరిరక్షణకు సహకరించాలని కోరారు ఈ సమావేశంలో హిందూ, ముస్లిం మత పెద్దలు, పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# నల్లబెల్లి నూతన ఎస్సై సాయి ప్రసన్న కుమార్‌కు ఘన సన్మానం



**నల్లబెల్లి విజేత :** మండలంలో నూతనంగా సబ్ ఇన్స్పెక్టర్ ఆఫ్ పోలీస్‌గా బాధ్యతలు స్వీకరించిన సాయి ప్రసన్న కుమార్‌ను పూలమాలలు, శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఎంఆర్పీఎస్ మండల అధ్యక్షులు, దళిత రత్న అవార్డు గ్రహీత పరికిరత్నం మాదిగ మాట్లాడుతూ సమాజంలోని అట్టడుగు వర్గాల అభ్యున్నతి కోసం నీతి, నియమాలు పాటిస్తూ కర్తవ్యబోధనతో విధులు నిర్వహించాలని కోరారు.ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాలకు సంబంధించిన సమస్యలను సావధానంగా పరిష్కరిస్తూ సమాజంలో అందరూ సమానమే అన్న భావనను పెంపొందించేందుకు నిరంతరం శ్రమించాలని సూచించారు. నిరుపేదలు, మధ్యతరగతి కుటుంబాలకు చేదోడువాదోడుగా నిలిచి సహాయ సహకారాలు అందిస్తూ మండలానికి మంచి పేరు ప్రఖ్యాతులు తీసుకురావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ మండల కార్యదర్శి బట్టు సాంబయ్య, మండల సహాయ కార్యదర్శి కందిక రమేష్, మేరు సంఘం మండల అధ్యక్షులు ఓదెల రవి, ఎమ్మార్పీఎస్ సీనియర్ నాయకులు పరికి కోరినల్ మాదిగ తదితరులు పాల్గొన్నారు.

# నారాక్కపేటలో ఘనంగా ఐకేపీ కేంద్రం ప్రారంభం



**నల్లబెల్లి విజేత :** మండలం నారాక్కపేట గ్రామంలో ఐకేపీ కేంద్రాన్ని ఘనంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు మాలోత్ చరణ్ సింగ్ కేంద్రాన్ని ప్రారంభించి మాట్లాడారు. గ్రామీణ మహిళల ఆర్థికాభివృద్ధికి, స్వయం ఉపాధి అవకాశాల పెంపుకు ఐకేపీ కేంద్రాలు ఎంతో ఉపయోగపడతాయని ఆయన పేర్కొన్నారు ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి మాలోత్ రమేష్, కార్యదర్శి చిట్యాల తిరుపతి రెడ్డి, మండల కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ వైనాల అశోక్, మాజీ మండల అధ్యక్షులు రఘుపతి రావు, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షులు పురుషోత్తం సురేష్, మండల నాయకులు ఎరుకల రవీందర్, బత్తిని మల్లయ్య, గ్రామ సర్పంచ్ దండెం సంపత్, ఏపీఎం సుధాకర్, బీసీ సెల్ మండల ఉపాధ్యక్షులు కుంచాల రాజు, గ్రామ కాంగ్రెస్ అధ్యక్షులు శ్రీపతి సుమన్, గ్రామ కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ పోగుల కుమారస్వామి పాల్గొన్నారు.అలాగే వార్డు సభ్యులు దార అనిత, భూంపల్లి శ్రీనివాస్, మేరు శివ, అడుప చంద్రకళ రాజు, మాజీ ఉపసర్పంచ్ వడ్లూరి రమేష్, కోడూరు రాయసాబ్ రవీందర్, అడప్ప రాజు, దండెం రాజేష్, దండెం మామిడి కృష్ణ, సిద్ధ స్వామి, వైనాల సురేష్, వరికల శ్రీను, కోడూరు రాజశేఖర్, కావట్టి గణేష్, సీఏ రమేష్ తదితర కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. కార్యక్రమం ఉత్సాహభరిత వాతావరణంలో సాగింది.

# గ్రామాలలో వ్యవసాయ రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు



**నల్లబెల్లి విజేత :** మండల కేంద్రంలోని గుండ్ల పహాడ్ గ్రామంలో తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం విద్యాశాఖ ఆధ్వర్యంలో ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక లో భాగంగా రైతు వారోత్సవం రైతు ముంగిట్లో శాస్త్రవేత్తల కార్యక్రమం నిర్వహించడం జరిగింది ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ ఏ. వెంకట్ రెడ్డి మాట్లాడుతూ రైతులు శాస్త్రవేత్తల అనుమతుల మేరకే ఎరువులు వాడాలని రసాయనిక ఎరువులను విచాక్షనరహితంగా వాడకుండా భూమిని సంరక్షించాలని పచ్చి రొట్టె ఎరువులను వేసుకోవాలని రసాయనిక పురుగు తెగుళ్ల మందులను అవసరం మేరకే వినియోగించాలని నేల తల్లిని ఆరోగ్యంగా ఉంచడం రైతుల బాధ్యత అని సూచించారు సేద్య విభాగ శాస్త్రవేత్త బి మాధవి మాట్లాడుతూ వరి లో అందుబాటులో ఉన్న మార్కెట్లో మంచి గిరాకీ ఉన్న రకాలను ఎంచుకొని సాగు చేసి సాగు నీటిని రకాలను ఆదా చేయడం నీటిని ఆదా చేయడం పంట మార్పిడి వంటివి చేయాలని వివరించారు ముఖ్యంగా వ్యవసాయ విస్తీర్ణ అధికారి వి .వినూష వ్యవసాయ శాఖలోని పథకాలను గురించి వివరించడం జరిగింది ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ మౌనిక పంచాయతీ కార్యదర్శి కె శ్రీకాంత్ రైతులు తదితరులు పాల్గొన్నారు

# ప్రజావాణికి 77 ఫిర్యాదులు

**విజేత, నిజామాబాద్ ప్రతినిధి :** ప్రజావాణి కార్యక్రమానికి ప్రాధాన్యతనిస్తూ ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి అధికారులకు సూచించారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి 77 ఫిర్యాదులు అందాయి. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ఫిర్యాదుదారులు తమ సమస్యలను



కలెక్టర్ తో పాటు, అదనపు కలెక్టర్ కిరణ్ కుమార్, జిల్లా పరిషత్ సీఈఓ సాయాగౌడ్, డీఆర్డీఓ సాయన్న, హౌసింగ్ ఏ.ఈ నివర్తి, ఎస్.హెచ్.ఓ విజయ్ బాబు లకు విన్నవిస్తూ అర్జీలు సమర్పించారు. కాగా, ఫిర్యాదులను పెండింగ్ లో పెట్టకుండా ఎప్పటికప్పుడు పరిశీలన జరుపుతూ, సమస్యలను సత్వరమే పరిష్కరించాలని కలెక్టర్ అధికారులకు సూచించారు. కాగా, ఈ నెల 15న రాష్ట్ర సమాచార కమిషన్ హాజరవుతున్న నేపద్యంలో ఆయా శాఖల అధికారులు పూర్తి స్థాయి నివేదికలతో పాల్గొనాలని కలెక్టర్ సూచించారు. ఈ సందర్భంగా తైక్వాండో పోటీలలో ప్రతిభ కనబర్చిన బాలబాలికలను కలెక్టర్ అభినందించారు. ప్రజావాణి కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# ప్రజావాణిలో చేసిన దరఖాస్తుల పరిష్కారానికి అధికారులు చర్యలు తీసుకోవాలి జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ..



**విజేత: జయశంకర్ భూపాలపల్లి :** జయశంకర్ భూపాలపల్లి సోమవారం ఐడిఓసి కార్యాలయంలో అన్ని శాఖల అధికారులతో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లాలోని వివిద ప్రాంతాల నుండి వచ్చిన ప్రజల నుండి 65 దరఖాస్తులు స్వీకరించినట్లు తెలిపారు. ప్రజలు నుండి స్వీకరించిన సమస్యల దరఖాస్తులు సత్వర పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి దరఖాస్తును అధికారులు వ్యక్తి గతంగా పరిశీలించాలని సంబంధిత శాఖలకు వెంటనే ఎండార్స్మెంట్ చేసినట్లు తెలిపారు. ప్రజలకు సమయపాలనతో సేవలు అందించడం ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని ఆయన తెలిపారు. ప్రభుత్వ మార్గదర్శకాల మేరకు అందిన ప్రతి దరఖాస్తును ప్రజావాణి పోర్టల్‌లో తప్పనిసరిగా నమోదు చేయాలని సూచించారు. దరఖాస్తు దరఖాస్తుదారునికి రశీదు అందజేయాలని, తద్వారా సమస్యల పరిష్కారం పట్ల పారదర్శకత నెలకొల్పాలని ఆదేశించారు. అదేవిధంగా, దరఖాస్తు పరిష్కారానికి సంబంధించి శాఖల అధికారులు తీసుకున్న చర్యల వివరాలను పోర్టల్‌లో నమోదు చేయాలని ఆదేశించారు. ప్రజావాణి ద్వారా అందిన ప్రతి వినతిని ప్రాధాన్యంగా తీసుకుని, నిర్దిష్ట కాలపరిమితిలో పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ స్పష్టం చేశారు. పరిష్కారం లో ఆలస్యం జరిగితే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు అశోక్ కుమార్, శ్రీమతి విజయలక్ష్మి, డిఆర్వో వసంత కుమారి అన్ని శాఖల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రజా పాలన - ప్రగతి ప్రణాళిక లో భాగంగా విద్యా వారం, కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే..



**విజేత: జయశంకర్ భూపాలపల్లి :** భూపాలపల్లి నియోజకవర్గంలో "99 రోజుల ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక" కార్యక్రమంలో భాగంగా నిర్వహిస్తున్న "విద్యా వారం" కార్యక్రమంలో భాగంగా భూపాలపల్లి మున్సిపాలిటీ పరిధిలోని కేజీబీవీ పాఠశాలలో భూపాలపల్లి ఎమ్మెల్యే లిగంద్ర సత్యనారాయణ రావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే లిగంద్ర సత్యనారాయణ రావు మాట్లాడుతూ ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలలను ఆధునికీకరించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటోందన్నారు. విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించేందుకు పాఠశాలల్లో మెరుగైన మౌలిక వసతులు, సాంకేతిక పరిజ్ఞానం, అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులను అందుబాటులోకి తీసుకువస్తున్నామని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా ప్రమాణాలు గణనీయంగా పెరిగాయని, తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించి మంచి భవిష్యత్తు నిర్మించుకోవాలని కోరారు. అలాగే విద్యార్థుల అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందని, ప్రతి విద్యార్థి ఉన్నత స్థాయికి చేరుకునేలా విద్యా రంగంలో అనేక సంస్కరణలు అమలు చేస్తున్నామని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ విజయలక్ష్మి, విద్యశాఖ అధికారి రాజేందర్, మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్, డిసిసి అధ్యక్షుడు, టౌన్ ప్రెసిడెంట్, కౌన్సిలర్లు, ఉద్యోగులు, విద్యార్థులు మరియు ఇతర ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# బండి సంజయ్ ని కేంద్ర మంత్రి పదవి నుండి తొలగించాలి

### బిఆర్ఎస్ మండల అధ్యక్షుడు పింగిలి జగన్మోహన్ రెడ్డి



**విజేత,తరిగొప్పుల :** కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్ ను కేంద్ర మంత్రి పదవి నుండి తొలగించాలని బిఆర్ఎస్ మండల అధ్యక్షుడు పింగిలి జగన్మోహన్ రెడ్డి అన్నారు. మండల కేంద్రంలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి అనంతరం మాట్లాడుతూ బండి సంజయ్ కుమారుడు సాయిభగీరథ ను అమ్మాయిని వేధింపుల కేసులో పోకుసో చట్టాన్ని అమలు చేసి నాన్ బెయిలబుల్ సెక్షన్ల కింద కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు, గతంలో కూడా కాలేజీలో ర్యాగింగ్లకు పాల్పడుతూ అడ్డంగా దొరికిపోయి ఇప్పుడు మైనర్ అమ్మాయిల జీవితాలను పాడు చేయడం ఏం చేసినా కూడా మా నాన్న అండదండలు ఉన్నాయని అధికారం పెట్టుకొని ఆడింది ఆటగా చేస్తున్నారని దీనికి తోడు రాష్ట్ర ప్రభుత్వం కూడా అన్ని సాయ సహకారాలు అందిస్తున్నారని పూర్తిగా శాంతి భద్రతలు తెలంగాణలో క్షీణించిపోతున్నాయని వెంటనే బండి సంజయ్ కుమార్ ని అరెస్టు చేయాలని లేని ఎడల తీవ్రమైన ఉద్యమాలు చేయవలసి వస్తుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో అధికార ప్రతిని ధి చిలువేరు లింగం, సర్పంచ్ల ఫోరం మండల అధ్యక్షుడు కుర్ర మల్లయ్య, దండం శ్రీనివాస్, రాజు, జొన్న గౌని సుదర్శన్ గౌడ్, ఎడెల్లి శ్రీనివాస్ రెడ్డి, భూక్య జుమ్లాల్ నాయక్, వంగరామరాజు, రాజు,అంకం రాజారాం, సుంకరి రాజయ్య, బత్తిని సురేందర్, నే తుల సత్తయ్య, ఖాతా టోనీ, తాళ్ల పెల్లి పోచయ్య, బూస యాదగిరి,చింతల జైపాల్, అంకం శ్రీను, వెంకటేశ్వర్లు, థామస్, చారి, తదితరులు పాల్గొన్నారు.

# టిప్పర్ లారీ యజమానులపై చర్యలు తీసుకోవాలి- సిపిఎం డిమాండ్







**విజేత గోపాలపురం :** దేవరపల్లి మండలం త్యాజంపూడి ఆవచెరువులో అక్రమ మట్టి తవ్వకాలను నిరోధించాలని మట్టి రవాణా చేస్తున్న టిప్పర్ లారీ యజమానులపై కఠిన చర్యలు తీసుకోవాలని సిపిఎం ఆధ్వర్యంలో దేవరపల్లి తాసిల్దార్ కార్యాలయం వద్ద ఆందోళన నిర్వహించారు ఈ సందర్భంగా సిపిఎం కార్యదర్శి ఎస్ భగత్ మాట్లాడుతూ అనుమతులు లేకపోయినా యదేచ్ఛగా అక్రమంగా మట్టి రవాణా చేయటం దారుణం అన్నారు మట్టి తవ్వుతున్న తేలి కొట్టిన దొంగల్లా గ్రామ రెవెన్యూ అధికారులు వ్యవహరించటం దుర్మార్గం అన్నారు యంత్రాలు పనిచేస్తూ టిప్పర్ లారీలు తిరుగుతున్న గ్రామ రెవెన్యూ అధికారులకు కనపడటం లేదని విమర్శించారు ఆవ పూడికతీత తీయాలని చిత్తశుద్ధి ఉంటే ఉపాధి కూలీల తో పని చేయించాలన్నారు ఆవ చెరువు గట్టుని పటిష్టం చేయాలన్నారు రెవెన్యూ ఇరిగేషన్ శాఖ అధికారులు స్పందించాలన్నారు అక్రమ రవాణా చేసిన టిప్పర్ లారీ యజమానులపై కఠిన చర్యలు తీసుకోవాలని మట్టి తవ్వకాలను అక్రమంగా ప్రోత్సహిస్తున్న వారిపై కూడా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు అనంతరం మండల తాసిల్దార్ ఎం శ్రీనివాస్ కు వినతిపత్రం సమర్పించారు దేవరపల్లి సర్కిల్ ఇన్స్పెక్టర్ కు వినతి పత్రం అందజేశారు ఈ కార్యక్రమంలో పిన్నమనేని సత్యనారాయణ అయినపర్తి శ్రీనివాసరావు కె రత్నాజీ పాత గొలుసు విశ్వ తదితరులు పాల్గొన్నారు

# రాయపోల్ గడ్డపై హిందూ శక్తి గర్జన విజయవంతం చేద్దాం

### హిందూ సమ్మేళనాన్ని విజయవంతం చేసి హిందువుల ఐక్యతను చాటుదాం.

### హిందూ సమ్మేళన సమితి అధ్యక్షులు గోదాల శ్రీనివాసరెడ్డి.



**విజేత, ఇబ్రహీంపట్నం :-** ఇబ్రహీంపట్నం మండలం రాయపోల్ ఉప మండలము వేదికగా గ్రామపంచాయతీ కార్యాలయం ఆవరణంలో 13 మే 2026 బుధవారం సాయంత్రం 6:33 గంటలకు హిందూ సమ్మేళన సమితి శ్రీదేవి భూదేవి సమేత శ్రీవెంకటేశ్వర స్వామి కళ్యాణ వేడుకలు శ్రీ పప్పు బాలసుబ్రమణ్య శర్మ పంతులు ఆధ్వర్యంలో నిర్వహించబడుతుందని "రాయపోల్ గ్రామ హిందూ సమ్మేళన సమితి అధ్యక్షులు గోదాల శ్రీనివాసరెడ్డి" అన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య వక్తలుగా హనుమాన్ చాలీసా పారాయణ కర్త, అంతర్జాతీయ శ్రీకృష్ణ చైతన్య సంఘం ప్రవీణ్ పవన్ దాస్, దిల్ సుఖ్ నగర్ బాగ్ బౌద్ధిక్ టోలి సభ్యులు శ్రీరామ్ సుధాకర్, మహేశ్వరం భాగ్ సహ వ్యవస్థ ప్రముఖ్ చీరా నరసింహ హాజరవుతున్నారు. కార్యక్రమ అనంతరం అన్నప్రసాద కార్యక్రమం ఉంటుంది. నేటి కాలమాన పరిస్థితులలో ఎదురవుతున్న అనేక సవాళ్లను ఎదుర్కొనేందుకు హిందువుల ఐక్యత అవసరం. రాయపోలు గ్రామంలోని మీ అందరి భాగస్వామ్యాన్ని కోరుకుంటూ హిందూ సమ్మేళనం ఏర్పాటు చేయడమైనది. ఈ హిందూ సమ్మేళన కార్యక్రమంలో అందరూ కుటుంబ సమేతంగా పాల్గొనాలని సాధారణంగా ఆహ్వానిస్తున్నామని గోదాల శ్రీనివాసరెడ్డి తెలిపారు.

# పీస్ కమిటీ మీటింగ్ నిర్వహించిన ఎస్ఐ నవీద్

### జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్ ఐపీస్ ఆదేశాల మేరకు



**విజేత కృష్ణ :** రానున్న బక్రీద్ పండుగను శాంతియుత వాతావరణంలో నిర్వహించుకోవాలని కృష్ణ పోలీస్ స్టేషన్‌లో హిందూ, ముస్లిం మత పెద్దలతో ఎస్సై ఎస్ ఐ నవీద్ పీస్ కమిటీ మీటింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై నవీద్ మాట్లాడుతూ గోవుల అక్రమ రవాణాపై పోలీసులు ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఎవరైనా గోవులను అక్రమంగా తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అక్రమ రవాణా జరుగుతున్నట్లు సమాచారం తెలిసిన వెంటనే పోలీసులకు తెలియజేయాలని కోరారు. అలాగే, చట్టాన్ని ఎవరూ చేతిలోకి తీసుకోరాదని, అనుమానితులతో గొడవలకు దిగకుండా వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు. గోవుల అక్రమ రవాణాను అరికట్టేందుకు కృష్ణ బోర్డర్ లో రెండు చెక్‌పోస్ట్ లు ఏర్పాటు చేయడం జరిగింది అని వారు తెలిపారు

# ఆరేపల్లిలో వరిధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం



**విజేత మామడ:** మండలంలోని ఆరేపల్లి గ్రామంలో సోమవారం రోజు గిరిజన సహకార సంస్థ (జిసిసి) ఆధ్వర్యంలో వడ్ల కొనుగోలు కేంద్రాన్ని సర్పంచ్ నాయకులతో కలసి ప్రారంభించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ.. రైతులు తమ పంటను తప్పనిసరిగా ప్రభుత్వ ఆధ్వర్యంలోని కొనుగోలు కేంద్రంలోనే అమ్ముకోవాలని సూచించారు. బయట దళారులకు తక్కువ ధరలకు విక్రయించి మోసపోవద్దని, ప్రభుత్వం నిర్ణయించిన కనీస మద్దతు ధర ప్రకారం ధాన్యాన్ని కొనుగోలు చేస్తుందని తెలిపారు.కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ సోమా భీమ్ రెడ్డి, సర్పంచ్ జంగిలి రాజవ్వ మల్లయ్య, ఉప సర్పంచ్ ప్రేమ్ సింగ్, నిర్వాహకులు జాదవ్ సుధాకర్ రైతులు తదితరులున్నారు

# జల్ జీవన్ మిషన్ జల్ మహోత్సవ్ ప్రచార కార్యక్రమం నిర్వహణ



**విజేత మరిపెడ :** తెలంగాణ ప్రభుత్వం ఆధ్వర్యంలో హర్ ఘర్ జల్ జల్ జీవన్ మిషన్ కార్యక్రమంలో భాగంగా మిషన్ భగీరథ విభాగం ఆధ్వర్యంలో సోమవారం మరిపెడ మండలం గిరిపురం గ్రామంలో "జల్ జీవన్ మిషన్ జల్ మహోత్సవ్" ప్రచార కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అధికారులు గ్రామ ప్రజలకు ప్రతి ఇంటికి సురక్షిత తాగునీరు అందించడంలో జల్ జీవన్ మిషన్ లక్ష్యాలను వివరించారు. తాగునీటి సంరక్షణ, నీటి వృథాను నివారించడం, పరిశుభ్రత పాటించడం వంటి అంశాలపై అవగాహన కల్పించారు. గ్రామాల్లో తాగునీటి సరఫరా వ్యవస్థను సమర్థంగా వినియోగించుకోవాలని సూచించారు. ప్రజలు నీటి వనరులను కాపాడాలని, మిషన్ భగీరథ ద్వారా అందుతున్న తాగునీటిని సద్వినియోగం చేసుకోవాలని అధికారులు కోరారు. కార్యక్రమంలో సర్పంచ్ బాదావత్ నీల సైదులు, మిషన్ భగీరథ డి ఈ అనూష, ఏఈలు హాథిరాం నాయక్, అవినాష్ రెడ్డి, గ్రిడ్ శ్రీనివాస్, వెంకన్న, వాటర్ మెన్, గ్రామస్తులు పాల్గొన్నారు.

# కొండగట్టు అంజన్న ఆలయ యాగశాలలో త్రయాహినిక హోమాలు



**విజేత కరీంనగర్ ప్రతినిధి :** ఈనెల 12న హనుమాన్ జయంతిని పురస్కరించుకొని ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన కొండగట్టు అంజన్న ఆలయ యాగశాలలో హోమాలు, వైభవంగా ఆదివారం నిర్వహించారు వేద పండితులు అర్చకుల మంత్రోచ్ఛర్ణాల నడుమ హోమ కార్యక్రమాలు శాస్త్రవేత్తంగా జరిగాయి లోక కళ్యాణార్థం భక్తుల శ్రేయస్సు కోసం ఈ హోమాలు నిర్వహించినట్లు ఆలయ అధికారులు తెలిపారు పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు

# పేదలకు చేరాల్సిన రేషన్ బియ్యం పక్కదారి



**విజేత కరీంనగర్ ప్రతినిధి :** కరీంనగర్ నగరంలో పేదలకు చేరాల్సిన రేషన్ బియ్యం బహిరంగంగానే పక్కదారి పడుతున్నాయి రాత్రివేళ ద్విచక్ర వాహనంపై ప్రభుత్వ ముద్ర ఉన్న సంచుల్లో బియ్యాన్ని తరలిస్తున్నారు ఇన్నాళ్లు గుట్టు చప్పుడు కాకుండా సాగిన ఈ దందా ఇప్పుడు యదేచ్ఛగా సాగుతూ ఉండటంపై స్థానికులు మండిపడుతున్నారు ఉన్నతాధికారులు తక్షణమే స్పందించి అక్రమ రవాణాపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు

# కొండగట్టు ఆవరణలో వృద్ధుడి అస్తిపంజరం



**విజేత కరీంనగర్ ప్రతినిధి :** జగిత్యాల జిల్లా కొండగట్టు ఆలయం సమీపంలో బొజ్జ పోతన ప్రాంతంలో 60 నుంచి 70 ఏళ్ల వయసున్న వ్యక్తి మృతదేహం ఎండిపోయిన అస్తిపంజరం గా మారిన స్థితిలో స్థానికులు సోమవారం గుర్తించారు ఈ ఘటనపై మల్యాల పోలీసులు కేసు నమోదు చేసి పోస్టుమార్టం నిర్వహించి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు ఈ సంఘటన స్థానికంగా కలకలం రేపిందని వాపోతున్నారు

# ఆర్టీసీ బస్సులు బంద్ తో ప్రజలు ఇబ్బందులు



**విజేత, ఇబ్రహీంపట్నం :-** ఇబ్రహింపట్నం డిపో పరిధిలో సెలవుల పేరుతో గ్రామీణ ప్రాంతాలకు బస్సులు బంద్ చేసి ఇబ్రహింపట్నం డిపో మేనేజర్ ప్రజలను నానా ఇబ్బందులూ పెడుతున్నరు. ఇబ్రహింపట్నం డిపో పరిధిలోని తాటిపర్తి, మేడిపల్లి, కొత్తపల్లి, కందుకూరు, మొండి గౌరెలి, ఆమనగల్, ఆజీల పురం నైట్ హాల్ట్ బస్సులు లేక హైదరాబాద్ నుంచి గ్రామీణ ప్రాంతాలకు వచ్చే ప్రజలు, గ్రామీణ ప్రాంతాల నుంచి హైదరాబాద్ పోవు ప్రజలు రైతులు, విద్యార్థులు, మహిళలు, యువకులు, ఉపాధి కూలీలు, సామాన్య ప్రజలు నానా ఇబ్బందులూ పడుతున్నారు. కావున దయచేసి బస్సు సౌకర్యం కల్పించాలని ప్రజావాణి లో ఆర్డిఓ అనత రెడ్డికి పి ఆర్ జి ఫౌండేషన్ అధ్యక్షులు ప్రొద్దుటూరి రవీందర్ గుప్త వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ఇబ్రహింపట్నం ఆర్టీసీ డిపో మేనేజర్ కు పలుమార్లు వినతి పత్రాలు ఇచ్చిన స్పందన లేక పోవడంతో సోమవారం ప్రజావాణిలో వినతి పత్రం అందజేసిన నట్లు తెలిపారు. ఇప్పటికైనా స్పందించి బస్సులు నడపాలని ఆర్టీసీ అధికారులను కోరారు. లేనిచో ప్రజలతో కలిసి ఆందోళన చేస్తానని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పి.ఆర్.జి ఫౌండేషన్ సభ్యులు ప్రొద్దుటూరి సురేందర్ గుప్త ఉన్నారు.

# నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు

## ఇసుక సమన్వయ కమిటీల సమావేశంలో కలెక్టర్ ఇలా త్రిపాఠి





**విజేత, నిజామాబాద్ ప్రతినిధి :** ఇసుక రవాణా విషయంలో నిబంధనల ఉల్లంఘన జరిగితే కఠిన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ ఇలా త్రిపాఠి హెచ్చరించారు. కలెక్టర్ అధ్యక్షతన సోమవారం ఐడీఓసీ వీడియో కాన్ఫరెన్స్ హాల్లో జిల్లా స్థాయి ఇసుక సమన్వయ కమిటీ సమావేశం నిర్వహించారు. రెవెన్యూ, మైనింగ్, ఇంజినీరింగ్ తదితర శాఖల అధికారులు హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ఇసుక రీచ్ లను. క్రమం తప్పకుండా తనిఖీలు చేయాలని అధికారులను ఆదేశించారు. మన ఇసుక వాహనం ఆన్లైన్ బుకింగ్ ద్వారా ఇసుక కేటాయింపులు జరగాలని, ఇసుక రవాణా విషయంలో ఎలాంటి పొరపాట్లు జరగకుండా చూడాల్సిన బాధ్యత.సంబంధిత శాఖల అధికారులదేనని స్పష్టం చేశారు. ప్రభుత్వ నిబంధనలను తూచ తప్పకుండా అమలయ్యేలా చూడాలన్నారు. సాయంత్రం ఐదు గంటల తర్వాత ఇసుక వాహనాల రాకపోకలను ఎట్టి పరిస్థితుల్లోనూ అనుమతించకూడదని కలెక్టర్ సూచించారు. అన్ని శాఖల అధికారుల సమన్వయంతో పని చేస్తూ అక్రమాలకు తావు లేకుండా చూడాలన్నారు. ఇసుక రీచ్ ల వద్ద టీజీఎండిసి అధికారులు ప్రభుత్వ మార్గదర్శకాలను పక్కాగా పాటించాలని అన్నారు. ఈ సందర్భంగా యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్, జవహర్ నవోదయ విద్యాలయం భవన సముదాయాల నిర్మాణాలకు అవసరమైన ఇసుక నిల్వలను నిర్దేశిత ఇసుక రీచ్ ల నుండి తరలించేందుకు కలెక్టర్ అనుమతించారు. ఈ సమావేశంలో సబ్ కలెక్టర్ అభిగ్యాన్ మాల్వియ, నిజామాబాద్ ఆర్డీఓ రాజేంద్ర కుమార్, మైనింగ్, రెవెన్యూ, ఇంజినీరింగ్ విభాగాల అధికారులు పాల్గొన్నారు.

# మహిళా సాధికారతకు అడుగులు

# చొప్పదండిలో కుట్టు మిషన్ శిక్షణ కేంద్రాల ప్రారంభం





## ఆరాధ్య ఇంటిగ్రేటెడ్ ఫౌండేషన్ చొరవతో 60 మంది మహిళలకు స్వయం ఉపాధి శిక్షణ

## జిల్లా ఇంచార్జి చిలుముల స్వప్న

**విజేత,చొప్పదండి :** గ్రామీణ మహిళల ఆర్థిక స్వావలంబనకు చేయూతనిస్తూ ఆరాధ్య ఇంటిగ్రేటెడ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో చొప్పదండి మండలంలోని వేదురుగట్ట, ఆర్నకొండ గ్రామాలలో కుట్టు మిషన్ శిక్షణ కేంద్రాలను ఘనంగాప్రారంభించారు.కరీంనగర్ జిల్లా కోఆర్డినేటర్ల ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో మొత్తం 60 మంది మహిళలు, యువతులు శిక్షణ కోసం నమోదు చేసుకున్నారు. గ్రామాలలోనే శిక్షణ కేంద్రాలు ఏర్పాటు చేయడంతో తమకు ఎంతో సౌకర్యంగా ఉందని, ప్రయాణ ఖర్చులు తప్పాయని శిక్షణార్థులు హర్షం వ్యక్తం చేశారు.తక్కువ ధరకు కుట్టు మిషన్లుతక్కువ ధరలో 95-10 మోడల్ కుట్టు మిషన్లు అందిస్తుండటం పట్ల మహిళలు ఆనందం వ్యక్తం చేశారు.ఈ శిక్షణతో స్వయం ఉపాధి పొంది కుటుంబానికి ఆసరాగా నిలుస్తామని ధీమా వ్యక్తం చేశారు.బహుళ శిక్షణ కోర్సులు ఈ సందర్భంగా జిల్లా ఇన్‌చార్జ్ చిలుముల స్వప్న మాట్లాడుతూ, ఆరాధ్య ఇంటిగ్రేటెడ్ ఫౌండేషన్ ద్వారా కుట్టు మిషన్ శిక్షణతో పాటు మగ్గం వర్క్,కంప్యూటర్ ట్రైనింగ్,బ్యూటీషియన్ కోర్సులుకూడా అందిస్తున్నామని తెలిపారు. గ్రామీణ ప్రాంత మహిళలు ఆర్థికంగా ఎదగడానికి ఈ కార్యక్రమాలు ఎంతో ఉపయోగపడతాయని ఆమె అన్నారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఆర్నకొండ సర్పంచ్ వడ్లరి లక్ష్మి-భూమయ్య, వేదురుగట్ట సర్పంచ్ పెంచాల శ్రీనివాస్, ఉపసర్పంచ్ మారం శ్రీనివాస్, సీఏ కోహెడ లావణ్య హాజరయ్యారు. గ్రామాలలో ఇలాంటి ఉపాధి ఆధారిత శిక్షణ కేంద్రాలను ఏర్పాటు చేసినందుకు ఫౌండేషన్ ప్రతినిధులకు ధన్యవాదాలు తెలిపారు. భవిష్యత్తులో కూడా తమ పూర్తి సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమం విజయవంతంగా కొనసాగేందుకు ఫౌండర్ పోలీస్ మాధవి మార్గదర్శకత్వం ఎంతో ప్రేరణనిస్తోందని, ప్రాజెక్ట్ మేనేజర్ కె. దేవేందర్ రెడ్డి సేవలను ప్రత్యేకంగా అభినందించారు. గ్రామీణ మహిళలకు ఉపాధి, నైపుణ్యాభివృద్ధి కల్పించడమే సంస్థ ప్రధాన లక్ష్యమని నిర్వాహకులు పేర్కొన్నారు.

# గవర్నమెంట్ డిగ్రీ కాలేజ్ సదాశివపేట లో ఘనంగా విద్యా వారోత్సవాల ప్రారంభం





**విజేత , సంగారెడ్డి ప్రతినిధి :** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన "ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక -- 99 రోజుల కార్యక్రమం"లో భాగంగా కమిషనర్ ఆఫ్ కాలేజియేట్ ఎడ్యుకేషన్ ఆదేశాల మేరకు ప్రభుత్వ డిగ్రీ కళాశాల లో విద్యా వారోత్సవాలు సోమవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. మే 11 నుండి మే 17 వరకు ఏడు రోజుల పాటు నిర్వహించనున్న ఈ కార్యక్రమాన్ని జ్యోతి ప్రజ్వలనతో ప్రారంభించారు. కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ బంగ్లా భారతి గంజి స్వాగత ఉపన్యాసం చేస్తూ విద్యార్థులు విద్య యొక్క ప్రాముఖ్యతను గ్రహించి ఉన్నత లక్ష్యాలతో ముందుకు సాగాలని సూచించారు. డిగ్రీతోనే ఆగిపోకుండా ఉన్నత విద్యను అభ్యసించి సమాజంలో మంచి మార్పులు తీసుకురావాలని పిలుపునిచ్చారు. విద్య ద్వారానే వ్యక్తిగత మరియు సామాజిక అభివృద్ధి సాధ్యమవుతుందని పేర్కొన్నారు. ప్రతి విద్యార్థి క్రమశిక్షణతో చదువుకొని కళాశాలకు, తల్లిదండ్రులకు, సమాజానికి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన రేణుక చిరంజీవి మాట్లాడుతూ విద్య యొక్క గొప్పతనాన్ని వివరించారు. గ్రామీణ ప్రాంతాల విద్యార్థులు చదువును మధ్యలో ఆపకుండా పట్టుదలతో కొనసాగించి ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని సూచించారు. క్రమం తప్పకుండా కళాశాలకు హాజరై తమ గ్రామాలకు, కుటుంబాలకు గౌరవం తీసుకురావాలని ఆశీర్వదించారు. కళాశాల పూర్వ విద్యార్థి మహేష్ విద్యా వారోత్సవాల ప్రాముఖ్యత, ఉపాధి అవకాశాలు, విద్యార్థుల భవిష్యత్ నిర్మాణంలో ఉన్నత విద్య పాత్ర గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ సిద్దులు, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్లు డాక్టర్ పి. మురళీకృష్ణ శకుంతల , సారవయ్య సావిద్య మంజుల రాజిరెడ్డి స్రవంతి శంకరయ్య రాజకుమార్ తదితర అధ్యాపకులు, బోధనేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

# పోక్సో కేసులో బండి సాయి భగీరథ్ అరెస్ట్ చేయాలి

## సంగారెడ్డిలో బీఆర్ఎస్ యువత, విద్యార్థి విభాగం భారీ రాస్తారోకో





**విజేత, సంగారెడ్డి ప్రతినిధి :** సంగారెడ్డి జిల్లా కేంద్రంలో భారత రాష్ట్ర సమితి యువత, విద్యార్థి విభాగం ఆధ్వర్యంలో భారీ రాస్తారోకో నిర్వహించారు. కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమారుడు బండి సాయి భగీరథ్‌పై నమోదైన పోక్సో కేసు విషయంలో రాష్ట్ర ప్రభుత్వం అనుసరిస్తున్న వైఖరిని నిరసిస్తూ ఈ కార్యక్రమం చేపట్టారు. సంగారెడ్డి ఎమ్మెల్యే చింత ప్రభాకర్ ఆదేశాల మేరకు సంగారెడ్డి కొత్త బస్టాండ్ వద్ద నిర్వహించిన ఈ నిరసనలో పెద్ద సంఖ్యలో యువత, విద్యార్థి నాయకులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేసిన నాయకులు, లైంగిక వేధింపులకు పాల్పడిన బండి సాయి భగీరథ్‌ను వెంటనే అరెస్ట్ చేయాలని డిమాండ్ చేశారు. అలాగే కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్ వెంటనే తన పదవికి రాజీనామా చేయాలని కోరారు. కేసు విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరించిన పోలీసు అధికారులపై చర్యలు తీసుకుని బాధ్యులైన పోలీసులను వెంటనే సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు.పోక్సో చట్టం కింద కేసు నమోదైన తర్వాత కూడా 48 గంటలు గడిచినా అరెస్ట్ చేయకపోవడం దారుణమని నాయకులు విమర్శించారు. బాధితురాలి కుటుంబాన్ని బెదిరించడం, సాక్షులను ప్రభావితం చేసే ప్రయత్నాలు జరిగాయని ఆరోపిస్తూ, ఈ అంశాలను కూడా కేసులో భాగంగా చేర్చాలని కోరారు. బాధితురాలికి మరియు ఆమె కుటుంబానికి తక్షణ రక్షణ కల్పించి, ఆమెతో వెంటనే మెజిస్ట్రేట్ ముందు 164 స్టేట్‌మెంట్ నమోదు చేయించాలని డిమాండ్ చేశారు. అలాగే, బాధితురాలు ఫిర్యాదు ఇవ్వడానికి వచ్చినప్పుడు గంటల తరబడి వేచి చూసేలా చేసి కేవలం అక్‌నాలెడ్జ్‌మెంట్ ఇచ్చి పంపించిన పేట్ బషీరాబాద్ పోలీసులపై చర్యలు తీసుకోవాలని, ఎఫ్ఐఆర్ నమోదులో జాప్యం చేసిన అధికారులను సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్వి నియోజకవర్గ అధ్యక్షుడు పెద్దగొల్ల శ్రీహరి, జిల్లా కోఆర్డినేటర్ రాజేందర్, రాష్ట్ర కార్యదర్శి మన్సూర్ నాయక్, పట్టణ, మండల యువత అధ్యక్షులు వాజిత్, నాని, నరేష్ గౌడ్, నాయకులు శ్రవణ్ రెడ్డి, సదాశివపేట మైనారిటీ అధ్యక్షులు కమిల్, బీఆర్ఎస్వి పట్టణ, మండల అధ్యక్షులు పాండు నాయక్, రోషన్, అఖిల్, రమేశ్, దిలీప్, గౌతమ్, చింటూ, సంగమేశ్ తదితరులు పాల్గొన్నారు.

# ఓటరు మ్యాపింగ్ వేగంగా పూర్తి చేయాలి.!




## రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి సుదర్శన్ రెడ్డి

**విజేత మామడ :** ఎస్ఐఆర్ ప్రక్రియలో భాగంగా చేపడుతున్న ఓటరు ప్రోజెని మ్యాపింగ్ కార్యక్రమాన్ని వెంటనే పూర్తి చేయాలని రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి సుదర్శన్ రెడ్డి జిల్లా అధికారులను ఆదేశించారు. సోమవారం రాష్ట్రంలోని అన్ని జిల్లాల కలెక్టర్లు, ఎన్నికల అధికారులతో ఆయన వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి మ్యాపింగ్ ప్రక్రియ పురోగతిని సమీక్షించారు. ఈ సందర్భంగా సుదర్శన్ రెడ్డి మాట్లాడుతూ, రాష్ట్రవ్యాప్తంగా ఓటరు ప్రోజెని మ్యాపింగ్ పనులను వేగవంతం చేయాలని సూచించారు. కొన్ని జిల్లాల్లో ప్రక్రియ నెమ్మదిగా కొనసాగుతోందని పేర్కొంటూ, వెనుకబడిన జిల్లాలు ప్రత్యేక దృష్టి సారించి లక్ష్యాలను త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. ఇప్పటివరకు జరిగిన మ్యాపింగ్ ప్రక్రియకు సంబంధించిన పురోగతిని జిల్లాల వారీగా సమీక్షించి అధికారులకు పలు సూచనలు చేశారు. అనంతరం కలెక్టరేట్ సమావేశ మందిరం నుంచి వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా అధికారులతో మాట్లాడుతూ, జిల్లాలో ఓటరు ప్రోజెని మ్యాపింగ్ ప్రక్రియను మరింత వేగవంతంగా నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. బీఎల్ఓలు తప్పనిసరిగా క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ మ్యాపింగ్ ప్రక్రియను పకడ్బందీగా పూర్తి చేయాలని సూచించారు. సూపర్వైజర్లు నిరంతరం పర్యవేక్షణ నిర్వహిస్తూ ప్రతి దశను పరిశీలించాలని తెలిపారు. మ్యాపింగ్ ప్రక్రియలో ఎలాంటి తప్పులు, లోపాలు చోటుచేసుకోకుండా జాగ్రత్తలు తీసుకోవాలని కలెక్టర్ స్పష్టం చేశారు. అర్హులైన ప్రతి ఓటరు వివరాలు సక్రమంగా నమోదు కావాలని, ఎన్నికల ప్రక్రియ పారదర్శకంగా ఉండేందుకు అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో భైంసా సబ్ కలెక్టర్ అజ్మీరా సంకేత్ కుమార్, ఆర్డీఓ రత్నకళ్యాణి, ఎన్నికల శాఖ అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ప్రజా సమస్యల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి సారించాలి





## జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్

**విజేత,సంగారెడ్డి ప్రతినిధి :** ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను తక్షణమే పరిష్కరించే దిశగా అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ అధికారులను ఆదేశించారు. ప్రజావాణి కార్యక్రమానికి వచ్చే ప్రతి ఫిర్యాదును బాధ్యతగా స్వీకరించి, నిర్ణీత గడువులో పరిష్కరించాలని సూచించారు. సోమవారం జిల్లా కలెక్టరేట్‌లోని గ్రీవెన్స్ హాల్‌లో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో కలెక్టర్ ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. వివిధ సమస్యలతో వచ్చిన ప్రజల నుంచి వివరాలు తెలుసుకుని, సమస్యల పరిష్కారం కోసం సంబంధిత శాఖల అధికారులకు తగిన సూచనలు జారీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, సంగారెడ్డి పట్టణంలోని పలు ప్రాంతాల్లో మ్యాన్‌హోల్స్ తెరిచి ఉండటం ప్రమాదకరమని పేర్కొన్నారు. ప్రమాదాలు జరగకముందే వాటిని పరిశీలించి వెంటనే మూసివేయాలని మున్సిపల్ కమిషనర్‌కు ఆదేశించారు. అలాగే ఆర్ అండ్ బి రోడ్ల డివైడర్లపై ఏర్పాటు చేసిన పెద్ద పెద్ద ఫ్లెక్సీలు, పాత ఫ్లెక్సీలను తొలగించాలని సంబంధిత అధికారులకు సూచించారు.సింగూర్ డ్యాం వద్ద బారికేడ్లు, హెచ్చరిక సైన్ బోర్డులు లేవని తన దృష్టికి వచ్చినట్లు కలెక్టర్ తెలిపారు. ప్రజల భద్రత దృష్ట్యా ప్రమాదాలు నివారించేందుకు వెంటనే బారికేడ్లు, సైన్ బోర్డులు ఏర్పాటు చేయాలని ఇరిగేషన్ అధికారులను ఆదేశించారు.ప్రజావాణి ద్వారా వచ్చిన ఫిర్యాదులను 30 రోజులలోపు పరిష్కరించాలని కలెక్టర్ స్పష్టం చేశారు. సమస్యల పరిష్కారంలో ఎలాంటి జాప్యం లేకుండా అధికారులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు.జిల్లాలో డివిజన్ వారీగా నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమాల్లో మొత్తం 108 ఫిర్యాదులు అందినట్లు అధికారులు తెలిపారు. అందులో కలెక్టరేట్‌కు 23, సంగారెడ్డి డివిజన్‌కు 27, ఆందోల్ డివిజన్‌కు 03, నారాయణఖేడ్ డివిజన్‌కు 27, జహీరాబాద్ డివిజన్‌కు 29 ఫిర్యాదులు అందినట్లు వెల్లడించారు.ఈ కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్లు సంగీత, పాండు, జిల్లా అధికారులు, రెవెన్యూ డివిజనల్ అధికారులు, మున్సిపల్ కమిషనర్లు, కలెక్టరేట్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ పార్టీలో చేరిన పలువురు బిఆర్ఎస్ మాజీ సర్పంచులు

## కండువా కప్పి కాంగ్రెస్ పార్టీలోకి ఆహ్వానించిన రాష్ట్ర ప్రభుత్వ విప్




**విజ;త, కరీంంగర్ :** రాజన్న సిరిసిల్ల జిల్లా రుద్రంగి మండలం ఉమ్మడి మానాల గ్రామానికి చెందిన బిఆర్ఎస్ సర్పంచ్ తండా మాజీ సర్పంచ్ మాళవత్ రమణయ్య, రూపాల తండా జగదంబ సేవాలాల్ గుడి చైర్మన్ భూక్యా నారాయణ నాయక్, సీనియర్ నాయకులు నాయకులు అజ్మీరా విఠల్ , లక్పతి,లకవత్ విష్ణు , భూక్యా శర్మన్ నాయక్ తదితరులు కాంగ్రెస్ పార్టీలో చేరారు.. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ గారు కండువా కప్పి కాంగ్రెస్ పార్టీలోకి ఆహ్వానించారు.. వారు మాట్లాడుతూ కేవలం కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం ద్వారా మాత్రమే అబివృద్ధి సాధ్యం అన్నారు..

# యువత స్వయం ఉపాధితో ఎదగాలి

## టీజీఐఐసీ చైర్మన్ నిర్మల జగ్గారెడ్డి.



**విజేత, సంగారెడ్డి ప్రతినిధి :** సదాశివపేటలోని నిజాంపూర్ రోడ్డులో నూతనంగా ఏర్పాటు చేసిన చిలుకూరి నరేందర్ శ్రీ లక్ష్మీ ఫిల్లింగ్ స్టేషన్ ఇండియన్ ఆయిల్ పెట్రోల్ పంపును ప్రారంభించిన టి.జి.ఐ.ఐసి చైర్మన్ నిర్మల జగ్గారెడ్డి. ఈ సందర్భంగా నిర్మల జగ్గారెడ్డి మాట్లాడుతూ సొంత ఉపాధినీ ఎన్నుకుంటూ వ్యాపార రంగంలో మరింతగా రాణించినట్లయితే ఇతరులకు నిరుద్యోగ్యస్థులకు ఉపాధిని కల్పించినట్లు అవుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సి డి సి చైర్మన్ గడీల రామ్ రెడ్డి మున్సిపల్ చైర్ పర్సన్ మునిపల్లి అంజమ్మ సత్యనారాయణ, వైస్ చైర్మన్ రేణుక చిరు, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు పట్లూరి నాగరాజుగౌడ్ మండల అధ్యక్షుడు శ్రీనివాస్, కౌన్సిలర్లు, కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# మున్సిపల్ కార్పొరేషన్ కో అప్షన్ సభ్యుల ఎన్నిక

## మిత్రపక్షం మజ్లీస్ తో కలిసి ఐదు స్థానాలు కైవసం




**విజేత, నిజామాబాద్ ప్రతినిధి :** నిజామాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ కో అప్షన్ సభ్యుల ఎన్నికల్లో అధికార పార్టీ హవా చాటింది. సోమవారం జరిగిన కో అప్షన్ స్థానాలకు జరిగినఎన్నికల్లో మిత్రపక్షమైన మజ్లీస్ తో కలిసి అన్ని స్థానాలను ఏకగ్రీవంగా కైవసం చేసుకుంది. ఐదు స్థానాల్లో రెండు స్థానాలను మజ్లిస్ కు మూడు స్థానాల్లో కాంగ్రెస్ బలపరిచిన అభ్యర్థులు గెలిపించుకుంది. అందులో నిజామాబాద్ రూరల్ నుంచి ఒక్కరికి, అర్బన్ నుంచి నలుగురు ఎంపికయ్యారు. బల్దియా ఎన్నికలలో 28స్థానాలలో గెలిచి అతిపెద్ద పార్టీగా నిలిచిన బిజేపి సరిపడా బలం లేక పోటీకి దూరంగా నిలిచింది. గత నెలలో కో అప్షన్ సభ్యుల ఎన్నికకు నోటిఫికేషన్ జారీ కాగా సోమవారం ప్రత్యేకసమావేశం నిర్వహించారు. 50 కి పైగా దరఖాస్తులు రాగా చర్చల తరువాత ఐదుగురు కో అప్షన్ సభ్యులను ఎన్నుకున్నారు. నగర పాలక సంస్థ మేయర్ ఉమారాణి అధ్యక్షతన జరిగిన సమావేశానికి కమిషనర్ దిలీప్ కుమార్ఆధ్వర్యంలో జరిగిన సభ్యుల ఎంపికకు ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్, రూరల్ ఎమ్మెల్యేభూపతి రెడ్డి ఎక్స్ అఫిషియో హోదాలో హజరయ్యారు. ఈ సమావేశంలో జనరల్ కోటాలో కాంగ్రెస్ బలపరిచిన బొబ్బిలి మాధురి, కల్లేడ అశోక్, ఎంఐఎం నుంచి ముజీబ్ హైమద్ లను, మైనార్టీ కోటాలో కాంగ్రెస్ నుంచి సర్దార్ నరేందర్ సింగ్, ఎంఐఎం నుంచి ఉజ్మాతరుణం పోటి లేకుండా ఏకగ్రీవంగా ఎన్నిక అయినట్లు అధికారులు ప్రకటించారు. కోఅప్షన్ సభ్యులను అధికారులు సన్మానించి నియామక పత్రాలను అందజేశారు.

# కోరం లేక చొప్పదండి మున్సిపల్ కో-ఆప్షన్ సభ్యుల ఎన్నిక వాయిదా



**విజేత,చొప్పదండి :** చొప్పదండి పురపాలక సంఘంలో కో-ఆప్షన్ సభ్యుల ఎన్నికల ప్రక్రియకు సోమవారం బ్రేక్ పడింది. ఉదయం 11 గంటలకు ఏర్పాటు చేసిన ప్రత్యేక సమావేశానికి సభ్యులు ఎవరూ హాజరు కాకపోవడంతో సమావేశం వాయిదా పడింది.ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ కీర్తి నాగరాజు మాట్లాడుతూ, కో-ఆప్షన్ సభ్యుల ఎన్నికల నిర్వహణకు ఏర్పాటు చేసిన ప్రత్యేక సమావేశానికి అవసరమైన కోరం లేకపోవడంతో నిబంధనల ప్రకారం ఎన్నికల ప్రక్రియను వాయిదా వేయాల్సి వచ్చిందన్నారు.సమావేశానికి ప్రజాప్రతినిధులు, సంబంధిత సభ్యులు హాజరు కాకపోవడంతో నిబంధనల ప్రకారం సమావేశాన్ని నిలిపివేసినట్లు తెలిపారు. తదుపరి సమావేశ తేదీని త్వరలో ప్రకటించనున్నట్లు మున్సిపల్ కమిషనర్ నాగరాజు తెలిపారు

# గంగారంలో ఇందిరమ్మ ఇల్లు గృహప్రవేశం



**విజేత మహేశ్వరం :** మహేశ్వరం మండలం గంగారం గ్రామపంచాయతీలో నిరుపేద కుటుంబాలకు ఇందిరమ్మ ఇళ్ల మంజూరులో ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారిస్తోందని గ్రామ సర్పంచ్ దేవేందర్ నాయక్ తెలిపారు. గ్రామానికి చెందిన పాల్య జ్యోతి జయరాం కుటుంబానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ ఇంఛార్జ్ కేఎల్ఆర్ సహకారంతో పాటు గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో ఇందిరమ్మ ఇల్లు మంజూరు కావడంతో, ఇటీవల నిర్మాణం పూర్తిచేసుకున్న ఇంటి గృహప్రవేశ కార్యక్రమం సోమవారం ఉదయం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సర్పంచ్ దేవేందర్ నాయక్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గంగారం గ్రామంలో ఇప్పటివరకు 60 ఇందిరమ్మ ఇళ్లు మంజూరు కాగా, వాటిలో 45 ఇళ్ల నిర్మాణం పూర్తయ్యిందన్నారు. ఇంకా అర్హులైన పేద కుటుంబాలు ఉంటే గుర్తించి, కాంగ్రెస్ పార్టీ ఇంఛార్జ్ కేఎల్ఆర్ సహకారంతో మరిన్ని ఇళ్లు మంజూరు చేయించేందుకు చర్యలు తీసుకుంటామని చెప్పారు. గ్రామంలో పెండింగ్‌లో ఉన్న రెండు సీసీ రోడ్ల పనులు కూడా పూర్తి చేశామని తెలిపారు. గంగారం గ్రామపంచాయతీని ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ మహేందర్, వార్డు సభ్యులు ఎం.మోహన్, ఎం.రవి, ఎం.ధర్మ, ఎం.పద్మదేవ,శ్రీనివాస్, జయరాం, మాజీ ఎంపీటీసీ పాండు నాయక్ గ్రామ పెద్దలు, తదిరులు పాల్గొన్నారు

# నూతన 100 పడకల ప్రభుత్వ ఆసుపత్రిని పరిశీలించిన ఎమ్మెల్యే డా. మట్టా రాగమయి దయానంద్

## రోగులకు మెరుగైన వైద్య సేవలందించాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం



**విజేత, సత్తుపల్లి :** సత్తుపల్లి పట్టణంలోని 100 పడకల నూతన ప్రభుత్వ ఆసుపత్రిని సత్తుపల్లి ఎమ్మెల్యే డా. మట్టా రాగమయి దయానంద్ పరిశీలించారు. ఇటీవల ప్రారంభమైన ఈ ఆసుపత్రిలో రోగులకు మరింత మెరుగైన వైద్య సేవలు అందించాలనే లక్ష్యంతో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో అందుబాటులోకి తెచ్చిన ఆధునిక వైద్య పరికరాలు, నూతన సాంకేతిక వైద్య సదుపాయాలు, ల్యాబ్ టెక్నాలజీ, బెడ్ల ఏర్పాటు తదితర అంశాలను ఎమ్మెల్యే స్వయంగా పరిశీలించారు. ఆసుపత్రిలోని ప్రతి వార్డును సందర్శిస్తూ రోగులను కలుసుకుని వారి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. వైద్యులు, సిబ్బందితో మాట్లాడి అందుతున్న వైద్య సేవలపై వివరాలు తెలుసుకున్నారు. ప్రభుత్వ ఆసుపత్రి ద్వారా ప్రజలకు నాణ్యమైన వైద్యం అందాలని, ఎలాంటి లోపాలు లేకుండా సేవలు కొనసాగించాలని సూచించారు. అనంతరం ఆసుపత్రి సూపరింటెండెంట్, వైద్యులు, సిబ్బంది, ఆసుపత్రి డెవలప్‌మెంట్ కమిటీ సభ్యులతో సమావేశమై పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. ముఖ్యంగా ప్రసూతి వార్డు, చిన్నారుల వార్డులను ప్రత్యేకంగా సందర్శించి రోగులతో ఆప్యాయంగా మాట్లాడి ధైర్యం చెప్పారు. ఈ కార్యక్రమంలో సత్తుపల్లి మున్సిపల్ కమిషనర్ నరసింహ, మున్సిపల్ వైస్ చైర్మన్ బొంతు సుమలత, ఎఎంసి చైర్మన్ దోమ ఆనంద్, ఆసుపత్రి సూపరింటెండెంట్ సురేష్ నాయక్, డెవలప్‌మెంట్ కమిటీ సభ్యులు శెట్టి సాంబశివరావు, ఫయాజ్, ఇనపనూరి కుమారి, పట్టణ కౌన్సిలర్లు కర్నాటి విజయలక్ష్మి, విరివాడ అపర్ణ నాగభూషణం, షేక్ హసీనా షరీఫ్, ఉప్పు నాగమణి, మందపాటి ప్రభాకర్ రెడ్డి, జగన్నాథం శ్రీను, జొన్నలగడ్డ శ్రీను తదితరులు పాల్గొన్నారు.

# మట్టి మాఫియా పై చర్యలు తీసుకోవాలి- సిపిఎం డిమాండ్




**విజేత గోపాలపురం :** దేవరపల్లి మండలం త్యాజంపూడి గ్రామంలో ఆవ చెరువులో అక్రమంగా మట్టి తవ్వుతున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని సిపిఎం డిమాండ్ చేసింది ఆవచెరువులో అక్రమంగా జరుగుతున్న మట్టి తవ్వకాలపై సిపిఎం నిరసన వ్యక్తం చేసింది ఈ సందర్భంగా సిపిఎం కార్యదర్శి ఎస్ భగత్ మాట్లాడుతూ గత ఐదు రోజులుగా ఆవచెరువులో అక్రమంగా మట్టి తవ్వుతున్నారని అన్నారు తవ్విన మట్టిని వాణిజ్య అవసరాలకు అనంతపల్లి తాళ్లపూడి గ్రామాలకు చెందిన ఇటుక బట్టీలకు తరలిస్తున్నారని ఆరోపించారు ఎటువంటి ప్రభుత్వ అనుమతులు లేకుండా మట్టిని తరలిస్తున్న వారికి ప్రభుత్వ ప్రజాప్రతినిధుల అండదండలు ఉన్నాయేమో అని అనుమానించాల్సి వస్తుందన్నారు అవినీతి రహిత పాలన అందిస్తామని చెప్తున్న కూటమి ప్రభుత్వం మట్టి మాఫియా విషయంలో ఏం సమాధానం చెబుతుందని ప్రశ్నించారు టిప్పర్ లారీల ద్వారా మట్టిని తరలిస్తూ ఎంతో కొంత ఉన్న రోడ్డుని సైతం నాశనం చేస్తున్నారని అన్నారు అక్రమ మట్టి తవ్వకాలపై చర్యలు తీసుకోవాల్సిన అధికారులు చోద్యం చూస్తున్నారని విమర్శించారు ప్రభుత్వానికి పంచాయతీకి ఎటువంటి సీనరేజీ చెల్లించకుండా మట్టిని తరలిస్తున్న మాఫియా పై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు తక్షణమే ప్రభుత్వ అధికారులు జోక్యం చేసుకుని సక్రమమైన పద్ధతుల్లో మాత్రమే అనుమతి ఇవ్వాలని కోరారు ఉపాధి హామీ కార్మికులకు మట్టి తవ్వకాల్లో పని దినాలు కల్పించాలని డిమాండ్ చేశారు ఈ కార్యక్రమంలో వారా కృష్ణారావు అయినపర్తి శ్రీనివాసరావు పాత గొలుసు విశ్వ లు పాల్గొన్నారు

# కోటగుళ్లలో జిల్లా ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్ కుటుంబ సభ్యుల పూజలు




**విజేత ,గణపురం :** గణపురం మండల కేంద్రంలోని ప్రసిద్ధిగాంచిన చారిత్రక సంపద కాకతీయుల కళాక్షేత్రం శ్రీ భవాని సహిత గణపేశ్వరాలయం కోటగుళ్లలో సోమవారం జిల్లా ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్ కుటుంబ సభ్యులు స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు జూలపల్లి నాగరాజు వారిని సాదరంగా ఆహ్వానించి పూజా కార్యక్రమాలు నిర్వహించారు. పూజా కార్యక్రమాల అనంతరం అర్చకులు నాగరాజు కోట గుళ్ళు పరిరక్షణ కమిటీ ఆధ్వర్యంలో వారిని శాలువాలు పూలమాలలతో ఘనంగా సన్మానించారు.

# నూతన వధూవరులను ఆశీర్వదించిన మాజీ ఎమ్మెల్యే గండ్ర



**విజేత: మొగుళ్లపల్లి :** జయశంకర్ భూపాలపల్లి జిల్లా మొగుళ్ళపల్లి మండలం పర్లపల్లి గ్రామానికి చెందిన బి ఆర్ ఎస్ సీనియర్ నాయకులు అన్నశీ మధుకర్ రెడ్డి-అరుణ గార్ల కుమారుడు సుధీర్ రెడ్డి వెడ్స్ లికిత రెడ్డి రిసెప్షన్ కార్యక్రమంలో పాల్గొని వధూవరులను ఆశీర్వదించి వారు నిండు నూరేళ్లు అష్టైశ్వర్యాలతో, ఆయు రారోగ్యాలతో, వర్ధిల్లాలని వేడుకున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పిటిసి పర్లపల్లి గ్రామ సర్పంచ్ జోరుక సదయ్య , సీనియర్ నాయకులు కట్ల దివాకర్ రెడ్డి, ఆకుల రాజయ్య, గుండారపు రాజు, ఆకినపల్లి చిరంజీవి గడ్డం రాజు గౌడ్, మరియు గ్రామ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# సెవెన్ సెన్సెస్ రెస్టారెంట్ ను ప్రారంభించిన ఎమ్మెల్యే అంజిబాబు




**విజేత,భీమవరం ;** భీమవరం జెపి రోడ్డులో సెవెన్ సెన్సెస్ రెస్టారెంట్ ను రాష్ట్ర పబ్లిక్ అకౌంట్స్ కమిటి చైర్మన్ ఎమ్మెల్యే పులపర్తి రామాంజ నేయులు (అంజిబాబు) ఘనంగా ప్రారంభించారు.అనంతరం వారు మాట్లాడుతూ సెవెన్ సెన్సెస్ రెస్టారెంట్ మల్టీక్యూజన్, పార్టీ హాల్ అత్యాధునిక హంగులతో రెస్టారెంట్ జిల్లాల్లో ఆహార ప్రియులకు కేర్ అఫ్ అడ్రస్ గా నిలుస్తుందనడం లో అతిశయోక్తి లేదు మన భీమవరం పట్టణం జెపి రోడ్డులో సెవెన్ సెన్సెస్ విశాలామైన సిట్టింగ్ సౌకర్యంతో పాటు కుటుంబ సమేతంగా సెలెబ్రేట్ చేసుకునేలామన ప్రాంతంలో ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. సెవెన్ సెన్సెస్ నందు అన్ని రుచులను ఆస్వాదించే విదంగా దేశీయ విదేశీ రుచులను ఆస్వాదించవచ్చని రెస్టారెంట్ అధినేత దెందికూరి వెంకట్రాజు తెలిపారు.సెవెన్ సెన్సెస్ పట్టణానికి తలమాణికం కానుంది వారు తెలిపారు. ప్రారంభోత్సవానికి పట్టణానికి చెందిన ప్రముఖులు రాజకీయ ప్రముఖులు విచ్చేసి వారికి శుభాకాంక్షలు తెలియజేశారు.

# రైతులపై అదనపు భారం వేయడం తగదు

## చిలుక రవీందర్ మాజీ ఎం పి పి



**విజేత చొప్పదండి :** చొప్పదండి మండలంలోని వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలలో రైతులపైఅదనపుభారంమోపుతున్న తీరు బాధాకరమని తాజా మాజీ ఎంపీపీ చిలుక రవీందర్ అన్నారు.ప్రభుత్వం నిర్ణయించిన ప్రకారం ఒక సంచిలో 40 కిలోల 700 గ్రాముల వడ్లు మాత్రమే ఉండాలని స్పష్టమైననిబంధనలు ఉన్నప్పటికీ,కొన్ని కొనుగోలు కేంద్రాలలో 43 కిలోలు నింపితేనే ధాన్యందించుకుంటామనిరైతులను ఒత్తిడికిగురిచేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.రైతులు ఇప్పటికే పెట్టుబడులు, ప్రకృతి సమస్యలు,అప్పుల భారంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్న సమయంలో కొనుగోలు కేంద్రాల వద్ద ఇలా అదనపు బరువు వేయించడంపూర్తిగాఅన్యాయమన్నారు.కొంతమంది రైతులు 41 కిలోలు,42 కిలోలు వరకు కూడా ఓపికతో భరించినా,మరింత బరువువేయాలనిబలవంతపెట్టడం రైతుల పట్ల నిర్లక్ష్య వైఖరికి నిదర్శనమని అన్నారు.ధాన్యం కొనుగోలు కేంద్రాలలో అధికారులు వెంటనే తనిఖీలు నిర్వహించి ప్రభుత్వ నిబంధనలు అమలు అయ్యేలా చూడాలని విజ్ఞప్తి చేశారు.రైతుల నుంచి బలవంతంగా అదనపు బరువు వేయించకుండా చర్యలు తీసుకోవాలని,లేకుంటే రైతులతో కలిసి ఆందోళనలు చేపట్టాల్సి వస్తుందని హెచ్చరించారు.

# ప్రకృతి వైద్యులు గోపాల రాజు సేవలు ఎనలేనివి





**విజేత,భీమవరం ;** ప్రకృతి వైద్యులు డా వేగిరాజు గోపాలరాజు సేవలు ఎనలేనివని పలువురు వక్తలు అన్నారు. భీమవరం ప్రకృతి ఆశ్రమంలో సోమవారం డా వేగిరాజు గోపాలరాజు సంతాప సభ నిర్వహించారు. రాష్ట్ర పబ్లిక్ అకౌంట్స్ కమిటీ చైర్మన్ ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు (అంజిబాబు), డిప్యూటీ స్పీకర్ ఉండి ఎమ్మెల్యే కనుమూరి రఘురామ కృష్ణంరాజు, ఆంధ్రప్రదేశ్ శాసనమండలి చైర్మన్ కొయ్యే మోషేను రాజు, జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణిలు పాల్గొని వారి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. తాత, తల్లిదండ్రుల ఆశయాలు నిలబెడుతూ పేదలకు వైద్యం అందించిన ప్రకృతి వైద్యులు డా గోపాలరాజు అని అన్నారు. తానూ నమ్ముకున్న సిద్దాంతం కోసం గ్రామాన్ని వదలకుండా తాత, తండ్రి అందించిన ప్రకృతి ఆశ్రమంలోనే వైద్య సేవలు అందించిన గోపాలరాజు చిరస్మరణీయులన్నారు. అనేక దీర్ఘకాలిక రోగులకు ప్రాణబిక్ష పెట్టారని సంతాపం తెలిపారు. కంతేటి వెంకటరాజు, చెరుకువాడ రంగసాయి, డా వేగిరాజు రామకృష్ణంరాజు, వేగిరాజు శివవర్మ, డా మూర్తి తదితరులు పాల్గొని నివాళులర్పించారు.

# తాళ్ల శ్రీశైలం గౌడ్ కుమారుడు వివాహ వేడుకలలో మంత్రి పొన్నం ప్రభాకర్



**విజేత, ఇబ్రహీంపట్నం :-** ఇబ్రహీంపట్నం మున్సిపాలిటీ శేరిగూడ కు చెందిన కాంగ్రెస్ నాయకులు తాళ్ల శ్రీశైలం గౌడ్ కుమారుడు డా.భరత్ గౌడ్, నందిని వివాహ విందు వేడుకలు కొంగరకలాన్ పిఎస్ఆర్ శ్లోక కన్వెన్షన్ హాల్ లో ఆదివారం రాత్రి ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి తెలంగాణ రాష్ట్ర బీసీ సంక్షేమ, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ హాజరై వధూవరులను ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి, తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా కార్పొరేషన్ అధ్యక్షులు మల్ రెడ్డి రాంరెడ్డి, నోముల కృష్ణ గౌడ్, ఇబ్రహీంపట్నం మార్కెట్ కమిటీ చైర్మన్ కంబాలపల్లి గురునాథ్ రెడ్డి, మాజీ జెడ్పిటిసి మైపాల్, కాంగ్రెస్ నాయకులు ఈసీ శేఖర్ గౌడ్, కొత్త కుర్మ మంగమ్మ శివ కుమార్, జడల రవీందర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

# హనుమత్ జయంతికి రూపాయలు 25 వేల 116లు విరాళం అందజేత



**విజేత, కరీంనగర్ :** కరీంనగర్ లోని శ్రీ సీతారామ లక్ష్మణ సైత అభయ పంచముఖ హనుమాన్దీశ్వర దేవాలయంలో హనుమత్ జయంతి సందర్భంగా నిర్వహించే లక్ష తమలపాకుల అర్చనకు బొమ్మరవేణి సంధ్యారాణి తిరుపతి దంపతులు 20,116 అన్న ప్రసాద వితరణకు 5000 రూపాయలు మొత్తం 25,116 విరాళంగా అందించారు దాతలకు వారి కుటుంబ సభ్యులకు శ్రీ సీతారామాంజనేయ స్వామి కృపాకటాక్షాలు ఎల్లవేళలా ఉండాలని అష్ట ఐశ్వర్యాలు ఆయురారోగ్యాలు ప్రసాదించాలని ఆలయ కమిటీ ఆకాంక్షించింది.

# ప్రజావాణిలో 30 ఫిర్యాదులను స్వీకరించిన సీపీ



**విజేత, నిజామాబాద్ ప్రతినిధి :** నిజామాబాద్ జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో పోలీస్ కమిషనర్ సాయి చైతన్య ఆధ్వర్యంలో సోమవారం ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా జిల్లా లోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ఫిర్యాదు దారుల నుంచి 30 ఫిర్యాదులను స్వీకరించారు. అనంతరం వాటి తక్షణ పరిష్కారం కోసం సంబంధిత పోలీస్ స్టేషన్ ల ఎస్సై, సి.ఐ లకు ఫోన్ ద్వారా మాట్లాడి సమస్య స్థితిని తెలుసుకుని పరిష్కారానికి తగిన సూచనలు చేశారు. ప్రజలు నిర్భయంగా, మూడో వ్యక్తి ప్రమేయం లేకుండా ఎలాంటి, పైరవీలు లేకుండా స్వచ్ఛందంగా పోలీసు సేవల్ని వినియోగించుకుంటూ, వారి వారి సమస్యలు చట్ట ప్రకారం పరిష్కరించుకునేలా, పోలీసులు ప్రజలకు మరింత దగ్గరయ్యేలా, శాంతి భద్రతలు పరిరక్షిస్తూ ముందుకు సాగడమే లక్ష్యంగా జిల్లా పోలీస్ శాఖ పని చేస్తుందని సీపీ తెలియజేశారు. ప్రజా సమస్యల పై ఫిర్యాదులు నేరుగా స్వీకరిస్తూ ప్రతి సోమవారం ప్రజావాణి కార్యక్రమం ద్వారా సమస్యలు పరిష్కరిస్తున్నామని ఆయన అన్నారు.

# పోక్సో కేసుపై నిష్పక్ష విచారణ జరగాలంటే బండి సంజయ్ రాజీనామా చేయాలి : ఎమ్మెల్యే కేపీ వివేకానంద్



**విజేత, కుత్బుల్లాపూర్ :-** కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమారుడు బండి భగీరథ్ పైన కేసు నమోదు అయ్యి మూడు రోజులైనా అరెస్టు చేయకుండా రాష్ట్ర హోం శాఖ మంత్రి, సీఎం రేవంత్ రెడ్డి పోలీస్ వ్యవస్థను తన గుప్పిట్లో పెట్టుకుని కేసును నీరుగార్చేందుకు చేస్తున్న ప్రయత్నాలపై జగద్గిరిగుట్ట లో ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో బిఆర్ఎస్ ఎల్పీ విప్, ఎమ్మెల్యే కేపీ. వివేకానంద్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు.కేంద్రమంత్రి బండి సంజయ్ కుమారుడుపై పోక్సో కేసు నమోదైన నిందితుడిని అరెస్టు చేయాల్సి ఉన్న వారిని కాపాడేందుకు సీఎం రేవంత్ రెడ్డి విశ్వప్రయత్నాలు చేస్తా ఉన్నట్లు కనపడతా ఉంది.గంగుల కమలాకర్ చేతిలో బండి సంజయ్ మూడుసార్లు ఓడిపోయినాడు.రామ మందిరం పేరుతోనే బండి సంజయ్ గెలిచాడు తప్ప సొంత బలం ఏమీ లేదు.2018కి ముందు తన రాజకీయ భవిష్యత్తు కోసం బిక్షాటన చేస్తూ చందాలు వసూలు చేసిన బండి సంజయ్ కి నేడు వందల కోట్ల రూపాయలు ఎక్కడి నుంచి వచ్చినయ్. నీ రాజకీయ చరిత్ర అందరికీ తెలుసు.బ్లాక్ మెయిల్ రాజకీయాలు చేసుకుంటూ, రేవంత్ రెడ్డి తో చీకటి ఒప్పందాలు చేసుకుంటూ బిజెపి పార్టీని, ధర్మాన్ని తాకట్టు పెట్టుకుంటూ మొసలి కన్నీరు కారుస్తూ ఉన్నారు.ధర్మం పేరుతో నీవు చేసే బ్లాక్ మెయిల్ రాజకీయాలు టైం వచ్చినప్పుడు బయటపడతాయి. ఏనాటికైనా నిజాం బయటపడుతుంది.మొసలి కన్నీరు కాదు, దేవుని పేరు చెప్పడం కాదు, ధర్మం పేరు చెప్పడం కాదు, వెంటనే రాజీనామా చేయాలి.18 సంవత్సరాల లోపు అమ్మాయిల మీద హనీ ట్రాప్ కేసు వర్తించదు. మైనర్ బాలికపై హనీ ట్రాప్ కేసు పెట్టడంలోనే బండి సంజయ్ చేసే అధికార దుర్వినియోగం బయటపడతా ఉంది.అవును మేము కలిసి తిరిగినం, పార్టీలకు వెళ్లిన అంటూ బండి కుమారుడే ఒప్పుకున్నాడు.పోక్సో కేసును నీరుగాచేందుకు నాకు మాత్రం సెక్షన్లు పెట్టినారు.ప్రజలు ఆలోచన చేయాలే. దేశం పేరుతో, ధర్మం పేరుతో వచ్చే నాయకులను నమ్మొద్దు.అధికారం శాశ్వతం కాదు రేవంత్ రెడ్డి నిన్ను కాపాడుతాడు అనుకోవడం నీ భ్రమ. ప్రజాక్షేత్రంలో మీకు గుణపాఠం తప్పదు.కేంద్రంలో బండి సంజయ్ రాష్ట్రంలో రేవంత్ రెడ్డి పోలీసులను కబంధహస్తాల్లో పెట్టుకొని వారిని విచారణ చేయకుండా ఉల్టా బ్లాక్ మెయిల్ చేస్తా ఉన్నారు.మైనర్ బాలిక అత్యాచారం కేసులో నిష్పక్షపాత విచారణ జరగాలంటే బండి సంజయ్ వెంటనే రాజీనామా చేయాలి. లేదంటే కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం బండి సంజయ్ను బర్త్ రఫ్ ఆఫ్ చేయాలి.బండి సంజయ్ కుమార్ బాలిక తల్లిదండ్రులను బ్లాక్ మెయిల్ చేసిండు అని స్పష్టంగా ఆధారాలు ఉన్నాయి. కాబట్టి ఈ కేసు ఎఫ్ఐఆర్ లో బండి సంజయ్ పేరును కూడా చేర్చాలి. దేశం, ధర్మం మీద గౌరవం అంటే బండి సంజయ్ వెంటనే రాజీనామా చేయాలి. బాలిక కుటుంబానికి న్యాయం జరిగే వరకూ బిఆర్ఎస్ పార్టీ బాధితుల పక్షాన అండగా ఉంటుంది. ఉన్నోడికి ఒక న్యాయం, పేదోడికి ఒక న్యాయమా...? నిష్పక్ష విచారణ జరగాలంటే బండి సంజయ్ వెంటనే రాజీనామా చేయాలి లేదంటే కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం బండి సంజయ్ ని వెంటనే బర్తరఫ్ చేయాలి.ఢిల్లీలో కుస్తీ, గల్లీలో దోస్తీ అన్నట్టు సాగుతున్న బిజెపి, కాంగ్రెస్ పార్టీ నాటకాలను త్వరలోనే బయట పెడతాం.

# సంగారెడ్డి జిల్లాలో ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో సమస్యలు పరిష్కరించాలి

జొన్నలు కొనుగోలు కేంద్రాలు వెంటనే ఏర్పాటు చేయాలి

ఆరుగాలం కష్టపడినా ధాన్యం మిల్లర్లు, వ్యాపారస్థులకు అమ్ముకునే దుస్థితా?

సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు చుక్క రాములు

సంగారెడ్డి జిల్లా కలెక్టరు కార్యాలయం ముందు సీపీఎం ధర్నా

కలెక్టర్ కి వినతిపత్రం అందజేత




**విజేత,సంగారెడ్డి ప్రతినిధి :** సంగారెడ్డి జిల్లా వ్యాప్తంగా ధాన్యం కొనుగోలు కేంద్రాలలోని, జొన్నాల కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు చుక్క రాములు అన్నారు. సోమవారం సంగారెడ్డిలో కలెక్టర్ కార్యాలయం ఎదుట సిపిఎం ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించడం జరిగింది. అనంతరం సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని జిల్లా కలెక్టర్ కి అందజేయడం జరిగింది.ఈ సందర్భంగా చుక్క రాములు మాట్లాడుతూ రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధరలు కల్పించాలన్నారు. ఆరుగాలం కష్టపడి పండించిన పంటలను మధ్యలో దళారులు చేరి మిల్లర్లకు, వ్యాపారులకు అమ్ముకునే దుస్థితి తెస్తున్నారని అన్నారు. కొనుగోలు కేంద్రాల్లో వాహనాలు సరిపడా లేవన్నారు. రైతులు అమ్ముకున్న పంటకు ఎదురు చూడకుండా వెంటనే చెల్లింపులు జరిగేలా అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. ధాన్యాన్ని కొనుగోలు చేయడం ద్వారా వర్షాలు పడి రైతులు రాత్రింబవాళ్లు పడిగాపులు కాయాల్సిన పరిస్థితి దాపురించిందని తెలిపారు. ధాన్యం తడవకుండా తాటిపత్రి సౌకర్యాన్ని రైతులకు అందజేయాలన్నారు. తరుగు పేరుతో క్వింటల్ కు 6 నుండి 7 కిలోలు తీస్తూ రైతులను దోచుకోవడం జరుగుతుందన్నారు.ధాన్యం కొనుగోళ్ల కేంద్రాలకు వెంటనే సరిపడా సంచులు వేంటనే సరఫరా చేయాలని, హమాలీల సమస్యలు పరిస్కారం చేయాలని అన్నారు. రైతు ప్రభుత్వం అని చెప్పుకుంటున్న కాంగ్రెస్ ప్రభుత్వం రైతుల ఇబ్బందులు ఎందుకు పట్టించుకోవడంలేదని విమర్శించారు. కొనుగోలు కేంద్రాలలో మంచినీళ్లు, కనీస సౌకర్యాలు కల్పించాలని ప్రభుత్వం ను డిమాండ్ చేశారు. అనంతరం సిపిఎం జిల్లా కార్యదర్శి గొల్లపల్లి జయరాజు మాట్లాడుతూ ఈ సంవత్సరం జిల్లా వ్యాప్తంగా 90 వేల పైన ఎకరాలలో జొన్న సాగైందని, రైతుల వద్ద జొన్నలు అమ్ముడు పోక, కొనుగోలు కేంద్రాలు తెరవక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అన్నారు.వెంటనే జొన్నల కొనుగోలు కేంద్రాలు వెంటనే ఏర్పాటు చేయాలనీ అన్నారు. లేకుంటే ఆందోళన చేస్తామని ప్రభుత్వం ను హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు బి.మల్లేశం,ఎ.మాణిక్, జి.సాయిలు, జిల్లా కమిటి సభ్యులు కృష్ణ, నాయకులు అశోక్, రాజయ్య, రమేష్ గౌడ్, మంజుల, మహేష్, భూషణం, నర్సింలు, వెంకటేశం, ప్రభాకర్ తది తరులు పాల్గొన్నారు.

# ఎస్ఎన్డీపీ నాలా పనులను ప్రారంభించిన మహేశ్వరం ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి







**విజేత మహేశ్వరం :** మహేశ్వరం నియోజకవర్గంలోని జిహెచ్ఎంసి జిల్లాలగూడ డివిజన్ పరిధిలోని మిథుల నగర్లో అసంపూర్తిగా నిలిచిపోయిన ఎస్ఎన్డీపీ నాలా పనులను మాజీ మంత్రి, ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి,ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె సంబంధిత అధికారులతో మాట్లాడి, రాబోయే వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని నాలా పనులను నాణ్యతతో పాటు వేగవంతంగా పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని ఆదేశించారు. ప్రజలకు ఇబ్బందులు కలగకుండా ఎక్కడా అలసత్వం ప్రదర్శించకుండా పనులను త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అక్కల భూపాల్ రెడ్డి, డిప్లాల్ చౌహాన్, అరకల కామేష్ రెడ్డి, మదారి రమేష్, అనిల్ కుమార్ యాదవ్, విజయ్, దిండు భూపేష్ గౌడ్, లక్ష్మణ్ ముదిరాజ్, గోపి యాదవ్, సునీత బాలరాజ్, సుర్వి లత, పంతంగి మాధవి, బిందు, నిర్మల రెడ్డి,తదితరులు పాల్గొన్నారు.

# అంబేద్కర్ 136వ జయంతి వారోత్సవాల్లో పాల్గొన్న ఎమ్మెల్యే షాజాహాన్ బాషా

ఘనస్వాగతం పలికిన మాలమహానాడు అధ్యక్షులు టి. కృష్ణప్ప సంఘం నాయకులు






**విజే,రామసముద్రం :** డాక్టర్ అంబేద్కర్ జయంతి వారోత్సవాలలో ఎమ్మెల్యే షాజహాన్ బాషా పాల్గొన్నారు,దిగువపేట హెచ్ పి పెట్రోల్ బంక్ నుండి ఎమ్మెల్యే, రాష్ట్ర మాలమహానాడు అధ్యక్షులు యమల సుదర్శన్ కు మండల మాలమహా నాడు అధ్యక్షులు టి. కృష్ణప్ప అంబేద్కర్ యువసేన సభ్యులు మేళతాలలతో, జానపద కళాకారులతో పూల వర్షం కురిపిస్తూ గజమాల వేసి ఘనంగా స్వాగతం పలికారు.టిడిపి సీనియర్ నాయకులు అప్పి స్వామి తనయుడు చిన్ను స్వామి శాలువ కప్పి, పూలమాలలు వేసి వారి నివాసానికి ఆహ్వానం పలికి అల్పాహారం ఏర్పాటు చేశారు,ఎమ్మెల్యే దిగువ పేటనుండి ప్రజలకు అభివాదం చేసుకుంటూ అంబేద్కర్ సర్కిల్ వద్ద డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహానికి గజమాల వేసి నివాళులు అర్పించారు.అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ నవభారత నిర్మాణానికి పునాదులు వేసిన డాక్టర్ బాబా సాహెబ్ అంబేద్కర్ భారత రాజ్యాంగ శిల్పి, సామాజిక న్యాయం మరియు సమానత్వానికి ప్రతీక అయిన డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ 136 వ జయంతి వారోత్సవాలు సందర్భంగా ఆయనకు నా హృదయపూర్వక ఘన నివాళులు.అణగారిన వర్గాల హక్కుల కోసం ఆయన చేసిన మహోన్నత పోరాటం ప్రతి భారతీయుడికి స్ఫూర్తి. సమాన హక్కులు, స్వేచ్ఛ న్యాయం అనే విలువలు ఆయన చూపిన మార్గంలో నడిచినప్పుడే సాధ్యమవుతాయి.ఆయన ఆశయాలను మన జీవితాల్లో ఆచరణలో పెట్టడం ద్వారానే నిజమైన నివాళి అర్పించినవారమవుతామన్నారు జయ భీమ్ అని పెద్ద ఎత్తున నినాదాలు చేశారు.ఈ కార్యక్రమం లో మండల మాలమహానాడు అధ్యక్షులు కృష్ణప్ప,మాజీ జడ్పీటీసీ శివశంకర్, సీతారామ స్వామి చిన్ను స్వామి, పెద్ది రెడ్డి,కృష్ణం రాజు,రాజేష్ స్వామి, రూపేష్ రెడ్డి,అన్సర్ బాషా,ఎం. శంకరప్ప,బాలాజీ కొమ్మునారాయణ స్వామి, టిడిపి మహిళా అధ్యక్షురాలు భూలక్ష్మి,అరికల టమోటా మార్కెట్ రమణ,దిగువ హరిజన వాడ శంకర,ఎస్సి సెల్ అధ్యక్షులు శివ,నడింపల్లె రమేష్,డాక్టర్ జి శివకుమార్ రెడ్డి,వాహిద్, చాంద్ బాషా,టీచర్ నరసింహులు, కృష్ణప్ప మోహన్,ఊలపాడు శ్రీనివాసులు, లక్ష్మి నారాయణ, రఘుపతి, నాగరాజ, అశోక్, ప్రభాకర్, రామాంజులు,ఏ పీ ఎం సాంబ శివ డ్వాక్రా మహిళా సంఘం సభ్యులు తదితరులు పాల్గొన్నారు.ఎలాంటి అవాంచనీయ సంఘటనలు జరగకుండా ఎస్సై హృషికేశవ రెడ్డి పోలీస్ సిబ్బంది తో బందో బస్త్ నిర్వహించారు.

# శివంపేట మండలంలో లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇండ్లు మంజూరు పత్రాలు పంపిణీ!

ఎమ్మెల్యే సునీత లక్ష్మారెడ్డి.!!





**విజేత,శివంపేట :** శివంపేట మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో నర్సాపూర్ ఎమ్మెల్యే సునీత లక్ష్మారెడ్డి మండలంలోని వివిధ గ్రామాల ఇందిరమ్మ ఇల్లు 83 మంది లబ్ధిదారులకు మంజూరు పత్రాలను మండల అధికారులు, మండల ప్రజా ప్రతినిధులు లబ్ధిదారుల సమక్షంలో మంజూరు పత్రాలను ఎమ్మెల్యే సునీత లక్ష్మారెడ్డి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సునీత లక్ష్మారెడ్డి మాట్లాడుతూ మండలంలోని అర్హులైన ప్రతి ఒక్కరికి ఇందిరమ్మ ఇల్లు ఇప్పించే బాధ్యత నాది అని అన్నారు. ప్రభుత్వ అధికారుల నిబంధన మేరకే ఇంటిని నిర్మించుకోవాలని లేనిపక్షంలో బిల్లులు ఆగిపోయే పరిస్థితి ఏర్పడుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో శివంపేట మండల పిఎసిఎస్ చైర్మన్ చింతల వెంకటరామిరెడ్డి, హౌసింగ్ డిఈ ప్రభు, ఎంపీడీవో వెంకట లక్ష్మమ్మ, శివంపేట మండల బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు రాజా రమణ గౌడ్, జిల్లా గ్రంథాలయ మాజీ చైర్మన్ చంద్ర గౌడ్, స్థానిక శివంపేట సర్పంచ్ రాజి పేట వెంకటేశ్వర్, మండలంలోని వివిధ గ్రామాల సర్పంచులు, ఇందిరమ్మ ఇండ్లు లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.

# తప్పించుకుని తిరుగుతున్న అక్రమ ఇసుక దొంగలు అరెస్ట్

**ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నుంచి తెలంగాణ రాష్ట్రంలో ఇసుక అమ్మకాలు**

**తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతున్న అక్రమార్కులు**

**ఎసిపి వసుంధర యాదవ్ ఆదేశాల తో వలపన్ని పట్టుకున్న సత్తుపల్లి పోలీసులు**



**విజేత,సత్తుపల్లి :** ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వము ఆ రాష్ట్ర ప్రజలకు ఇచ్చే ఉచిత ఇసుకను ఖమ్మం జిల్లా సత్తుపల్లి మండలం బేతుపల్లి గ్రామానికి చెందిన గద్దల శ్రీను అనే వ్యక్తి దారి మళ్ళించి, తనకు ఉన్న లారీల ద్వారా ఉచిత ఇసుకను కొవ్వూరు గోదావరి నది ఇసుక ర్యాంప్ నుండి తెలంగాణలోని ఖమ్మం జిల్లాలో సరిహద్దులో ఉన్న సత్తుపల్లి మరియు పరిసర గ్రామాలకు తీసుకొని వచ్చి తెలంగాణ రాష్ట్ర మైనింగ్ చట్టాలకు వ్యతిరేకంగా ముందస్తుగా రచించిన ప్లాన్ ప్రకారం అతని తమ్ముడు గద్దల శివ మరియు డ్రైవర్ లతో వ్యూహాత్మకంగా ఒక పన్నాగం ప్రకారం అక్రమ ఇసుక దందా చేస్తూ , తెలంగాణ ప్రభుత్వ ఆదాయానికి భారీ ఎత్తున నష్టం కలిగిస్తుండడంతో, గతంలో ఇతనిని పలుమార్లు పట్టుకొని ఇప్పటివరకు సత్తుపల్లి నియోజకవర్గం లో ఐదు కేసులునమోదుచేయడంజరిగినది.అయినా ఇతను పద్ధతి మార్చుకోకుండా ఏప్రిల్ నెలలో 21వ తేదీన తన యొక్క ఎపి-39-టియు- 7377నంబరు గల లారీలో ఆంధ్రప్రదేశ్ లో కొవ్వూరు గోదావరి నది ఇసుక ర్యాంప్ నందు ఇసుకను లోడ్ చేసుకొని అక్రమంగా తన లారీ డ్రైవరు అయిన కువ్వారపు నాగేంద్రబాబు ద్వారా, తన సోదరుడుగద్దలశివతోకలిసిటిఎస్-05-ఇకె-9339 నెంబర్ గల క్రెటా కారుపై నిఘా చేస్తూ , సత్తుపల్లి పరిసర ప్రాంతాలకు ఇసుకను తరలిస్తుండగా సత్తుపల్లి ఎస్ఐ తన సిబ్బంది తో కలిసి గద్దల శివను ఇసుక లారీతో సహా పట్టుకొని అరెస్టు చేసి పోలీస్ స్టేషన్ కు తీసుకువచ్చి కేసు నమోదు చేయడం జరిగింది.ఆ రోజు అక్కడ నుంచి లారీ డ్రైవరు అయిన కువ్వారపు నాగేంద్రబాబు మరియు గద్దల శ్రీను కారులో పరారైనారు. పోలీసుల విచారణలో గద్దల శివ, గద్దల శ్రీను,కువ్వారపు నాగేంద్రబాబు ప్రమేయము బయటపడడంతో ముగ్గురిపై చీటింగ్, అక్రమ వ్యాపారం క్రింద కేసు నమోదు చేయడం జరిగింది.ఆరోజు నుండి నిందితుడు సత్తుపల్లి మండలం బేతుపల్లి కి చెందిన గద్దల శ్రీను తప్పించుకొని తిరుగుతుండగా పక్కా సమాచారంతో కల్లూరు ఏసీపీ వసుంధర యాదవ్ ఐపిఎస్ ఆదేశాల మేరకు, సత్తుపల్లి ఇన్స్పెక్టర్ తుమ్మలపల్లి శ్రీహరి సూచనలతో ఎస్సై పి.ప్రదీప్ బృందం విజయవాడ వెళ్ళి అక్కడ ఆటో నగర్ దగ్గరలో ఉన్న ద్వారకా లాడ్జిలో గద్దల శ్రీనును పట్టుకుని అరెస్టు చేసి సత్తుపల్లికి తీసుకొని వచ్చి ఆ తర్వాత అతనిక్రెటాకారునుటిఎస్-04-ఇకె-9339 కూడా సీజ్ చేసి నిందితుడిని కోర్టులో హాజరు పరిచి మేజిస్ట్రేట్ ఉత్తర్వుల మేరకు సత్తుపల్లి సబ్ జైలు కి తరలించడం జరిగింది. గతంలో ఈ నిందితుడు గద్దల శ్రీను పైన ఎపి39డబ్ల్యూ ఎం 6512, ఎపి 39 టిబి5679, ఎపి04యుబి0396, ఎ౦ * 39 డబ్ల్యూవి 3566, ఎపి39టియు 7377 లారీల ద్వారా ఇసుక అక్రమ రవాణా చేసినందుకు గత 8 నెలల్లో మొత్తం ఇప్పటి వరకు 6కేసులునమోదయ్యాయి.

# ప్రజాధనం వృథా అధికారుల నిర్లక్ష్యానికి బలైన సర్దార్ జలగం వెంగళరావు పార్క్







**రూ.85 లక్షలతో నిర్మించిన పార్క్ నేడు శిథిలావస్థలోకి**

**అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారిన పార్క్...**

**వెంటనే పునరుద్ధరించాలని ప్రజల డిమాండ్**

**విజేత, సత్తుపల్లి :** ఒకప్పుడు సత్తుపల్లి పట్టణ ప్రజలకు ఆహ్లాదాన్ని పంచుతూ ప్రత్యేక గుర్తింపుగా నిలిచిన సర్దార్ జలగం వెంగళరావు పార్క్ నేడు అధికారుల నిర్లక్ష్యానికి నిదర్శనంగా శిథిలావస్థలో దర్శనమిస్తోంది. ప్రజల వినోదం, ఆరోగ్య పరిరక్షణ కోసం రూ.85 లక్షల ప్రజాధనంతో నిర్మించిన ఈ పార్క్ ప్రస్తుతం అడవిని తలపించేలా మారి అసాంఘిక కార్యకలాపాలకు కేంద్రంగా మారడం ఆందోళన కలిగిస్తోంది. వెంటనే స్పందించి పార్కును పునరుద్ధరించాలని స్థానిక ప్రజలు ముక్తకంఠంతో డిమాండ్ చేస్తున్నారు. 2008 సంవత్సరంలో అప్పటి సత్తుపల్లి ఎమ్మెల్యే జలగం వెంకట్రావు ప్రత్యేక చొరవతో సింగరేణి షేప్ నిధులు, సత్తుపల్లి అభివృద్ధి నిధులతో కలిపి మొత్తం రూ.85 లక్షల వ్యయంతో ఈ పార్కును నిర్మించారు. అప్పటి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర్ రెడ్డి చేతుల మీదుగా ఈ పార్క్ ఘనంగా ప్రారంభమైంది. ప్రారంభ సమయంలోనే ఈ పార్క్ సత్తుపల్లి ప్రజలకు ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.

**సత్తుపల్లి ప్రజలకు ఓ విశ్రాంతి కేంద్రం**

ఈ పార్కులో ఏర్పాటు చేసిన సౌకర్యాలు అప్పట్లో ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. చిన్నారుల కోసం జారుడు బల్లలు, ఆట వస్తువులు, పెద్దల కోసం వ్యాయామ పరికరాలు, మార్నింగ్ వాకర్స్ కోసం ప్రత్యేక నడకదారి, సాయంత్రం వేళల్లో ఓపెన్ ప్రొజెక్టర్ ద్వారా సినిమా ప్రదర్శనలు నిర్వహించడం వల్ల కుటుంబాలతో కలిసి పెద్ద సంఖ్యలో ప్రజలు పార్కును సందర్శించేవారు. ఉదయం, సాయంత్రం వేళల్లో ఈ పార్క్ సందర్శకులతో కిటకిటలాడేది.

**పాలకుల నిర్లక్ష్యంతో పాడైపోయిన పార్క్**

అయితే కాలక్రమేణా పరిస్థితులు పూర్తిగా మారిపోయాయి. రాష్ట్ర విభజన అనంతరం వచ్చిన ప్రభుత్వాలు, స్థానిక ప్రజాప్రతినిధులు ఈ పార్క్ నిర్వహణను పూర్తిగా విస్మరించారని స్థానికులు ఆరోపిస్తున్నారు. పార్కుకు మరమ్మతులు చేయకపోవడం, శుభ్రత చర్యలు చేపట్టకపోవడం, భద్రతా సిబ్బందిని నియమించకపోవడంతో అది పూర్తిగా నిరుపయోగంగా మారిపోయింది. పార్కు అంతటా పిచ్చి మొక్కలు పెరిగి అడవిని తలపించేలా మారాయి. చిన్నారుల ఆట వస్తువులు ధ్వంసమైపోయాయి. వ్యాయామ పరికరాలు తుప్పుపట్టి పనికిరాని స్థితికి చేరాయి. నడకదారి పాడైపోవడంతో మార్నింగ్ వాకర్స్ రావడం పూర్తిగా తగ్గిపోయింది.

**అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారిన వైనం**

నిర్వహణ లేకపోవడంతో ప్రస్తుతం ఈ పార్క్ మందుబాబులకు అడ్డాగా మారిందని స్థానికులు బహిరంగంగానే చెబుతున్నారు. రాత్రి వేళల్లో కొందరు అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతున్నారని ఆరోపిస్తున్నారు. దీంతో పరిసర ప్రాంత మహిళలు, వృద్ధులు, చిన్నారులు భయాందోళనకు గురవుతున్నారు. ఒకప్పుడు కుటుంబ సమేతంగా సందడి చేసిన ప్రదేశం ఇప్పుడు ప్రజలు వెళ్లడానికి భయపడే స్థితికి చేరిందని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**ప్రజాధనం వృథా చేస్తే బాధ్యత ఎవరిది?**

ప్రజల సౌకర్యం కోసం ఖర్చు చేసిన రూ.85 లక్షల ప్రజాధనం నేడు వృథాగా మారడంపై ప్రజలు ప్రశ్నిస్తున్నారు. ప్రజల డబ్బుతో నిర్మించిన అభివృద్ధి పనులను కాపాడాల్సిన బాధ్యత అధికారులపై ఉండగా, ఇంత నిర్లక్ష్యంగా వ్యవహరించడం ఏమిటని మండిపడుతున్నారు.

**తక్షణమే చర్యలు తీసుకోవాలి**

మున్సిపల్ అధికారులు వెంటనే స్పందించి పార్కులో పేరుకుపోయిన చెత్త, పిచ్చిమొక్కలను తొలగించి, ధ్వంసమైన పరికరాలను మరమ్మతు చేసి, భద్రతా చర్యలు చేపట్టి తిరిగి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని సత్తుపల్లి ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. ఒకప్పుడు సత్తుపల్లికి ప్రత్యేక గుర్తింపుగా నిలిచిన సర్దార్ జలగం వెంగళరావు పార్క్‌కు మళ్లీ పూర్వ వైభవం తీసుకురావాలని ప్రజలు కోరుతున్నారు.

# కాలు బెనకటంతో ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందిన జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి

**ప్రభుత్వ ఆసుపత్రుల్లో మెరుగైన వైద్య సేవలు అందుబాటులో ఉన్నాయి ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి...**

**జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి...**





**విజేత,భీమవరం ;** జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి కాలు బెనకటంతో, ఆమె భీమవరం ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్లి సాధారణ వ్యక్తి లాగానే ఓపీ నమోదు చేయించుకుని XRAY తీయించుకుని, ఆర్థోపెడిక్ విభాగంలో వైద్య చికిత్స పొందారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ఆసుపత్రిలోని పలు విభాగాలను స్వయంగా పరిశీలించారు. ఆసుపత్రిలో రోగులకు అందుతున్న వైద్య సేవలు, మౌలిక వసతులు, పరిశుభ్రత, వైద్య సిబ్బంది పనితీరు తదితర అంశాలపై రోగులతో నేరుగా మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. ఆసుపత్రిలో వైద్య సేవల నాణ్యత ఎలా ఉంది, అవసరమైన మందులు అందుతున్నాయా, వైద్యులు మరియు సిబ్బంది మర్యాదపూర్వకంగా వ్యవహరిస్తున్నారా, ఆసుపత్రి పరిసరాలు మరియు వాష్‌రూమ్‌లు పరిశుభ్రంగా ఉన్నాయా, ఎవరైనా డబ్బులు అడుగుతున్నారా వంటి పలు అంశాలపై రోగులను ప్రశ్నించారు.రోగులు స్పందిస్తూ ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రస్తుతం మెరుగైన వసతులు అందుబాటులో ఉన్నాయని, గతంతో పోలిస్తే వైద్య సేవలు మరింత మెరుగుపడ్డాయని తెలిపారు. వైద్యులు, సిబ్బంది అందిస్తున్న సేవలపై సంతృప్తి వ్యక్తం చేశారు. ఆసుపత్రిలో పరిశుభ్రత, సౌకర్యాలు బాగున్నాయని రోగులు జిల్లా కలెక్టర్‌కు వివరించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి మాట్లాడుతూ జిల్లాలోని ప్రభుత్వ ఆసుపత్రుల్లో మెరుగైన మౌలిక వసతుల కల్పనకు జిల్లా యంత్రాంగం దశలవారీగా చర్యలు చేపట్టిందన్నారు. ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించేందుకు వైద్యశాఖ పనితీరును నిరంతరం సమీక్షిస్తున్నామని తెలిపారు. ప్రైవేటు ఆసుపత్రులకు దీటుగా ప్రభుత్వ ఆసుపత్రుల్లో వైద్య సేవలు అందించడమే లక్ష్యంగా పని చేస్తున్నామని ఆమె పేర్కొన్నారు. ప్రతి నెల వైద్యశాఖ, స్త్రీ మరియు శిశు సంక్షేమ శాఖలతో సమీక్షా సమావేశాలు నిర్వహించడం ద్వారా లోటుపాట్లను గుర్తించి వెంటనే సరిదిద్దుతున్నామని తెలిపారు. ప్రజలు ప్రభుత్వ ఆసుపత్రుల్లో అందుబాటులో ఉన్న వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ పిలుపునిచ్చారు. ఆసుపత్రుల్లో ఏవైనా సమస్యలు, లోటుపాట్లు గమనించినట్లయితే వెంటనే అధికారుల దృష్టికి తీసుకురావాలని, వాటి పరిష్కారానికి తక్షణ చర్యలు తీసుకుంటామని ఆమె స్పష్టం చేశారు.

# అన్నదానం చేయడం మనసుకు అపూర్వమైన ప్రశాంతతను ఇస్తుంది

**పెదకూరపాడు నియోజకవర్గ తెలుగు యువత నాయకులు సౌమిత్ చౌదరి**





**విజేత,పెదకూరపాడు :** అన్నదానం చేయడం మనసుకు అపూర్వమైన ప్రశాంతతను ఇస్తుందని, ఆహారం వృధా కాకుండా పేదలకు పెట్టి వారి ఆకలి తీర్చడం ఆనందంగా ఉందని పెదకూరపాడు నియోజకవర్గ తెలుగు యువత నాయకులు మేదరమెట్ల సౌమిత్ చౌదరి అన్నారు. మండలంలోని లింగంగుంట్ల గ్రామానికి చెందిన సౌమిత్ చౌదరి ఏర్పాటుచేసిన ఫంక్షన్ లో సుమారు 200 మందికి భోజనం మిగిలింది.ఈ విషయాన్ని జన చైతన్య సమితి స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులకు ఫోను ద్వారా సౌమిత్ తెలపటంతో సంస్థ ప్రతినిధులు బెజ్జం నాగేశ్వరరావు అశోక్ లేలాండ్ వాహనాన్ని తీసుకువచ్చి మిగిలిన భోజనాన్ని ఆ వాహనంలో ఎక్కించి మండలంలోని 75 తాళ్లూరు శాంతి కాలనీలో సౌమిత్ చౌదరి,వారి మిత్ర బృందం ద్వారా పంపిణీ చేశారు.ఈ సందర్భంగా సౌమిత్ మాట్లాడుతూ ఎవరు ఎంత సంపాదించిన భోజనం కోసమేనని ఆభోజనం వృధా కాకుండా జన చైతన్య ప్రతినిధులు ద్వారా పేదవారికి పంపిణీ చేశామన్నారు. ఇలాంటి మంచి కార్యక్రమాలు చేస్తున్న జనచైతన్య సమితి ప్రతినిధులను సౌమిత్ అభినందించారు.ఈ కార్యక్రమంలో యలమంచిలి అన్వేష్ ,గంగినేని బ్రహ్మేంద్ర, యలమంచిలి అశోక్,జన చైతన్య సమితి ప్రతినిధులు బెజ్జం ఆనంద్,దాసరి విజయ్ బెన్నిబాబు, కిన్నెర అంజయ్య తదితరులు పాల్గొన్నారు.

# శివంపేట గ్రామానికి ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేసినందుకు ఎమ్మెల్యే ను సన్మానించిన సర్పంచ్!

**రాజపేట వెంకటేశ్వర్ ముదిరాజ్.!!**





**విజేత, శివంపేట :** శివంపేట మండలంలోని మేజర్ గ్రామపంచాయతీ అయినా శివంపేట గ్రామంలో ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేసినందుకు నర్సాపూర్ ఎమ్మెల్యే సునీత లక్ష్మారెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు స్థానిక సర్పంచ్ రాజపేట వెంకటేశ్వర్ తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సునీత లక్ష్మారెడ్డి ని గ్రామపంచాయతీ కార్యాలయం ముందర ఘనంగా శాలువతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో మండల బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు రాజా రమణా గౌడ్, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ చంద్ర గౌడ్, మండలంలోని వివిధ గ్రామాల బి ఆర్ఎస్ పార్టీ సర్పంచులు, ప్రజా ప్రతినిధులు నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# ధాన్యం కొనుగోళ్లు వేగవంతం చేయాలి కలెక్టర్‌ను కోరిన ఎమ్మెల్యే డా.మేడిపల్లి సత్యం

**ప్రతి కొనుగోలు కేంద్రానికి స్పెషల్ ఆఫీసర్ నియమించాలని వినతి**



**విజేత, చొప్పదండి :** వరి ధాన్యం కొనుగోళ్లలో వేగం పెంచడంతో పాటు తప్పనిసరిగా తాలు,పేరు లేకుండా ఎటువంటి కోతలు లేకుండా ధాన్యం సేకరణ చేయాలని జిల్లా కలెక్టర్‌ను చొప్పదండి శాసనసభ్యులు, కరీంనగర్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు డా. మేడిపల్లి సత్యం కోరారు. ప్రత్యేక అధికారుల నియామకానికి వినతిలారీల సంఖ్యను పెంచి ప్రతి మండలానికి ప్రతి కొనుగోలు సెంటర్‌కు ఒక స్పెషల్ ఆఫీసర్‌ను నియమించి రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలని కలెక్టర్‌కు ఎమ్మెల్యే సూచించారు. ధాన్యం కొనుగోళ్లలో రైతులు నష్టపోకుండా పారదర్శకంగా వ్యవహరించాలని ఆయన కోరారు.సోమవారం జరిగిన ధాన్యం కొనుగోళ్ల సమీక్షా సమావేశంలో ఎమ్మెల్యే డా. మేడిపల్లి సత్యం పాల్గొని అధికారులతో చర్చించారు. వర్షాలు పడితే ధాన్యం తడవకుండా టార్పాలిన్లు, కాంటాలు అందుబాటులో ఉంచాలని, హమాలీల కొరత లేకుండా చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు.రైతులు పండించిన ప్రతి గింజను ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని, దళారుల మోసాలకు గురికావద్దని ఎమ్మెల్యే ఈ సందర్భంగా రైతులకు భరోసా ఇచ్చారు. ధాన్యం కొనుగోళ్లలో ఎలాంటి సమస్య వచ్చినా తన దృష్టికి తీసుకురావాలని సూచించారు. పాల్గొన్నవారు: ఈ కార్యక్రమంలో చొప్పదండి నియోజకవర్గ కాంగ్రెస్ నాయకులు, ప్రజాప్రతినిధులు, అధికారులు, రైతు సంఘాల నాయకులు పాల్గొన్నారు. ధాన్యం కొనుగోళ్లపైఅధికారులతో చొప్పదండి ఎమ్మెల్యే డా. మేడిపల్లి సత్యం మున్సిపల్ సమీక్షా సమావేశం నిర్వహించారు

# మహేశ్వరం టు షాద్నగర్ ఆర్టీసీ బస్సు నడపాలి

**మహేశ్వరం డిపో మేనేజర్ లక్ష్మీ సుధకి కి వినతి పత్రం అందించిన**

**మహేశ్వరం గ్రామ సర్పంచ్ మునగపాటి నవీన్**



**విజేత మహేశ్వరం :** మహేశ్వరం సర్పంచ్ పాలక వర్గ సభ్యులు మహేశ్వరం డిపో టీజీఎస్ ఆర్టీసీ మేనేజర్ లక్ష్మి సుధా ని కలిసి ,మహేశ్వరం నుండి షాద్ నగర్ వయా అమీర్పెట్, తిమ్మాపూర్ మహేశ్వరం గ్రామం నుండి జేబీఎస్ , సికింద్రాబాద్ వరకు బస్సు సౌకర్యం కల్పించాలని వినతి పత్రం అందించారు . అనంతరం మహేశ్వరం గ్రామ సర్పంచ్ మునగపాటి నవీన్,మాట్లాడుతూ గ్రామంలో కార్మికులు వివిద కంపనీల యందు పని చేయుటకు వెళ్తున్నవారికి మరియు, కాలేజీ ఉ స్కూల్ విధ్యార్థిని, విధ్యార్థులకు గ్రామం నుండి హైదరాబాద్ నగరానికి రైతులు తమ యొక్క సరుకులను తీసుకెళ్లుటకు అనేక ఇబ్బందులు పడుతున్నారని గ్రహించడం జరిగిందని తెలుపూ అట్టి సమస్యను పరిష్కరించుటకై డిపో మేనేజర్ లక్ష్మీ సుధా ని కలిసి మరికొన్ని అదనపు బస్సు సౌకర్యం కల్పించాలని కోరారు . ఇట్టి కార్యక్రమములో మహేశ్వరం , వార్డు సభ్యులు ఆకుల వీరిబాబు, తదితరులు పాల్గొన్నారు,

# శివంపేట మండలంలో అర్హులైన ప్రతి ఒక్కరికి ఇందిరమ్మ ఇండ్లు ఇప్పించే బాధ్యత నాది!

**ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి!!**



**విజేత,శివంపేట :** శివంపేట మండలంలోని వివిధ గ్రామాలలో అర్హులైన ప్రతిఒక్కరికి ప్రభుత్వం నుండి తప్పకుండ ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయిస్తామని మాజీ మంత్రి,నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి అన్నారు.ఎమ్మెల్యే కోటా ద్వారా ప్రభుత్వం నుండి మంజూరు అయిన ఇందిరమ్మ ఇండ్ల ధ్రువపత్రాలను సోమవారం లబ్ధిదారులకు అందజేశారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే సునీతారెడ్డి మాట్లాడుతూ వర్షాకాలం రాబోతున్నందున ఇండ్ల నిర్మాణపు పనులను వీలైనంత తొందరగా మొదలు పెట్టి సొంతింటి కలలను నిజం చేసుకోవాలని ఆమె సూచించారు.పలు గ్రామాలలోని లబ్ధిదారులకు ప్రభుత్వం నుండి మంజూరు అయిన సీఎంఆర్ఎఫ్ చెక్కులను ఎమ్మెల్యే చేతులమీదుగా అందజేశారు.అనంతరం బీఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షులు రమణ గౌడ్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే సునీతారెడ్డిని నాయకులు శాలువాలతో ఘనంగా సన్మానించారు.ఈకార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ వెంకట్రాంరెడ్డి, ఎంపీడీఓ వెంకటలక్ష్మమ్మ, ఎంపీఓ తిరుపతిరెడ్డి,సీనియర్ అసిస్టెంట్ నరేందర్ రెడ్డి, హౌసింగ్ అధికారులు, సర్పంచులు, ఉపసర్పంచులు, అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

# హత్య కేసు కొట్టివేత

**విజేత,భీమవరం ;** కాళ్ళ పోలీస్ స్టేషన్ పరిధి లోని సీసలి గ్రామంలో 2016 వ సంవత్సరంలో జరిగిన హత్య కేసులో నేరం రుజువుకానందున కేసును కొట్టివేస్తూ భీమవరం మూడో అదనపు జిల్లా జడ్జి సోమవారం తీర్పును వెల్లడించారు. కాళ్ళ పోలీసులు సి ఆర్ నెంబర్ 24/2016 జ/ం 302, 201 =/ష 34 ఐపిసి ప్రకారం హత్య నేరం నమోదు చేసియున్నారు. ఈ కేసులో కాళ్ళ గ్రామానికి చెందిన పుచ్చకాయల.నోవాహు మర్రి కృప దానం లను పోలీసులు ముద్దాయిలుగా చూపించి యున్నారు.ముద్దాయిల తరఫున న్యాయవాదులు ఎస్ బెనర్జీ ఎన్ సుదీర్లు వాదనలు వినిపించారు గౌరవ జడ్జి కేసును కొట్టివేస్తూ మూడో అదనపు జిల్లా తీర్పును వెలువడించారు.

## కాగజ్ నగర్ ప్రభుత్వ పాఠశాలలో వేసవి శిక్షణ తరగతుల ప్రారంభం



**అక్షర విజేత కాగజ్ నగర్ ప్రతినిధి :** కాగజ్ నగర్ మండలంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల(ఓల్డ్)లో 15 రోజుల పాటు వేసవి శిక్షణ తరగతులు ప్రారంభమయ్యాయి. మే 25 వరకు ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు 6వ తరగతి నుంచి 9వ తరగతి విద్యార్థులకు ఈ శిక్షణ అందించబడుతుంది. మున్సిపల్ చైర్పర్సన్ షాహీన్ సుల్తానా ముఖ్య అతిథిగా హాజరై, విద్యార్థులు చిత్రలేఖనం, క్రీడలు, యోగా, కరాటే వంటి అంశాల్లో నైపుణ్యాలు పెంపొందించుకోవాలని సూచించారు. మండల విద్యాధికారి వాసాల ప్రభాకర్ ఈ విషయాన్ని తెలిపారు. ప్రధానోపాధ్యాయులు జాడి దేవాజీ మాట్లాడుతూ, మండలంలోని 100 మంది విద్యార్థులకు ఈ శిక్షణలో అవకాశం కల్పించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, ఇన్స్ట్రక్టర్లు, విద్యార్థులు పాల్గొన్నారు

## ఎస్పీఎంలో వెంటనే కార్మిక సంఘ ఎన్నికలు నిర్వహించాలని ఎమ్మెల్యే



**అక్షర విజేత కాగజ్ నగర్ ప్రతినిధి :** సిర్పూర్ ఎమ్మెల్యే డా. పాల్వాయి హరీష్ బాబు హైదరాబాద్లో కార్మిక శాఖ కార్యదర్శి దాసరి హరిచందనను కలిసి, సిర్పూర్ పేపర్ మిల్లులో గుర్తింపు కార్మిక సంఘం ఎన్నికలు తక్షణం నిర్వహించాలని కోరారు. గత ఎనిమిదేళ్లుగా ఎన్నికలు జరగకపోవడంతో కార్మికుల సమస్యలు పరిష్కారం కావడం లేదని, కనీస సౌకర్యాలు కల్పించకుండా యాజమాన్యం కార్మికులను ఇబ్బందులకు గురిచేస్తోందని ఆయన ఆరోపించారు. ఈ విషయంపై కార్యదర్శి సానుకూలంగా స్పందించి, తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు

## తెలంగాణ స్టేట్ కిక్ బాక్సింగ్ ఛాంపియన్ షిప్ లో గోల్డ్ మెడల్ సాధించిన దొడ్లే లహరి!!






**విజేత,శివంపేట :** శివంపేట మండల కేంద్రానికి చెందిన దొడ్లే సంతోష-సంతోష్ దంపతుల కూతురు దొడ్ల లహరి హైదరాబాద్ లో జరిగిన స్టేట్ కిక్ బాక్సింగ్ ఛాంపియన్ షిప్ లో గోల్డ్ మెడల్స్ సాధించింది. గత నెలలో జిల్లా స్థాయిలో ఎంపికై ఆదివారం జరిగిన స్టేట్ కిక్ బాక్సింగ్ ఛాంపియన్ షిప్ గోల్డ్ మెడల్ సాధించడం పట్ల స్కూల్ ప్రిన్సిపల్, తల్లిదండ్రులు అభినందనలు తెలియజేశారు.ఈ సందర్భంగా దొడ్ల లహరి మాట్లాడుతూ నా విజయానికి ప్రోత్సహించిన నాగరాజు మాస్టర్,శేఖర్ మాస్టర్, సిద్దార్థ మాస్టర్ ప్రత్యేక కృతజ్ఞతలు అని తెలియజేసింది.

## కాగజ్ నగర్లో ఘనంగా ఉచిత పాలిటెక్నిక్ కోచింగ్ ముగింపు సభ



**అక్షర విజేత కాగజ్ నగర్ ప్రతినిధి :** కాగజ్ నగర్ డివిజనల్ రిసోర్స్ సెంటర్లో నెల రోజుల పాటు నిర్వహించిన ఉచిత పాలిటెక్నిక్, ఎంట్రన్స్ కోచింగ్ కార్యక్రమాలు ఘనంగా ముగిశాయి. ఈ ముగింపు సభకు ముఖ్య అతిథిగా హాజరైన సబ్ కలెక్టర్ శ్రద్ధ శుక్లా విద్యార్థులను అభినందించారు. మండల విద్యాశాఖ అధికారి వాసాల ప్రభాకర్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో విద్యార్థులు తమ అనుభవాలను పంచుకున్నారు. సమానత్వానికి విద్యే మార్గమని కోఆర్డినేటర్ కటకం మధూకర్ తెలిపారు. గత నాలుగేళ్లుగా ఈ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహిస్తున్న ఉపాధ్యాయులను సబ్ కలెక్టర్ ప్రశంసించారు. భూపాలపట్నం విద్యార్థిని మమత రూపొందించిన పార్కింగ్ డివైస్కు పేటెంట్ రావడంపై ఆమె ప్రత్యేకంగా అభినందనలు తెలిపారు.

## దివ్యాంగులకు అండగా ఉండడం మన బాధ్యత :మేయర్ కొలగాని శ్రీనివాస్



**విజేత, కరీంనగర్ :** కరీంనగర్ నగర మేయర్ కొలగాని శ్రీనివాస్ మాట్లాడుతూ సమాజంలో దివ్యాంగులకు అండగా నిలవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని అన్నారు దివ్యాంగుల సంక్షేమానికి ప్రభుత్వం అనేక పథకాలు అమలు చేస్తోందని వాటిని అర్హులందరికీ చేరేలా చూడాలని సూచించారు దివ్యాంగులు ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగాలని సమాజంలో సమాన అవకాశాలు కల్పించేందుకు కృషి చేస్తామని స్వయం ఉపాధి విద్యా వైద్య సహాయం అందించేందుకు చర్యలు తీసుకుంటామనిహామీ ఇచ్చారు.

## ఎలక్ట్రిక్ 3-వీలర్ కొనుగోలుదారుకు షాకింగ్ న్యూస్..! కేంద్రం నిర?యంతో ఇకపై..




ప్రధానమంత్రి ఈ-డ్రైవ్ పథకం కింద లక్ష్యాన్ని సాధించింది. దీంతో ఎలక్ట్రిక్ త్రీ-వీలర్లకు సబ్సిడీలను ఉపసంహరించుకోవాలని కేంద్రం నిర?యించిన్నట్టుగా తెలిసింది. ఇదే విషయాన్ని సంబంధిత అధికారులు వెల్లడించారు. త్రీ-వీలర్ విభాగంలో విద్యుత్ వ్యాప్తి అంచనా ప్రకారం 32శాతానికి పెరిగింది, ఈ పథకాన్ని రూపొందించినప్పుడు ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకున్న స్థాయి కంటే ఇది ఎక్కువగానే రీచ్ అయింది. ఈ మైలురాయిని చేరుకున్న తర్వాత, జాతీయ స్థాయిలో ప్రత్యక్ష మద్దతు ఇకపై అవసరం లేదని కేంద్రం భావిస్తున్నట్టుగా సమాచారం. బదులుగా రాష్ట్ర ప్రభుత్వాలు ముందంజలో ఉండాలని కోరుకుంటుంది. కాలుష్య స్థాయిలను తగ్గించడానికి, ఎలక్ట్రానిక్ వాహనాలను ప్రోత్సహించడానికి కేంద్ర ప్రభుత్వం గత కొన్ని సంవత్సరాలుగా అనేక చర్యలు తీసుకుంది. ఇందులో భాగంగానే సెంట్రల్ సర్కార్ ప్రతిష్టత్మకంగా చేపట్టిన డ్రైవ్ పథకం కింద ఎలక్ట్రిక్ త్రీ-వీలర్ల లక్ష్యాన్ని చేరుకుంది. ఈ పథకం లక్ష్యం దాదాపు 2.9 లక్షల 5 కేటగిరీ ఎలక్ట్రిక్ త్రీ-వీలర్లు అమ్మకాలు సాధించబడింది. దీంతో డ్రైవ్ పథకం కింద విద్యుత్ త్రిచక్ర వాహనాలకు సబ్సిడీలను తొలగించింది. అవును,.. ప్రభుత్వం తన లక్ష్యాన్ని చేరుకున్న క్రమంలో ఈ నిర?యం తీసుకున్నట్టుగా తెలిసింది. కేంద్ర ప్రభుత్వ నిర?యంతో ఇకపై త్రిచక్ర వాహనాల కొనుగోలుపై ప్రజలు ఎటువంటి సబ్సిడీ లభించదు. ఈ నిర?యం వెలుగులోకి వచ్చింది. ఆ సమయంలో ఎలక్ట్రిక్ త్రీ-వీలర్ల మార్కెట్ వాటా 32శాతానికి పెరిగింది. ప్రభుత్వం ఎలక్ట్రిక్ వాహనాలను త్రీ-వీలర్ మార్కెట్లో 20-30శాతానికి చేరుకోవాలని లక్ష్యంగా పెట్టుకుంది. ఈ లక్ష్యం ఇప్పుడు సాధించినట్టుగా ఒక అధికారి పేర్కొన్నారు. పరిశ్రమ కూడా ఈ నిర?యంతో ఏకీభవిస్తోందని చెప్పారు. 5 కేటగిరీ కోసం 2.88 లక్షల వాహనాల లక్ష్యాన్ని నిర్దేశించారు. ఈ లక్ష్యాన్ని కూడా సాధించారు. 2025లో 7.5 లక్షలకు పైగా ఎలక్ట్రిక్ త్రిచక్ర వాహనాలు అమ్ముడయ్యాయి. వీటిలో 60శాతం %జుఎ%లు ఉన్నాయి. ద్విచక్ర ఎలక్ట్రిక్ వాహనాలలో (%వ-2ఔ%) ప్రవేశం 7.5శాతం మాత్రమే. లక్ష్యం 25 లక్షల యూనిట్లు, కానీ ఇప్పటి వరకు 18.3 లక్షల ద్విచక్ర వాహనాలు అమ్ముడయ్యాయి. ఆర్థిక సంవత్సరం చివరి నాటికి ఈ సంఖ్య 23 లక్షలకు చేరుకుంటుందని అంచనా. అందువల్ల ద్విచక్ర వాహనాలకు సబ్సిడీ వచ్చే ఆర్థిక సంవత్సరం 2026-27లో కూడా కొనసాగే అవకాశం ఉంది. కొత్త సంవత్సరం ప్రారంభంలో కొత్త నిర?యం తీసుకోబడుతుంది. కేంద్ర ప్రభుత్వం ఇప్పుడు ఈ లక్ష్యాన్ని రాష్ట్ర ప్రభుత్వాలకు అప్పగిస్తోంది. అనేక రాష్ట్రాలు తమ సొంత పథకాలు, ప్రోత్సాహకాలను ప్రవేశపెడుతున్నాయి. వచ్చే నెలలో కొత్త ప్యాకేజీ ప్రకటించబడవచ్చునని తెలుస్తోంది. ఇతర రాష్ట్రాలు కూడా రిజిస్ట్రేషన్ ఫీజు తగ్గింపులు, ఇతర ప్రయోజనాలను అందిస్తున్నాయి. ఇకపోతే, నాలుగు చక్రాల ఎలక్ట్రిక్ వాహనాల కొనుగోలు చాలా తక్కువగా ఉందని, కాబట్టి అక్కడ కూడా రాష్ట్ర స్థాయి మద్దతు అవసరం అంటున్నారు. డ్రైవ్ పథకం 14,000 ఎలక్ట్రిక్ బస్సులు, 5,643 ట్రక్కులకు మద్దతు ఇస్తుంది. అయితే, వాహనాలు ఇంకా టెస్ట్ ట్రయల్ దశలో ఉన్నందున వీటికి డిమాండ్ అంతగా లేదని అంటున్నారు. ఛార్జింగ్ మౌలిక సదుపాయాలు అతిపెద్ద సవాలు అని, ప్రైవేట్ సర్వీస్ ప్రొవైడర్లు ముందుకు రావాలని పరిశ్రమ నిపుణులు అంటున్నారు.

## ఆధార్ కార్డ్‌లో పేరు మార్చడం ఇప్పుడంతా ఈజీ కాదు! రూల్స్ మారిపోయాయి.. నేమ్ అప్డేట్ చేయాలంటే?



ఆధార్ కార్డు పేరు మార్పు నిబంధనలను కఠినతరం చేసింది. పూర్తి పేరు లేదా ఇంటిపేరు మార్పునకు కేవలం అఫిడవిట్ కాకుండా, గెజిట్ నోటిఫికేషన్ తప్పనిసరి. చిన్న స్పెల్లింగ్ తప్పులకు అవసరం లేదు. మోసాలను నిరోధించడానికి ఈ నూతన నియమాలు అమలులోకి వచ్చాయి. ఆధార్ కార్డ్‌లో పేరు, అడ్రస్ లేదా ఏదైనా అప్డేట్ చేయాలంటే.. చాలా మంది అదెంత సేపు చిటికెలో అయిపోతుందని అనుకుంటారు. అనేక ఆధార్ కార్డుల్లో తప్పులు దొర్లడంతో ప్రభుత్వం చాలా సులువుగా కార్డ్‌ను అప్డేట్ చేసేందుకు అనేక అవకాశాలు ఇచ్చింది. కానీ ఇకపై ఆధార్ కార్డులో పేరు మార్చుకోవడం అంత ఈజీ కాదు. భారత విశిష్ట గుర్తింపు ప్రాధికార సంస్థ రూల్స్‌ను కఠినతరం చేసింది. ఇప్పుడు పేరు మార్పుకు కేవలం అఫిడవిట్ సరిపోదు. దీని కోసం మీరు గెజిట్ నోటిఫికేషన్, సుదీరె ప్రక్రియ అవసరం అవుతుంది. గతంలో స్థానిక కౌన్సిలర్ నుండి ఒక లేఖ లేదా నోటరీ చేయబడిన సాధారణ అఫిడవిట్ సరిపోయేది, ఇప్పుడు మీరు మీ పేరులో మార్పులు చేస్తుంటే (మీ పూర్తి పేరును మార్చడం లేదా ఇంటిపేరును జోడించడం/తొలగించడం వంటివి), %ఖ×ణూ×%కి కేంద్ర ప్రభుత్వం జారీ చేసిన గెజిట్ నోటిఫికేషన్ అవసరం కావచ్చు. గుర్తింపు మోసాన్ని నిరోధించడానికి, పత్రాల ప్రామాణికతను నిర్ధారించడానికి ఈ కఠినమైన నియమాలు రూపొందించారు. అయితే మీ పేరులో స్వల్ప స్పెల్లింగ్ దిద్దుబాటు మాత్రమే ఉంటే, మీకు గెజిట్ అవసరం ఉండకపోవచ్చు. మీరు మీ పేరును పూర్తిగా మారుస్తుంటే, లేదా వివాహం తర్వాత మీ ఇంటిపేరును మారుస్తుంటే, మీ వద్ద ఎటువంటి ద ృఢమైన రుజువు లేకపోతే, గెజిట్ నోటిఫికేషన్ అవసరం. ఈ ప్రక్రియలో మీరు మొదట ఒక అఫిడవిట్ సిద్ధం చేయాలి. తరువాత, మీరు మీ పేరు మార్పును రెండు వార్తాపత్రికలలో (ఒకటి ఆంగ్లంలో, మరొకటి స్థానిక భాషలో) ప్రకటించాలి. చివరగా ఈ అన్ని పత్రాలు, ఫోటోలు, దరఖాస్తును భారత ప్రభుత్వ ప్రచురణ విభాగానికి పంపాలి. మీ కొత్త పేరు అధికారిక గెజిట్‌లో ప్రచురించబడిన తర్వాత అది చట్టబద్ధంగా చెల్లుబాటు అవుతుంది. కొన్నిసార్లు గెజిట్ నోటిఫికేషన్ ఉన్నప్పటికీ సిస్టమ్ అప్డేట్‌ను అంగీకరించడంలో విఫలమవుతుంది. అటువంటి పరిస్థితిలో మీరు నేరుగా UIDAI హెల్ప్‌లైన్ నంబర్ 1947 కు కాల్ చేయవచ్చు లేదా help@uidai.net.in కు ఇమెయిల్ చేయవచ్చు.

## భారతదేశాన్ని తక్కువ అంచనా వేయకండి.. బ్రిటన్ ఉ జపాన్‌లను అధిగమిస్తోంది.. త్వరలోనే..!




భారతదేశ ఆర్థిక వ్యవస్థ వేగంగా అభివృద్ధి చెందుతోంది. ప్రపంచ బ్రోకరేజ్ సంస్థ గోల్డ్‌మన్ సాచ్స్ 2027 ఆర్థిక సంవత్సరంలో భారతదేశ ఆర్థిక వ్యవస్థ స్థిరంగా ఉంటుందని అంచనా వేసింది. పెట్టుబడి బ్యాంకు భారతదేశ వాస్తవ +ఖూ వృద్ధి 2027 ఆర్థిక సంవత్సరంలో 6.8 శాతంగా ఉంటుందని అంచనా వేసింది. భారతదేశ ఆర్థిక వ్యవస్థ వేగంగా అభివృద్ధి చెందుతోంది. ప్రపంచ బ్రోకరేజ్ సంస్థ గోల్డ్‌మన్ సాచ్స్ 2027 ఆర్థిక సంవత్సరంలో భారతదేశ ఆర్థిక వ్యవస్థ స్థిరంగా ఉంటుందని అంచనా వేసింది. పెట్టుబడి బ్యాంకు భారతదేశ వాస్తవ +ఖూ వృద్ధి 2027 ఆర్థిక సంవత్సరంలో 6.8 శాతంగా ఉంటుందని అంచనా వేసింది. ఇది 2026 ఆర్థిక సంవత్సరంలో 7.3 శాతం కంటే కొంచెం తక్కువగా ఉంది. డిమాండ్‌కు మద్దతుగా నిర్ణయాత్మక విధాన మార్పు వృద్ధిని పెంచుతుందని గోల్డ్‌మన్ సాచ్స్ పేర్కొన్నారు. 2025లో భారతదేశం ఆదాయపు పన్ను ఉపశమనాన్ని అందించింది. వస్తువులు, సేవల పన్ను (+ూు)ని హేతుబద్ధీకరించింది. అన్ని రకాల పన్నులను సరళీకృతం చేసింది.. ద్రవ్యతను పెంచడంపై దృష్టి పెట్టింది. వినియోగానికి మద్దతుగా =దీ× రెపో రేటును మొత్తం 125 బేసిస్ పాయింట్లు తగ్గించింది. 2021లో భారతదేశం ప్రపంచంలోనే ఐదవ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా అవతరించింది. ఈ సమయంలో భారతదేశం బ్రిటన్‌ను అధిగమించి ప్రపంచంలోనే ఐదవ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా అవతరించింది. అప్పటి నుండి భారతదేశం వేగం కొనసాగుతోంది. గత 25 సంవత్సరాలుగా భారతదేశం 6.4 శాతం, చైనా 8.0 శాతం కంటే వెనుకబడి ఉన్నప్పటికీ, ఇటీవలి సంవత్సరాలలో ఈ ధోరణి మారిపోయింది. అందుకే భారతదేశం గత సంవత్సరం జపాన్‌ను అధిగమించి ప్రపంచంలోనే నాల్గవ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా అవతరించింది. గత శుక్రవారం (జనవరి 02, 2026), ూదీ× మ్యూచువల్ ఫండ్ భారతదేశ నామమాత్రపు +ఖూ వృద్ధి రేటు 2026-27 ఆర్థిక సంవత్సరంలో సుమారు 11 శాతానికి, వాస్తవ +ఖూ వృద్ధి సుమారు 7.2 శాతానికి పెరుగుతుందని అంచనా వేసింది. ప్రభుత్వ విధాన మార్పులు, మెరుగైన, ఖరీదైన ఉత్పత్తులను కొనుగోలు చేయాలనే ప్రజల ధోరణి పెరుగుతున్న కారణంగా రాబోయే సంవత్సరాలు భారతదేశ ఆర్థిక వ్యవస్థకు అనుకూలంగా ఉంటాయని ూదీ× మ్యూచువల్ ఫండ్ నివేదిక పేర్కొంది. అయితే, ఈ కాలంలో ప్రపంచ మాంద్యం, భౌగోళిక రాజకీయాలు ఆర్థిక వ్యవస్థకు సవాలుగా మారవచ్చు. ఇండియన్ రేటింగ్స్ అండ్ రీసెర్చ్ (ఇండ్-రా) మంగళవారం నాడు భారత ఆర్థిక వ్యవస్థ 2026-27 ఆర్థిక సంవత్సరంలో (2027 ఆర్థిక సంవత్సరం) 6.9 శాతం వృద్ధి చెందుతుందని అంచనా వేసింది. అయితే, ఇది 2026 ఆర్థిక సంవత్సరానికి అంచనా వేసిన 7.4 శాతం వృద్ధి రేటు కంటే తక్కువ.

## పీఎం ఆవాస్ యోజన ప్రయోజనం ఏంటో తెలుసా? ఎవరు దరఖాస్తు చేసుకోవచ్చు?



కేంద్రంలోని మోడీ సర్కార్ దేశ ప్రజల కోసం ఎన్నో పథకాలను అమలు చేస్తోంది. రైతులకు, పేదలకు, ఇతర వర్గాల వారికి ఆర్థికంగా సాయం అందించే పథకాలను అమలు చేస్తోంది. అయితే శాశ్వతంగా ఇల్లు లేనివారికి కూడా ఆర్థిక సాయం అందిస్తోంది. ప్రధాన మంత్రి ఆవాస్ యోజన పథకాన్ని అమలు చేస్తోంది.. కేంద్ర ప్రభుత్వం దేశ ప్రజల కోసం రకరకాల పథకాలను అమలు చేస్తోంది. కేంద్రం అమలు చేస్తున్న పథకాల్లో పీఎం ఆవాస్ యోజన ఒకటి. ఇంకా శాశ్వత ఇల్లు నిర్మించుకోని పట్టణ కుటుంబాలకు శుభవార్త ఉంది. ప్రధాన్ మంత్రి ఆవాస్ యోజన అర్బన్ 2.0 (ూహీూ-ఖ 2.0) కింద ప్రభుత్వం పట్టణ ప్రాంతాల్లోని ప్రజలకు ఇల్లు నిర్మించడానికి, కొనడానికి లేదా అద్దెకు తీసుకోవడానికి ఆర్థిక సహాయం అందిస్తోంది కేంద్రం. ఈ పథకం 2024 నుండి 2029 వరకు ఐదు సంవత్సరాల పాటు అమలులో ఉంటుంది.

### PMAY-U 2.0 ఎవరి కోసం?

ఈ పథకం భారతదేశంలో ఎక్కడా శాశ్వత ఇల్లు లేని కుటుంబాల కోసం. ఆర్థికంగా బలహీన వర్గాలు , తక్కువ ఆదాయ వర్గాలు , మధ్య ఆదాయ వర్గాలు చెందిన పట్టణ కుటుంబాలకు ఈ పథకం ప్రయోజనం చేకూరుస్తుంది. వారి అవసరాలను బట్టి లబ్ధిదారులు కొత్త ఇల్లు నిర్మించుకోవచ్చు. ఇల్లు కొనుగోలు చేయవచ్చు. లేదా అద్దె గృహాలను ఎంచుకోవచ్చు.

### ఆదాయ పరిమితి ఎంత?

ఆర్థికంగా బలహీన వర్గాల వారికి: వార్షిక ఆదాయం రూ. 3 లక్షల వరకు
తక్కువ ఆదాయ వర్గాల వారికి: వార్షిక ఆదాయం రూ. 3 లక్షల నుండి రూ. 6 లక్షల మధ్య.
మధ్య ఆదాయ వర్గాల వారికి: వార్షిక ఆదాయం రూ. 6 లక్షల నుండి రూ. 9 లక్షల మధ్య


### ఎవరు దరఖాస్తు చేసుకోలేరు?

గత 20 సంవత్సరాలలో ఏదైనా కేంద్ర, రాష్ట్ర లేదా స్థానిక సంస్థల గృహనిర్మాణ పథకం నుండి ప్రయోజనం పొందిన వారు PMAY-U 2.0 కి అర్హులు కారు. మొదటిసారి ఇంటి యజమానులకు మాత్రమే సహాయం చేరేలా చూడటం దీని లక్ష్యం.

### ఈ పథకాన్ని ఎవరు నడుపుతారు?

PMAY-U 2.0 ను గృహనిర్మాణం, పట్టణ వ్యవహారాల మంత్రిత్వ శాఖ అమలు చేస్తుంది. PMAY-U 2.0 పట్టణ కుటుంబాలు తమ ఇంటిని సొంతం చేసుకోవాలనే కలను నెరవేర్చుకోవడానికి ఒక గొప్ప అవకాశం. మీరు అర్హులైతే ఆదాయ పరిమితులు, అర్హత ప్రమాణాలను జాగ్రత్తగా సమీక్షించి, సకాలంలో దరఖాస్తు చేసుకోండి.

## ఈ బడ్జెట్‌లో రైతులకు శుభవార్త రానుందా? పీఎం కిసాన్ సాయం రూ.10 వేలకు పెరగనుందా?




ఈ బడ్జెట్‌లో రైతులు ఎన్నో ఆశలు పెట్టుకున్నారు. ముఖ్యంగా పీఎం కిసాన్ నిధుల గురించి బడ్జెట్‌లో ఎలాంటి ప్రకటన వస్తుందనే దానిపై ఎదురు చూస్తున్నారు. ఎందుకంటే ఈ వార్షిక బడ్జెట్‌లో పీఎం కిసాన్ సాయం పెంచుతుందని భావిస్తున్నారు. ప్రస్తుతం రైతులకు ఏడాదికి 6000 రూపాయల చొప్పున అందిస్తోంది. అయితే.. కేంద్ర బడ్జెట్ 2026 సమర్పణకు ఇంకా ఎక్కువ సమయం లేదు. ముఖ్యంగా ఈ బడ్జెట్‌లో వ్యవసాయానికి సంబంధించిన అంశాలపై పరిశీలిస్తోంది. పెరుగుతున్న వ్యవసాయ ఖర్చులు, ద్రవ్యోల్బణం ఒత్తిడి మధ్య, రైతులు ప్రభుత్వం నుండి ఉపశమనం కోసం ఆశిస్తున్నారు. ప్రధాన మంత్రి కిసాన్ సమ్మాన్ నిధి యోజన కింద ప్రభుత్వం తమకు లభించే సహాయాన్ని పెంచుతుందని రైతులు ఆశిస్తున్నారు. ప్రస్తుతం ఈ పథకం కింద రైతులు ఏటా రూ.6,000 పొందుతున్నారు. అయితే ప్రస్తుత పరిస్థితులలో ఈ మొత్తం వారికి సరిపోదు. అందువల్ల, 2026 బడ్జెట్‌లో ప్రభుత్వం ఈ మొత్తాన్ని రూ.10,000 కు పెంచుతుందని భావిస్తున్నారు.

### పెంపుదల డిమాండ్ ఎందుకు ఉంది?

రైతుల అభిప్రాయం ప్రకారం.. గత కొన్ని సంవత్సరాలుగా వ్యవసాయ ఖర్చులు బాగా పెరిగాయి. ఎరువులు, విత్తనాలు, పురుగుమందులు, డీజిల్, వ్యవసాయ పరికరాలు గతంలో కంటే చాలా ఖరీదైనవిగా మారాయి. అటువంటి పరిస్థితులలో వార్షిక సహాయం రూ. 6,000 చాలా తక్కువగా ఉంటుంది. ప్రభుత్వం ఈ మొత్తాన్ని పెంచితే రైతులు వ్యవసాయంలో మెరుగైన పెట్టుబడులు పెట్టడానికి, అలాగే ఉత్పత్తిని పెంచడానికి సహాయపడుతుందని రైతులు భావిస్తున్నారు. ఈ సందర్భంలో దేశ రైతులు ఈ సంవత్సరం బడ్జెట్ పై అధిక అంచనాలను కలిగి ఉన్నారు. ప్రభుత్వం ఆర్థిక సహాయాన్ని పెంచాలని నిర్ణయించుకుంటే అది తోటి రైతులకు ప్రత్యక్షంగా ప్రయోజనం చేకూరుస్తుంది. ఇంకా వారి చేతుల్లో ఎక్కువ డబ్బు ఉండటంతో, రైతుల ఖర్చు సామర్థ్యం కూడా పెరుగుతుంది. ఇది మొత్తం గ్రామీణ ఆర్థిక వ్యవస్థలో వృద్ధికి దారితీస్తుంది.

### ఈ పథకం ఎప్పుడు ప్రారంభమైంది?

ప్రధాన మంత్రి కిసాన్ సమ్మాన్ నిధి యోజన డిసెంబర్ 2018లో ప్రారంభించారు. ఈ పథకం చిన్న రైతులకు, పరిమిత సాగు భూమి ఉన్నవారికి ఆర్థిక సహాయం అందించడం లక్ష్యంగా పెట్టుకుంది. ఈ పథకం కింద రైతులు సంవత్సరానికి రూ.6,000 సహాయం పొందుతారు.

## 20 ఏళ్ల హోమ్ లోన్ 13 ఏళ్లల్లోనే తీర్చవచ్చు ఈ చిన్న టిప్స్ పాటిస్తే మీపై ఆర్థిక భారం తగ్గినట్లే..



ప్రస్తుత ఆర్థిక పరిస్థితుల్లో సొంతిల్లు నిర్మించుకునేందుకు చాలామంది బ్యాంకుల నుంచి హోమ్ లోన్ తీసుకుంటున్నారు. ఇటీవల ఎన్‌ఎఫ్‌బీసీ సంస్థలు కూడా హోమ్ లోన్ జారీ చేస్తున్నాయి. అయితే హోమ్ లోన్ 13 ఏళ్లల్లోనే తీర్చడం వల్ల మీకు వడ్డీ ఆదా అవుతుంది. సొంతిల్లు నిర్మించుకోవాలనేది ప్రతీఒక్కరి జీవితకాలపు కల. తమ కలను నిజం చేసుకునేందుకు తాము కష్టించి సంపాదించిన సొమ్మును కూడబెట్టుకుంటూ ఉంటారు. అయితే ముడి సరుకు ధరలన్నీ పెరిగిన క్రమంలో ఇప్పట్లో ఇల్లు నిర్మించడం పెద్ద భారంగా మారింది. సొంతింటి కోసం రూ.లక్షల ఖర్చు అవుతుంది. సామాన్యుడి దగ్గర అంత డబ్బులు ఉండవు. దీంతో బ్యాంక్ నుంచి హోమ్ లోన్ తీసుకుంటూ ఉంటారు. గృహ రుణం కాలపరిమితి 20 ఏళ్ల వరకు ఉంటుంది. అయితే 20 ఏళ్ల పాటు ఈఎంఐ చెల్లించుకుంటూ ఉంటే వడ్డీ ఎక్కువ అవ్వడంతో పాటు ఆర్థిక భారం ఎక్కువగా ఉంటుంది. అయితే కొన్ని చిట్కాలు పాటించడం వల్ల 13 నుంచి 14 ఏళ్లల్లో హోమ్ లోన్ తిరిగి చెల్లించవచ్చు. అదెలా అనేది ఇప్పుడు చూద్దాం.

**ఈ మూడు మార్గాలు**

ఉదాహరణకు మీరు 20 ఏళ్లల్లో చెల్లించడానికి 8.5 శాతం వడ్డీతో రూ.40 లక్షల హోమ్ లోన్ తీసుకున్నారనుకుందాం. మీకు నెలకు ఈఎంఐ రూ.34,678 పడుతుంది. మీరు 20 ఏళ్ల పాటు చెల్లిస్తూ ఉంటే రూ.83 లక్షలు కూడబెడతారు. అదే మీరు 13 సంవత్సరాల్లో తిరిగి చెల్లించాలంటే ఈఎంఐను పెంచుకోవాల్సి ఉంటుంది. ఈఎంఐ రూ.44,200కి పెంచుకుంటే 13 ఏళ్లకు రూ.68,95,200 అవుతుంది. ఈ విధానంలో మీకు రూ.14,27,520 వడ్డీ ఆదా అవుతుంది. ఇక ఇదే కాకుండా ప్రతీ ఏడాది ముందుగా చెల్లించే పద్దతి మరోకొటి ఉంది. ఈఎంఐ రూ.34,678 ఉండగా.. సంవత్సరానికి రూ.2 లక్షలు ముందే చెల్లించండి. దీని వల్ల కాలపరిమితి 13 సంవత్సరాలకు తగ్గుతుంది. ముందుగా చెల్లించడం వల్ల ఈఎంఐల సంఖ్య తగ్గుతుంది. దీని వల్ల రూ.6 నుంచి రూ.8 లక్షల వరకు వడ్డీ ఆదా అవుతుంది. ఇక ఈఎంఐ చెల్లింపులు, ముందస్తు చెల్లింపులు రెండూ ఎంచుకోవడం వల్ల కూడా లాభం జరుగుతుంది. దీని వల్ల రూ.13 నుంచి రూ.14 లక్షల వరకు మీకు ప్రయోజనం ఉంటుంది.

**ఈఎంఐ తగ్గించుకోవడం ఎలా..?**

అలాగే మీరు ఫ్లోటింగ్ వడ్డీ రేటు ఎంచుకుంటే ఆర్బీఐ వడ్డీ రేటు తగ్గించినప్పుడలా మీకు ఈఎంఐ తగ్గుతుంది. దీంతో బ్యాంక్‌కు వెళ్లి ఈఎంఐ తగ్గించమని అడగండి. దీంతో బ్యాంకులు వడ్డీ రేటు తగ్గించడం వల్ల మీకు ప్రయోజనం ఉంటుంది. ఇక ఏదైనా బ్యాంకులు వడ్డీ రేటు తక్కువగా ఉంటే.. ఈ బ్యాంక్ నుంచి ఆ బ్యాంక్‌కు మీ లోన్‌ను బదిలీ చేసుకోండి. దీన వల్ల కూడా మీకు లాభం ఉంటుంది.

## బంగారం నల్లగా మారితే అది నకిలీదేనా..? కొనేముందు ఈ జాగ్రత్తలు తప్పనిసరి..



ప్రస్తుతం బంగారం ధర తగ్గడంతో అమ్మకాలు మళ్లీ పుంజుకున్నాయి. ఇటీవల అక్షయ తృతీయ రావడంతో గోల్డ్ విక్రయాలు పెరిగాయి. అయితే గోల్డ్‌ను కొన్ని రోజులు వాడిన తర్వాత నల్లగా మారుతాయా.. నల్లగా మారితే నకిలీ గోల్డ్ అని అర్థమా.. అనే విషయాలు చూద్దాం. ప్రస్తుతం బంగారం ధరలు తగ్గుముఖం పడుతున్నాయి. ఈ ఏడాది జనవరిలో తులం బంగారం రూ.1.80 లక్షల జీవితకాలపు గరిష్ట స్థాయికి చేరుకోగా.. ఆ తర్వాత నుంచి క్రాష్ అవుతూ వస్తోంది. ప్రస్తుతం రూ.1.50 లక్షల వద్ద ఊగిసలాడుతున్నాయి. అయితే ఇండియాలో గోల్డ్ అంటేనే ప్రజలకు సెంటిమెంట్. పంక్షన్లు, పండుగలు ఏదైనా మెడలో బంగారం ఉండాల్సిందే. ధరలు పెరిగిన క్రమంలో బంగారం కొనుగోలు చేసేందుకు చాలామంది వెనకడుగు వేస్తున్నారు. ఇలాంటి సమయాల్లో కొన్నిచోట్ల మోసాలు కూడా జరుగుతున్నాయి. నకిలీ లేదా నాసిరకం బంగారాన్ని విక్రయించడం లాంటివి చోటుచేసుకుంటున్నాయి. కొన్నిసార్లు ధరించిన బంగారం నల్లబడుతుందని చాలామంది చెబుతుంటారు. అసలు బంగారం నిజంగానే నల్లబడుతుందా..? దీనికి రీజన్ ఏంటి..? అనే విషయాలు ఇప్పుడు చూద్దాం.

**నల్లగా అయితే నకిలీదా..?**

మీరు ధరించిన బంగారం నల్లగా మారిందని ఆందోళన పడుతున్నారా..? నకిలీ బంగారం అనుకుని అయోమయానికి గురవుతున్నారా..? అయితే గోల్డ్ కొంతకాలం తర్వాత నల్లబడుతుందని పరీక్షల్లో తేలింది. 24 క్యారెట్ల బంగారం నల్లబడదు. అయితే అది మృదువుగా ఉండటం వల్ల ధరించలేము. దీంతో ఆభరణాలు తయారుచేసే సమయంలో వాటిల్లో రాగి, వెండి, జింక్ లాంటివి కలుపుతారు. ఈ లోహలు గాలిలోని ఆక్సిజన్, తేమ, చెమటకు ప్రభావితం అవుతాయి. దీని వల్ల ఆక్సీకరణం జరిగి ఆభరణం ఉపరితలంపై నల్లటి పొర ఏర్పడుతుంది.

**కారణాలు ఏంటంటే..?**

చెమటలోని అధిక అమ్లత్వం గోల్డ్‌తో కలవడం వల్ల చర్య జరుగుతుంది. దీని వల్ల ఆభరణాలు నల్లగా మారుతాయి. ఇక గాలి కాలుష్యం, అధిక సల్ఫర్ బంగారాన్ని నల్లగా మారుస్తుంది. ఇక దుమ్ము, ధూళి, సబ్బు మలినాలు వంటివి కాలక్రమేణా బంగారాన్ని నల్లగా మారుస్తాయి. ఇక పెర్ఫ్యూమ్స్, లోషన్లు, మేకప్, హెయిర్ స్ప్రేలోని రసాయనాలు గోల్డ్‌ను నల్లగా మారుస్తాయి. మీరు ఇంట్లోనే ఉండి నల్లగా అయిన బంగారాన్ని మెరిసేలా చేసుకోవచ్చు. గోరువెచ్చని నీటిలో కొద్దిగా డిష్ సెప్ కలపండి. అందులో ఆభరణాన్ని 20 నిమిషాల పాటు నానబెట్టండి. ఆ తర్వాత మెత్తని టూత్ బ్రష్‌తో మెల్లగా రుద్దండి. దీని వల్ల నలుపు పోతుంది. ఇక బేకింగ్ సోడా, నీటితో చేసిన పేస్ట్ రుద్దడం వల్ల కూడా ప్రయోజనం ఉంటుంది. ఇక మీరు నకిలీ బంగారాన్ని ఎలా గుర్తించాలంటే.. నిజమైన బంగారం బరువు వల్ల నీటిలో వేస్తే వెంటనే మునిగిపోతుంది. అదే ఇతర లోహాలు కలిపిన బంగారం తేలియాడుతూ ఉంటుంది. ఇక నిజమైన బంగారం అయస్కాంతానికి ఆకర్షించబడదు. అదే అయస్కాంతానికి అతుక్కుపోతుంటే బంగారంలో ఇతర లోహాలు కలిపినట్లు అర్థం చేసుకోవచ్చు.

## పీఎఫ్ అకౌంట్ ఉన్నవారికి భారీ గుడ్ న్యూస్ ఇంటి వద్ద నుంచే యాక్టివేట్ చేసుకోవచ్చు ఎలా అంటే..?




పీఎఫ్ అకౌంట్ సేవల్లో వేగం పెరగనుంది. ఇప్పటివరకు పాత పీఎఫ్ అకౌంట్‌ను తిరిగి తెచ్చుకోవడం, యాక్టివేట్ చేసుకోవడానికి కిష్టతరమైన ప్రక్రియ ఉండేది. కానీ ఇప్పటినుంచి ఆన్‌లైన్ ద్వారా సులువుగా కనిపెట్టడంతో పాటు యాక్టివ్ చేసుకోవచ్చు. అనంతరం సులువుగా డబ్బులు విత్ డ్రా చేసుకోవచ్చు. మీరు పీఎఫ్ అకౌంట్‌ను మూడేళ్ల పాటు వాడకపోతే సిస్టమ్ ఆటోమేటిక్‌గా ఇనాక్టివ్ చేస్తుంది. మూడేళ్ల పాటు మీ అకౌంట్‌లో ఎలాంటి కాంట్రిబ్యూషన్ జమ కాకపోయినా, క్లెయిమ్స్ కోసం రిక్వెస్ట్‌లు పెట్టకపోయినా అకౌంట్ ఇనాక్టివ్ అవుతుంది. ఇలాంటి సమయంలో మీ అకౌంట్లోని డబ్బు తీసుకోవాలన్నా సాధ్యం పడదు. తిరిగి అకౌంట్‌ను యాక్టివ్ చేసుకుంటేనే డబ్బులు తిరిగి తీసుకోవచ్చు. మీరు ఇక నుంచి ఇంటి వద్దనే మొబైల్ ద్వారా అకౌంట్‌ను తిరిగి యాక్టివ్ చేసుకోవచ్చు. ఇందుకోసం ఇ-ప్రాప్తి అనే పోర్టల్‌ను కేంద్రం తీసుకొస్తుంది. త్వరలోనే దీనిని తీసుకురానున్నట్లు ఇటీవల కేంద్ర ఉపాధి, కార్మికశాఖ మంత్రి మన్సుఖ్ మాండవీయ ప్రకటించారు. పాత అకౌంట్లలో నిలిచిపోయిన డబ్బులను తిరిగి పొందటంలో ఇబ్బందులు పడుతున్న లక్షలాదిమంది ఖాతాదారులకు ఇది ఉపశమనం కలిగించే విషయమని చెప్పవచ్చు.

ఇంటి వద్ద నుంచే యాక్టివేట్

ఆధార్ ద్వారా ఖాతాదారులు పాత పీఎఫ్ అకౌంట్లను గుర్తించవచ్చు. అలాగే వాటిల్లో ఉన్న నగదును విత్ డ్రా చేసుకోవచ్చు. ఇంటి వద్ద నుంచే అకౌంట్‌ను యాక్టివేట్ చేసుకోవచ్చు. ఇప్పటివరకు పాత పీఎఫ్ అకౌంట్లను యాక్టివేట్ చేసుకోవాలన్నా లేదా అమౌంట్ క్లెయిమ్ చేసుకోవాలన్నా పాత యజమాని నుంచి ఆమోదం పొందాల్సి వచ్చేది. అలాగే పేపర్ వర్క్ కూడా చాలా ఉండేది. పాత కంపెనీలు మూతపడటం, మద్దతు ఇవ్వడంలో నిరాకరించడం వల్ల ఖాతాదారులు ఇబ్బందులు పడుతున్నారు. అయితే ఇప్పుడు కొత్తగా రానున్న ఇ-ప్రాప్తి వెబ్‌సైట్ యాజమాన్యాలపై ఆధారపడటాన్ని తగ్గిస్తుంది. ఉద్యోగులు తమ ఆధార్ ఉపయోగించి నేరుగా పాత పీఎఫ్ అకౌంట్లను యాక్టివేట్ చేసుకోవచ్చు.

# హోర్ముజ్ వ్యూహాన్ని ఛేదించిన తొలి నౌక 'సర్వశక్తి' సంక్షోభ జలాల్లో భారత్ సాహసోపేత ప్రయాణం!



మధ్యప్రాచ్యంలో ఉద్రిక్తతలు కొనసాగుతున్నాయి. ఇంధన భద్రత విషయంలో భారతదేశం ఒక కీలక విజయాన్ని అందుకుంది. అమెరికా ఆంక్షలు, ఇరాన్-ఇజ్రాయెల్ మధ్య యుద్ధ వాతావరణంతో అట్టుడుకుతున్న హోర్ముజ్ జలసంధిని భారత ఎల్‌పీజీ ట్యాంకర్ 'సర్వశక్తి' విజయవంతంగా దాటింది. దాదాపుగా నౌకల రాకపోకలు నిలిచిపోయిన ఈ ప్రమాదకర మార్గంలో, 45,000 టన్నుల గ్యాస్‌తో ఈ నౌక ప్రయాణించడం దేశీయ ఇంధన సంక్షోభానికి ఒక ఆశాకిరణంగా మారింది. మధ్యప్రాచ్యంలో ఉద్రిక్తతలు కొనసాగుతున్నాయి. ఇంధన భద్రత విషయంలో భారతదేశం ఒక కీలక విజయాన్ని అందుకుంది. అమెరికా ఆంక్షలు, ఇరాన్-ఇజ్రాయెల్ మధ్య యుద్ధ వాతావరణంతో అట్టుడుకుతున్న హోర్ముజ్ జలసంధిని భారత ఎల్‌పీజీ ట్యాంకర్ 'సర్వశక్తి' విజయవంతంగా దాటింది. దాదాపుగా నౌకల రాకపోకలు నిలిచిపోయిన ఈ ప్రమాదకర మార్గంలో, 45,000 టన్నుల గ్యాస్‌తో ఈ నౌక ప్రయాణించడం దేశీయ ఇంధన సంక్షోభానికి ఒక ఆశాకిరణంగా మారింది. మార్షల్ దీవుల జెండాతో పయనిస్తున్న 'సర్వశక్తి', ఇరాన్‌లోని లారాక్, ఖేష్మ్ దీవులకు సమీపంగా ప్రయాణించింది. ఇరాన్ నిర్దేశించిన ప్రత్యేక మార్గాన్ని అనుసరిస్తూ శనివారం (మే 02) ఒమన్ గల్ఫ్‌లోకి ప్రవేశించింది. ఈ నౌకలో 18 మంది భారతీయ సిబ్బంది ఉన్నారు. ఇరాన్ ఉద్రిక్తతల నేపథ్యంలో, తమ నౌకల్లో భారతీయులు ఉన్నారనే సమాచారాన్ని బహిరంగంగా ప్రసారం చేయడం ఇప్పుడు ఒక తప్పనిసరి భద్రతా చర్యగా మారింది. ఫిబ్రవరిలో పర్షియన్ గల్ఫ్‌లోకి ప్రవేశించిన ఈ నౌక, దుబాయ్ సమీపంలో 'షిప్-టు-షిప్' పద్ధతిలో సరుకును సేకరించింది. అయితే, ఎలక్ట్రానిక్ అంతరాయాల కారణంగా ఓడ ఖచ్చితమైన ఉనికిని గుర్తించడం సవాలుగా మారింది. ఇదిలావుంటే, ప్రస్తుతం భారత్ తీవ్రమైన ఎల్‌పీజీ కొరతను ఎదుర్కొంటోంది. ప్రపంచంలోనే రెండవ అతిపెద్ద ఎల్‌పీజీ వినియోగదారుగా ఉన్న భారత్‌లో, మధ్యప్రాచ్యం నుండి సరఫరా నిలిచిపోవడంతో గ్యాస్ సిలిండర్ల కోసం వినియోగదారులు బారులు తీరుతున్నారు. దేశీయంగా ఎల్‌పీజీ ఉత్పత్తిని రోజుకు 54,000 టన్నులకు పెంచినప్పటికీ, వినియోగం 80,000 టన్నులుగా ఉంది. ఈ లోటును పూడ్చేందుకు ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ వంటి ప్రభుత్వ సంస్థలు సాహసోపేత నిర్ణయాలు తీసుకుంటున్నాయి. 'సర్వశక్తి' మోసుకొస్తున్న సరుకు విశాఖపట్నం టెర్మినల్‌కు చేరడమే లక్ష్యంగా పెట్టుకుంది. హోర్ముజ్ జలసంధిలో గతంలో 'దేశ్ గరిమ' వంటి నౌకలు ట్రాన్స్‌పాండర్లను ఆపివేసి తృటిలో ప్రమాదాల నుండి తప్పించుకున్నాయి. ఏప్రిల్‌లో పరిస్థితి మరింత విషమించి, నౌకలపై కాల్పులు జరిగిన తరుణంలో భారత్ తన దౌత్య మార్గాలను ఉపయోగించింది. టెహ్రాన్‌తో జరిపిన చర్చల ఫలితంగా ఇప్పటికే ఎనిమిది నౌకలను దారి మళ్లించడంలో భారత్ సఫలమైంది. అమెరికా దిగ్బంధనం తర్వాత ఈ మార్గం గుండా ప్రయాణించిన తొలి ట్యాంకర్‌గా 'సర్వశక్తి' నిలిచింది. ఇది కేవలం ఒక నౌక ప్రయాణం మాత్రమే కాదు, అంతర్జాతీయ సంక్షోభాల మధ్య తన ఇంధన అవసరాలను తీర్చుకోవడంలో భారతదేశం ప్రదర్శిస్తున్న పట్టుదలకు, దౌత్య చాకచక్యానికి నిదర్శనం. విశాఖ తీరానికి ఈ నౌక చేరడం కోట్లాది భారతీయ కుటుంబాల వంటగదులకు భరోసానివ్వనుంది.

# రైలు ఆలస్యమైనందుకు ప్రయాణికుడికి రూ.1.25 లక్షలు చెల్లించిన రైల్వే.. అసలేమైందంటే..!




ఫోరం ఆదేశించిన విధంగా 30 రోజులలోగా రైల్వేలు ఉత్తర్వును అమలు చేయడంలో విఫలమవడంతో మొత్తం బాధ్యత గణనీయంగా పెరిగింది. ఉత్తర్వును పాటించని ప్రతి రోజుకు రూ.500 అదనపు జరిమానా చెల్లించాలని కూడా ఫోరం రైల్వేలను ఆదేశించింది. ఈ నివేదిక ప్రకారం.. రైలు టిక్కెట్టు బుక్ చేసుకున్న వ్యక్తికి తమ గమ్యస్థానానికి సమయానికి చేరుకునే హక్కు ఉంటుంది. అయితే, రైలు గంటల తరబడి ఆలస్యంగా వచ్చి, ఆ జాప్యం కారణంగా ప్రయాణికుడు నష్టపోతే, రైల్వేలు వారికి నష్టపరిహారం చెల్లించాలి. ఒడిశాలోని జిల్లా వినియోగదారుల వివాదాల పరిష్కార కమిషన్ (బలంగీర్) ఇదే విధమైన తీర్పును జారీ చేసింది.

**అసలేమైంది..?**

హెచ్‌టిలోని ఒక నివేదిక ప్రకారం, ఈ కేసు బోలంగీర్ జిల్లా నివాసి అయిన చండీ ప్రసాద్ ఖమారికి సంబంధించినది. అతను 2024 ఆగస్టు 23న ఝార్సుగూడ నుండి ఒడిశాలోని హౌరాకు వెళ్లే 12129 నంబర్ రైలులో టిక్కెట్ బుక్ చేసుకున్నాడు. ఆ రైలు ఝార్సుగూడ నుండి రాత్రి 7:50 గంటలకు బయలుదేరి, హౌరాకు తెల్లవారుజామున 3:55 గంటలకు చేరుకుంటుంది. ఈ షెడ్యూల్ ఆధారంగా అతను కోల్‌కతా విమానాశ్రయం నుండి గౌహతికి ఉదయం 8:05 గంటలకు బయలుదేరే విమాన టిక్కెట్‌ను బుక్ చేసుకున్నాడు. అంటే అతనికి నాలుగు గంటలకు పైగా అదనపు సమయం ఉంది.

**రైలు ఆలస్యంగా వచ్చింది:**

ప్రయాణం చేయాల్సిన రోజున రైలు ఝార్సుగూడ నుండి రెండు గంటలు ఆలస్యంగా బయలుదేరింది. ఉదయానికి అది హౌరా చేరుకునేసరికి ఏడు గంటలు ఆలస్యమైంది. ఇలాంటి పరిస్థితిలో అతను విమానాన్ని మిస్ అవ్వాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఇప్పుడు ఖమారి గౌహతికి వెళ్లే మరో విమానంలో టిక్కెట్టు బుక్ చేసుకున్నాడు. కానీ అది చాలా ఖరీదైనదిగా తేలింది. ఇక మానసిక వేదన అనేది వేరే విషయం. దీని తర్వాత, నష్టానికి పరిహారం చెల్లించమని కోరుతూ అతను రైల్వేకు లేఖలు రాశాడు . అనేకసార్లు లేఖలు రాసినప్పటికీ రైల్వే అతనికి నష్టపరిహారం చెల్లించలేదు. దీంతో అతను నిరాశ చెంది వినియోగదారుల ఫోరమ్‌ను ఆశ్రయించాడు.

**రైల్వే ఏం చెబుతోంది?**

వినియోగదారుల ఫోరమ్‌లో రైల్వే అధికారులు, ఇండియన్ రైల్వే కాన్ఫరెన్స్ అసోసియేషన్ కోచింగ్ టారిఫ్ నిబంధనల ప్రకారం రైలు సమయపాలనకు హామీ లేదని, కార్యాచరణ కారణాల వల్ల రైళ్లు ఆలస్యం కావచ్చని వాదించారు. ప్రయాణంలోని కొన్ని భాగాలు తమ అధికార పరిధిలోకి రావని కూడా వారు పేర్కొన్నారు. రైల్వే వాదనలను జిల్లా వినియోగదారుల ఫోరమ్ తిరస్కరించింది. రైల్వే ఒక ఏకీకృత ప్రజా వినియోగ సేవ కాబట్టి, దాని కార్యకలాపాల ప్రాంతం వల్ల కలిగే రైలు ఆలస్యాలకు ఆ ఆలస్యం తమ నియంత్రణకు మించినదని నిరూపించనంత వరకు రైల్వేనే బాధ్యత వహించాలని ఫోరం పేర్కొంది. నార్త్ వెస్ట్రన్ రైల్వే, ఇతరులు వర్సెస్ సంజయ్ శుక్లా కేసులో సుప్రీంకోర్టు తీర్పును ఉటంకిస్తూ, బాధ్యత నుండి తప్పించుకోవాలంటే రైల్వే అధికారులు ఆ ఆలస్యం అనివార్యమని, తమ నియంత్రణకు మించినదని నిరూపించాల్సి ఉంటుందని ఫోరం పేర్కొంది. ఆ ఆలస్యం అసాధారణ పరిస్థితుల కారణంగా జరిగిందని నిరూపించడానికి రైల్వే ఎటువంటి ఆధారాలు చూపలేదని వినియోగదారుల ఫోరం తెలిపింది.

**అది తన తీర్పును ఇచ్చింది**

ఈ కేసులో "రైలు సర్వీసులో విపరీతమైన ఆలస్యం కారణంగా ఫిర్యాదుదారుడు తన విమానాన్ని కోల్పోయి, అపారమైన నష్టాన్ని, మానసిక వేదనను అనుభవించాడు" అని ఫోరం పేర్కొంది. ఈ ఆలస్యం పరిణామాలకు రైల్వేలు ఉమ్మడిగా, విడివిడిగా బాధ్యత వహించాలని ఫోరం తెలిపింది. విమానం కోల్పోవడం, తిరిగి బుకింగ్ చేసుకోవడం వల్ల కలిగిన నష్టానికి రూ. 20,000, మానసిక వేదన, వేధింపులకు రూ.30,000, వ్యాజ్యపు ఖర్చులను భరించడానికి రూ. 5,000 చెల్లించాలని ఫోరం రైల్వేలను ఆదేశించింది. ఫోరం ఆదేశించిన విధంగా 30 రోజులలోగా రైల్వేలు ఉత్తర్వును అమలు చేయడంలో విఫలమవడంతో మొత్తం బాధ్యత గణనీయంగా పెరిగింది. ఉత్తర్వును పాటించని ప్రతి రోజుకు రూ.500 అదనపు జరిమానా చెల్లించాలని కూడా ఫోరం రైల్వేలను ఆదేశించింది. ఈ నివేదిక ప్రకారం, 200 రోజులకు పైగా ఉత్తర్వు అమలు కాకపోవడంతో సుమారు రూ.1.3 లక్షల జరిమానా పేరుకుపోయింది. ప్రయాణికుడు ఏప్రిల్ 19న సదరు మొత్తాన్ని అందుకున్నాడు.

# వామ్మో వచ్చే 5 ఏళ్లలో బంగారం ధర అంత పెరుగుతుందా ఈ లెక్కలు చూస్తే మైండ్ బ్లాంకే..



బంగారం అంటే భారతీయులకు ఆదుకునే నిజమైన నేస్తం. ప్రస్తుతం బంగారం ధరలు కొంత తగ్గుముఖం పట్టడంతో ఊపిరి పీల్చుకుంటున్న సామాన్యులకు.. డాయిష్ బ్యాంక్ షాకింగ్ నివేదిక ఇప్పుడు కంటిమీద కునుకు లేకుండా చేస్తోంది. వచ్చే ఐదేళ్లలో బంగారం ధర ఏకంగా 80 శాతం పెరగబోతోందన్న అంచనాలు గుబులు రేపుతున్నాయి. ఆ వివరాలు ఈ స్టోరీలో తెలుసుకుందాం.. బంగారం.. భారతీయులకు కేవలం ఒక ఆభరణం మాత్రమే కాదు, ఒక సురక్షితమైన పెట్టుబడి. గత కొన్ని నెలలుగా ఒక నిర్దిష్ట పరిధిలోనే కదులుతున్న బంగారం ధరలు, త్వరలోనే రాకెట్ వేగంతో దూసుకెళ్తాయని నిపుణులు హెచ్చరిస్తున్నారు. జర్మనీకి చెందిన అంతర్జాతీయ పెట్టుబడి బ్యాంక్ డాయిష్ బ్యాంక్ విడుదల చేసిన తాజా నివేదిక ఇప్పుడు ప్రపంచ మార్కెట్లలో ప్రకంపనలు సృష్టిస్తోంది. గత ఏడాది అక్టోబర్ నుండి ఈ ఏడాది జనవరి వరకు ప్రతిరోజూ కొత్త రికార్డులను సృష్టించిన బంగారం ధరలు, ఆ తర్వాత కొంత తగ్గుముఖం పట్టాయి. ప్రస్తుతం చెన్నై మార్కెట్‌లో 8 గ్రాములు బంగారం ధర రూ.1.20 లక్షల లోపే ఉంది. అయితే ఇది కేవలం తుఫాను ముందు వచ్చే నిశబ్దం మాత్రమేనని డాయిష్ బ్యాంక్ అంచనా వేస్తోంది. వచ్చే ఐదేళ్లలో బంగారం ధర ఏకంగా 80 శాతం వరకు పెరిగే అవకాశం ఉందని ఆ బ్యాంక్ విశ్లేషించింది. ప్రస్తుతం అంతర్జాతీయ మార్కెట్‌లో ఒక ఔన్స్ బంగారం ధర సుమారు 4,600 డాలర్లుగా ఉంటే, అది ఐదేళ్లలో 8,000 డాలర్లకు చేరుకుంటుందని ఈ నివేదిక సారాంశం. ఈ లెక్కన మన దేశీయ మార్కెట్‌లో ప్రస్తుతం గ్రాము బంగారం ధర రూ.15, 093 ఉండగా, అది భవిష్యత్తులో రూ. 25,000 వరకు వెళ్లవచ్చు. అంటే ఒక 8 గ్రాములు బంగారం ధర రూ. 2 లక్షల భారీ మైలురాయిని చేరుకోవడం ఖాయమని తెలుస్తోంది.

**ధరలు ఎందుకు పెరుగుతాయి?**

కేంద్ర బ్యాంకుల బంగారు వేట

ప్రపంచవ్యాప్తంగా ఉన్న వివిధ దేశాల కేంద్ర బ్యాంకులు తమ విదేశీ మారక నిల్వల్లో బంగారం వాటాను భారీగా పెంచుకోనున్నాయి. ప్రస్తుతం ఉన్న 30శాతం నుండి 40శాతం వరకు నిల్వలను పెంచుకోవాలని బ్యాంకులు భావిస్తున్నాయి. దీనివల్ల మార్కెట్‌లో బంగారం కొనుగోళ్లు విపరీతంగా పెరిగి, ధరలకు రెక్కలు వస్తాయి.

**డాలర్‌కు ప్రత్యామ్నాయంగా..**

అమెరికా వంటి దేశాలు విధిస్తున్న ఆర్థిక ఆంక్షల నుండి రక్షణ పొందేందుకు అభివృద్ధి చెందుతున్న దేశాలు ప్రత్యామ్నాయ మార్గాలను వెతుకుతున్నాయి. అమెరికా డాలర్ నిల్వలను 60శాతం నుండి 40శాతంకి తగ్గించుకుని, ఆ నిధులతో సురక్షితమైన బంగారాన్ని కొనుగోలు చేసేందుకు మొగ్గు చూపుతున్నాయి.


**కొత్త దేశాల మధ్య పోటీ**

గతంలో కేవలం భారత్, చైనా, రష్యా, టర్కీలు మాత్రమే బంగారం కొనుగోళ్లలో ముందుండేవి. కానీ ఇప్పుడు కజకిస్తాన్, సౌదీ అరేబియా, ఖతార్ వంటి దేశాలు కూడా భారీ ఎత్తున బంగారాన్ని నిల్వ చేయడం ప్రారంభించాయి. ఈ కొత్త దేశాల పోటీ కూడా ధరల పెరుగుదలకు ప్రధాన కారణం కానుంది.కాగా అంతర్జాతీయ భౌగోళిక రాజకీయ పరిస్థితులు, ఆర్థిక మార్పుల దృష్ట్యా, బంగారం వైపు ప్రపంచం మొత్తం చూపు సారిస్తోంది. ఐదేళ్లలో బంగారం ధర 80శాతం పెరుగుతుందన్న అంచనాలు నిజమైతే, సామాన్యులకు పసిడి ఆభరణాలు మరింత భారమయ్యే అవకాశం ఉంది. కానీ పెట్టుబడి కోణంలో చూసే వారికి మాత్రం ఇది ఒక గొప్ప అవకాశంగా మారనుంది.

# దురంధర్2

## కలెక్షన్ల దూకుడు

తన నటజీవితాన్ని గుర్తు చేసుకున్న గౌరవ




ఆదిత్య ధర్ దర్శకత్వంలో రణవీర్ సింగ్ ప్రధాన పాత్రలో నటించిన స్పై థ్రిల్లర్ 'ధురంధర్ 2' బాక్సాఫీస్ వద్ద రికార్డుల సునామీ సృష్టిస్తోంది. విడుదలైన నాలుగు రోజుల్లోనే ఈ చిత్రం చారిత్రక వసూళ్లను సాధించి, హిందీ సినీ చరిత్రలో సరికొత్త మైలురాళ్లను నెలకొల్పింది. నాలుగు రోజుల్లోనే 'ధురంధర్ 2' ప్రపంచవ్యాప్తంగా రూ.750 కోట్ల కలెక్షన్లతో దూసుకుపోతోంది. బుధవారం జరిగిన పెయిడ్ ప్రివ్యూల ద్వారానే రూ.43 కోట్లు సాధించిన ఈ సినిమా, ఆదివారం ఒక్కరోజే దేశీయంగా అత్యధికంగా రూ.115 కోట్లు వసూలు చేసి రికార్డు సృష్టించింది. హిందీ చిత్రసీమలో షారుఖ్ ఖాన్ 'పఠాన్' నెలకొల్పిన రూ. 287 కోట్ల ఓపెనింగ్ వీకెండ్ రికార్డును 'ధురంధర్ 2' సునాయాసంగా అధిగమించింది. ఓవర్సీస్ మార్కెట్‌లో కూడా రూ.180 కోట్లు వసూళ్లతో ఈ చిత్రం ప్రభంజనం సృష్టిస్తోంది. ఇకపోతే 'ధురంధర్ 2' సంచలనం సృష్టిస్తోన్న వేళ.. ఇందులో కీలకపాత్రలో నటించిన సీనియర్ నటుడు గౌరవ్ తన జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. ఈ చిత్రంలో మహమ్మద్ ఆలం పాత్రతో మెప్పించిన ఆయన తాజాగా ఓ లేఖను పంచుకున్నారు. 1998లో తాను ఇండస్ట్రీకి వచ్చిన తొలినాళ్లలో తన తల్లిదండ్రులకు రాసిన లేఖను షేర్ చేశారు. ఢిల్లీ నుంచి ముంబయి వచ్చిన రోజుల్లో తన ఆర్థిక ఇబ్బందులను అందులో ప్రస్తావించారు.

'ఇది 1998లో మా అమ్మనాన్నలకు రాసిన లేఖ. నేను ముంబయికి వచ్చి అప్పటికి నెల రోజులు కూడా కాలేదు. అప్పట్లో ఈమెయిల్‌లు లేవు, కేవలం ఉత్తరాలే. ఆ తర్వాత టీవీ, సినిమాలు, యాడ్స్, రేడియో, రీల్స్.. ఇలా ఎన్నో ఒడుదొడుకులతో నా ప్రయాణం సాగింది.

అప్పట్లో నా భవిష్యత్తు ఎలా ఉంటుందో తెలియదు కానీ, నేనెప్పుడూ ఆశను కోల్పోలేదు.




## బైకర్ ట్రైలర్‌కు ప్రభాస్ ప్రంశసలు

టాలీవుడ్ ఛార్మింగ్ స్టార్ శర్వానంద్ హీరోగా నటిస్తున్న లేటెస్ట్ చిత్రం బైకర్ ఇప్పటికే సినీ వర్గాల్లో సాలిడ్ బజ్ క్రియేట్ చేసింది. ఇండియాలోనే తొలి మోటోక్రాస్ రేసింగ్ బ్యాక్‌డ్రాప్‌లో తెరకెక్కుతున్న ఈ సినిమా తన కాన్సెప్ట్‌తో ప్రత్యేక గుర్తింపును సంపాదించింది. తాజాగా విడుదలైన ట్రైలర్ ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకుంటూ సోషల్ మీడియాలో ట్రెండింగ్‌లో నిలుస్తోంది. ఈ ట్రైలర్‌పై పాన్ ఇండియా స్టార్ ప్రభాస్ స్పందించడం మరింత ఆసక్తిని రేకెత్తించింది. తన ఇన్‌స్టాగ్రామ్ వేదికగా ప్రభాస్ 'బైకర్ ట్రైలర్ వైబ్ అదిరిపోయింది' అంటూ ప్రశంసలు కురిపించాడు. ట్రైలర్ చాలా ఎంగేజింగ్‌గా ఉందని, సినిమా టీమ్‌కు తన శు భాకాంక్షలు తెలియజేశాడు. ముఖ్యంగా శర్వానంద్‌తో పాటు నిర్మాణ సంస్థకు కూడా విజయాన్ని కోరుకున్నాడు. ఈ ట్రైలర్‌లో హై-ఆక్టేన్ రేసింగ్ సీన్స్, ఎమోషనల్ ఎలిమెంట్స్, ఫ్యామిలీ బ్యాక్‌డ్రాప్ అన్నీ బ్యాలెన్స్‌డ్ చూపించడం విశేషం. శర్వానంద్ పూర్తిగా కొత్త లుక్‌లో కనిపిస్తూ, రేసర్ పాత్రలో తన ట్రాన్స్‌ఫర్మేషన్‌తో ఆకట్టుకుంటున్నాడు. మరోవైపు సీనియర్ నటుడు రాజశేఖర్ పవర్‌ఫుల్ పాత్రలో కనిపించనుండటం సినిమాపై ఆసక్తిని మరింత పెంచుతోంది. ఈ చిత్రంలో హీరోయిన్‌గా మాళవిక నాయర్ నటిస్తుండగా, భారీ తారాగణం ఈ ప్రాజెక్ట్‌లో భాగమైంది. దర్శకుడు అభిలాష్ రెడ్డి ఈ చిత్రాన్ని స్టైలిష్ రేసింగ్ డ్రామాగా రూపొందిస్తున్నారు.



## నాపేరుతో ఎలాంటి వ్యాపారాలు లేవు


ఎవరైనా మోసం చేయాలని చూసే ఫిర్యాదు చేయండి
గాయని మంగ్లీ ప్రకటన విడుదల

ప్రఖ్యాత ఫోక్ సింగర్ మంగ్లీ పేరుతో మైక్రో ఫైనాన్స్ వ్యాపారం జరుగుతోందని వస్తున్న వార్తలపై ఆమె ఘాటుగా స్పందించారు. తనకు అలాంటి వ్యాపారాలతో సంబంధం లేదని స్పష్టం చేస్తూ, సోషల్ మీడియా వేదికగా ఓ అధికారిక ప్రకటన విడుదల చేశారు. ఇటీవల కొందరు వ్యక్తులు మంగ్లీ పేరును ఉపయోగిస్తూ మైక్రో ఫైనాన్స్ పేరిట డబ్బులు వసూలు చేస్తున్నారనే వార్తలు వెలుగులోకి వచ్చాయి. ఈ నేపథ్యంలో ఆమె స్పందిస్తూ, 'నా పేరుతో డబ్బులు సేకరిస్తున్నారని వస్తున్న వార్తలు పూర్తిగా అసత్యం. నాకు ఆ వ్యక్తులతో గానీ, వార్గి ÷నాన్స్ వ్యాపారాలతో గానీ ఎలాంటి సంబంధం లేదని తెలిపారు. మంగ్లీ తన ప్రకటనలో , తనను మరియు తన కుటుంబ సభ్యులను చాలా మంది ప్రొఫెషనల్ ఈవెంట్స్ కోసం సంప్రదిస్తుంటారని చెప్పారు. అయితే, ఆ ఈవెంట్స్‌కు సంబంధించిన ఆహ్వానాల వరకే తమకి పరిచయం ఉంటుందని, ఎలాంటి బాధ్యత వహించబోమని స్పష్టం చేశారు.

## రౌడీ జనార్ధన్ మూవీ కోసం విజయ్ కసరత్తు

టాలీవుడ్ యాక్టర్ విజయ్ దేవరకొండ బ్యాక్ టు బ్యాక్ సినిమాలను లైన్‌లో పెట్టాడు. వీటిలో ఒకటి రాహుల్ సంకీర్త్యన్‌తో చేస్తున్న పీరియడ్ యాక్షన్ డ్రామా. విజయ్ మరోవైపు దిల్ రాజు నిర్మాణంలో రవికిరణ్ కోలా దర్శకత్వంలో ఓ రూరల్ మాస్ డ్రామాకు కమిటవగా..

ఈ చిత్రానికి రౌడీ జనార్ధన అనే టైటిల్ కూడా ఖరారు చేశారు. తాజాగా ఈ చిత్రానికి సంబంధించిన ఆసక్తికర వార్త ఒకటి నెట్టింట వైరల్ అవుతోంది. ఈ చిత్రంలో గ్రాండ్ స్కేల్‌లో ఉండబోయే యాక్షన్ సీక్వెన్స్‌ను విజయ్ టీం డిజైన్ చేస్తుందట. ముంబై స్లమ్స్ ఏరియాలో రాబోయే హై ఆక్టేన్ ఫైట్ సీక్వెన్స్ సినిమాకే హైలెట్‌గా నిలువబోతుందట. ఇంటెన్స్, రియలిస్టిక్ యాక్షన్ ఎక్స్‌పీరియన్స్ అందించేలా ఈ ఎపిసోడ్ ఉండనుందిని ఇన్‌సైడ్ టాక్. ఇప్పటికే విజయ్ దేవరకొండ ట్రాన్స్‌ఫార్మేషన్ సినిమాపై మంచి బజ్ క్రియేట్ చేస్తుంది. రాయలసీమ బ్యాక్‌డ్రాప్‌లో రియల్ మాస్ ఎంటర్‌టైనర్‌గా రాబోతున్న ఈ చిత్రంలో విజయ్ పాత్ర పేరు జనార్ధన్ కాగా, ఆయన నాన్న పేరు కూడా జనార్ధనేనని ఇన్‌సైడ్ టాక్. విజయ్ దేవరకొండకు 'రౌడీ' అనే ట్యాగ్ ఎప్పటి నుంచో ఉంది. ఇప్పుడు రౌడీ టైటిల్‌తో సినిమా వస్తుండడంతో ఫ్యాన్స్ అంతా ఫుల్ ఖుషీ అవుతున్నారు. ఈ సినిమాతో విజయ్ తన విశ్వరూపం చూపించనున్నాడని కామెంట్ చేస్తున్నారు.




## మేన రిలీజ్ కానున్న గాయపడ్డ సింహం




టాలీవుడ్ యాక్టర్ కమ్ డైరెక్టర్ తరుణ్ భాస్కర్ టైటిల్ రోల్‌లో నటిస్తోన్న చిత్రం 'గాయపడ్డ సింహం మూవీ కశ్యప్ శ్రీనివాస్ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రంలో ఫరియా అబ్దుల్లా, మానసా చౌదరి హీరోయిన్లుగా నటిస్తున్నారు. డైరెక్టర్ పవన్ సాధినేని సమర్పకుడిగా వ్యవహరిస్తున్నాడు. రీసెంట్‌గా ఈ సినిమాకు సంబంధించి టీజర్, ట్రైలర్ కలయికతో 'ట్రైజర్'ను తాజాగా విడుదల చేయగా.. మంచి స్పందన వస్తోంది. టైజర్ సైటైరికల్ కామెడీ బ్యాక్ డ్రాప్‌లో యాక్షన్ ఎలిమెంట్స్ తో కలయికతో ఫన్‌గా సాగుతూ మూవీ లవర్స్‌లో క్యూరియాసిటీ పెంచుతోంది. అమెరికా వెళ్లాలని కలలు కనే ఓ యువకుడి జీవితంలో చోటుచేసు కునే సంఘటనల చుట్టూ సినిమా తిరుగుతుందని టైజర్‌తో హింట్ ఇచ్చాడు. ఆ యువకుడు వీసా రిజెక్ట్ కావడంతో అతడు ఎదుర్కొనే నిరాశ, ఫ్రస్ట్రేషన్, ఆ తర్వాత తీసుకునే నిర్ణయాలు కథకు ప్రధానాంశాలుగా ఉంటాయని ట్రైజర్ హింట్ ఇచ్చేస్తుంది. మధ్య మధ్యలో వచ్చే యాక్షన్ ఎపిసోడ్‌లు, కేజీఎఫ్ స్పూఫ్ సన్నివేశాలు, అమెరికా వెళ్లకపోయినా హీరో ఇచ్చే బిల్డప్ డైలాగులు వినోదాన్ని పంచుతున్నాయి.

ప్రత్యేకంగా ట్రైజర్‌లో అమెరికా మాజీ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌ను సూచించే విధంగా చూపించిన సన్నివేశాలు ప్రస్తుతం వైరల్ అవుతున్నాయి. అమెరికా వీసా నిబంధనల వల్ల ఇబ్బందులు ఎదుర్కొంటున్న యువత ఆవేదనను ప్రతిబింబించే ప్రయత్నం చేసినట్లు అనిపిస్తోంది.

printed , published and owned by DR.B.ANILKUMAR ,@ 407 THARNAKA , HYDERABAD , Telangana state.published at DAIWIK PUBLICATIONS pvt.ltd.printed at SNEHITHA PRINTERS H.NO : 2-6 , Warangal Dist.Telangana state ,EDITOR DR.B.ANILKUMAR ,RNI NO TELTEL/2021/ 81079 , cell : 7702866885 ,vijethatelugudaily@gmail.com